తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

# జనంసాక్షి

Estd : 2002

www.janamsakshi.org

సోమవారం 12.10.2026 | సంపుటి : 13 సంచిక : 83 | పేజీలు : 12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






## ఎవరినీ నిర్బంధించొద్దు

- అరెస్టు చేసిన వారిని విడుదల చేయండి
- మెట్రోసేవలు, ఇంటర్నెట్ పునరుద్ధరించండి
- కేంద్రం, ఢిల్లీ పోలీసులకు సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ రాజధాని దిల్లీలో సీజేపీ చేపట్టిన ఆందోళనలు.. పోలీసుల కట్టడి చర్యలపై పలువురు న్యాయవాదులు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. దిల్లీలో ఇంటర్నెట్, మెట్రో సేవలు పునరుద్ధరించాలని ఆదేశాలు జారీ చేసింది. అంతకు ముందు.. తాము

మిగతా 2లో..

# రాజు ప్రాణం చిలకలో ఉంది

# మోదీ ప్రాణం జ్ఞానేశ్‌లో ఉంది

## సీఈసీ గద్దెదిగేవరకు పోరు ఆగదు: సీజేపీ

"దేశంలో భయానక వాతావరణం సృష్టించారని, ఇదంతా కేవలం ఒక వ్యక్తిని కాపాడేందుకు జరుగుతోంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను రక్షించే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ పోరాటంలో తాము వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. ఢిల్లీలో శనివారం ఎమర్జెన్సీ తరహా పరిస్థితులు కనిపించాయి. రైళ్లు, ఇంటర్నెట్ సేవలు నిలిపివేసి ప్రజలను ఇబ్బంది పెట్టారు. గతంలో ఎమర్జెన్సీ గురించి విన్నాం.. ఇప్పుడు ప్రత్యక్షంగా చూశాం. జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడేందుకు మోదీ, అమిత్ షా ప్రయత్నిస్తు న్నారు. ఆయన్ను కాపాడేందుకు దేశ ప్రజలతోనే యుద్ధం చేస్తున్నారు" - సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్



సీఈసీ జ్ఞానేశ్‌కి వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలు ఆందోళన

- జ్ఞానేశ్‌ను కాపాడేందుకు ప్రజలతోనే యుద్ధం చేస్తున్నారు
- దేశంలో భయానక వాతావరణం సృష్టించారు
- గతంలో ఎమర్జెన్సీ గురించి విన్నాం.. ఇప్పుడు ప్రత్యక్షంగా చూశాం
- రైళ్లు, ఇంటర్నెట్ సేవలు నిలిపివేసి ప్రజలను ఇబ్బంది పెట్టారు
- మీడియా సమావేశంలో కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధి సౌరవ్ దాస్



న్యూఢిల్లీ(జనంసాక్షి): దిల్లీ పోలీసులు బలవంతంగా విమానంలోకి ప్రవేశించి తమను కిడ్నాప్ చేశారని కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధి సౌరవ్ దాస్ ఆరోపించారు. ఆ సమయంలో తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని, తమ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారని, న్యాయవాదిని సంప్రదించేందుకు కూడా అనుమతించలేదని తెలిపారు. ఆదివారం విడుదలైన అనంతరం దిల్లీలో సీజేపీ ప్రతినిధులు మీడియా సమావేశం నిర్వహించారు. సౌరవ్ దాస్ మాట్లాడుతూ.. దేశంలో భయానక

మిగతా 2లో..

# ఢిల్లీలో మళ్లీ ఉత్కంఠ

## కన్నాట్‌ప్లేస్‌లో ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ సంఘాల నిరసన

## మరోసారి చోటుచేసుకన్న తీవ్ర ఉద్రిక్తతలు.. ఆందోళనకారుల అరెస్ట్

న్యూఢిల్లీ(జనంసాక్షి): దేశరాజధానిలో మరోసారి ఉద్రిక్తతలు చెలరేగాయి. సీఈసీకి వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. కన్నాట్ ప్లేస్‌లో ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ సంఘాలు నిరసన చేపట్టడంతో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలపై భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాసినట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ వెల్లడించారు. సోమవారం సాయంత్రం

మిగతా 2లో..

### సీజేపీ నేతల విడుదల

ఢిల్లీలో భారీ భద్రతా ఏర్పాట్లు

2లో..








## యువత రాజకీయాల్లోకి రాకుండా

# మోదీ అడ్డుకుంటున్నారు

- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ పేరుతో ప్రధాని మోదీ పేదల ఓట్లను తొలగిస్తున్నారు
- గోవాను డ్రగ్స్ పెడ్లర్లకు అడ్డాగా మార్చారు : ఆ రాష్ట్ర పర్యటనలో సీఎం రేవంత్

పనాజీ(జనంసాక్షి):గోవాలోని భూములు అన్యాక్రాంతమవుతున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. భాజపాతో ఇక్కడి ప్రజలు విసిగిపోయారని చెప్పారు. గోవా సీఎం ప్రమోద్ సావంత్ కాదు.. ప్రాపర్టీ సావంత్ అంటున్నారని వ్యాఖ్యానించారు. గోవా పర్యటనకు వెళ్లిన ఆయన.. అక్కడ ఏర్పాటు చేసిన 'గోయ్ రాఖోన్న్' యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దిల్లీలో నిరసనల వల్ల రాహుల్ గాంధీ రాలేకపోయారని, ఆయన ప్రతినిధిగా ఇక్కడికి వచ్చానని చెప్పారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ పేరుతో ప్రధాని మోదీ.. పేదల ఓట్లను తొలగిస్తున్నారని విమర్శించారు. పేదలు, దళితులు, మైనారిటీలు, ఆదివాసీల ఓట్లను

మిగతా 2లో..

రాహుల్‌గాంధీ ప్రతినిధిగా నేను గోవాకు వచ్చా. రాహుల్‌గాంధీ దిల్లీలో నిరసనల వల్ల గోవా రాలేకపోయారు. జ్ఞానేశ్‌కుమార్ పేరుతో మోదీ పేదల ఓట్లను తొలగింస్తున్నారు. గోవా ప్రజలు బీజేపీతో విసిగిపోయారు. గోవాలోని భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. గోవా సీఎం ప్రమోద్ సావంత్ కాదు. ప్రాపర్టీ సావంత్ అంటున్నారు.గోవా యువతను డ్రగ్స్‌కు బానిసలుగా మార్చారు. ఈ రాష్ట్రాన్ని డ్రగ్స్ పెడ్లర్ల అడ్డాగా మార్చారు. రెండుసార్లు గోవా ప్రజలు మోసపోయారు. మూడోసారి భాజపాను నమ్మి గోవా ప్రజలు మోసపోవద్దు. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావాల్సిన అవసరం ఉంది - సీఎం రేవంత్ రెడ్డి

# మనం కోరుకునే భారత్ ఇది కాదు

దేశ గొంతుకను అణగదొక్కలేరు : రాహుల్

- శాంతియుతంగా నిరసన తెలిపేందుకు ఢిల్లీకి తరలివచ్చిన యువతపై దాడులు జరిగాయి
- సోమవారం పార్టీలు, వర్గాలకు అతీతంగా దేశమంతా కలిసి సుప్రీంకోర్టు వరకు పాదయాత్ర చేస్తాం : రాహుల్
- దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితి
- ప్రధాని మోదీ, అమిత్ షా దేశంలో అరాచక పరిస్థితులను సృష్టిస్తున్నారు
- ఈసీ వ్యవహారంపై సీజేఐకు లేఖ రాశాం: మల్లికార్జున ఖర్గే



న్యూఢిల్లీ(జనంసాక్షి):శాంతియుతంగా నిరసన తెలిపేందుకు దిల్లీకి తరలివచ్చిన యువతపై దాడులు జరిగాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. మనం కోరుకునే భారత్ ఇది కాదని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే ఈ నెల సోమవారం పార్టీలు, వర్గాలకు అతీతంగా దేశమంతా కలిసి సుప్రీంకోర్టు వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్లు 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. "ప్రధాని మోదీ, అమిత్ షా, అజిత్ డొభాల్, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌లు దేశ గొంతుకను అణగదొక్కలేరు. మమ్మల్ని భయపెట్టలేరు. వారు తప్పుకోవాల్సిందే. ఓటు చోరీకి ముగింపు పలకాలని, 'సర్'ను నిలిపివేయాలని, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీజేఐకి వినతిపత్రం ఇస్తాం. ప్రజాస్వామ్యాన్ని విశ్వసించి, రాజ్యాంగానికి కట్టుబడి ఉండేవారందరూ మాతో కలిసి రావాలి" అని రాహుల్ పిలుపునిచ్చారు.

**దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితి:ఖర్గే**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు

మిగతా 2లో..

## ఓటు కోల్పోయిన వారిని తీసుకొస్తా..

రామచందర్‌రావుకు మంత్రి పొన్నం సవాల్

హైదరాబాద్(జనంసాక్షి): ఓటు కోల్పోయిన ఒక్కరినైనా చూపించగలరా.. అంటూ తెలంగాణ భాజపా చీఫ్ రామచందర్‌రావు చేసిన సవాల్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. ఓటు కోల్పోయిన వారిని తీసుకొస్తానని.. తేదీ, సమయం చెప్పాలని సవాల్ విసిరారు 'సర్' పేరుతో దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది ఓట్లు

మిగతా 2లో..



రియాద్ విమానాశ్రయంపై దాడులు

## సరికాదు

ఖండించిన భారత్ 2లో..




తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా

# రెండోపంట వద్దు

### రైతులు ప్రభుత్వానికి సహకరించాలి: మంత్రి పొంగులేటి

కూసుమంచి(జనంసాక్షి):ఎల్‌నినో నేపథ్యంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు రెండో పంట సాగు చేయకుండా ప్రభుత్వానికి సహకరించాలని రాష్ట్ర రెవిన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. పరిస్థితులను రైతులు అర్థం చేసుకోవాలని కోరారు. ఖమ్మం జిల్లా కూసుమంచిలో ఆదివారం కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. రైతులు సాగు చేసిన మొదటి పంటను ప్రభుత్వం ఎలాగోలా కాపాడుతుందని హామీఇచ్చారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా

మిగతా 2లో..

ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్

# తయారీదారుగా భారత్

- 25 నగరాలకు మెట్రో సేవలు : మోదీ
- తమిళనాడు పర్యటనలో భాగంగా
- రూ. 13 వేల కోట్ల రూపాయల
- విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు



చెన్నై(జనంసాక్షి):దేశాభివృద్ధనే మంత్రంగా తీసుకొని ముందుకు సాగుతున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ తయారీదారుగా భారత్ మారిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 2014 నుంచి మన ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 11 రెట్లు పెరిగాయని కొనియాడారు. రక్షణ పరికరాల తయారీలో స్వయం సమృద్ధి సాధిస్తున్నామని తెలిపారు. 12 ఏళ్లలో అనేక రంగాల్లో మార్పులు తెచ్చినట్లు చెప్పారు. తయారీ రంగంలో వృద్ధి వల్ల యువతకు ఉపాధి అవకాశాలు పెరిగాయని వివరించారు. తమిళనాడు అభివృద్ధికి అండగా ఉండటంతో పాటు విజయ్ ప్రభుత్వానికి చేయూత అందిస్తామన్నారు. చెన్నైలో రూ.13 వేల కోట్లకుపైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. 2014లో 5 నగరాలకే పరిమితమైన మెట్రో రైలు సేవలు ఇప్పుడు 25 నగరాలకు విస్తరించాయని గుర్తు చేశారు. ప్రభుత్వ అధినేతగా తన 25 ఏళ్ల సుదీర్ఘ సేవాకాలాన్ని ప్రధాని మోదీ ప్రస్తావించారు.పార్టీలకు అతీతంగా తమిళనాడు నాయకత్వంతో తనకు ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని ప్రధాని మోదీ గుర్తుచేసుకున్నారు. సంవత్సరాలు గడిచినా, రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా,

మిగతా 2లో..



## నేపాల్‌లో మళ్లీ వరదలు

### కొట్టుకుపోయిన ఇళ్లు..!

ఖాట్మండు (జనంసాక్షి):నేపాల్‌ను మరోసారి భారీ వరదలు ముంచెత్తాయి. పశ్చిమ నేపాల్‌లోని గోర్ఖా ప్రాంతంలోని బుధిగండకి నది ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో వరదలు చుమానువిమి మున్సిపాలిటీని ముంచేశాయి. నీటి ప్రవాహంలో అనేక ఇళ్లు కొట్టుకుపోయాయి. అప్రమత్తమైన అధికారులు ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. చుమ్నుబ్రి గ్రామంలో కొండచరియలు విరిగిపడడంతో బుధిగండకి నదికి అడ్డుకట్ట పడిందని.. దీంతో దిగువ ప్రాంతాల్లో వరదలు సంభవించాయని తెలిపారు.

మిగతా 2లో..

వారిది అర్థం లేని

# వాదన



నాకు జవాబు ఇచ్చే వారంతా అంబానీ ఇంటర్నెట్ దళారీ సైన్యమే

### మరోసారి ఎలాన్ మస్క్ వివాదాస్పద వ్యాఖ్యలు

### స్టార్‌లింక్ రాకతో భారత ప్రజలకు ఇంటర్నెట్‌లో మరిన్ని ఆప్షన్లు పెరుగుతాయని వెల్లడి

వాషింగ్టన్(జనంసాక్షి):స్టార్‌లింక్ అధినేత ఎలాన్ మస్క్ భారత వ్యాపారవేత్త అంబానీని లక్ష్యంగా చేసుకోవడం ఆపలేదు. తాజాగా తనకు జవాబు ఇచ్చే వారిని 'అంబానీ దళారీ ఇంటర్నెట్ సైన్యం'గా అభివర్ణిస్తూ పోస్టు చేశారు. స్టార్‌లింక్ రాకతో భారత ప్రజలకు ఇంటర్నెట్‌లో

ఎఫ్-35 యుద్ధ విమానాలు భారత్ విక్రయించడమనేది

# హాస్యాస్పదం

2లో..

- అమెరికా అధికారులను మనల్ని వాటి దగ్గరికి కూడా రానివ్వరు
- సీనియర్ కమాండర్ ఎదుటే ఐఏఎఫ్ చీఫ్ ఏపీ సింగ్ చురకలు



### యువతను రాజకీయాల్లోకి రాకుండా

# మోదీ అడ్డుకుంటున్నారు

తొలగిస్తున్నారని మండిపడ్డారు. "గోవా యువతను డ్రగ్స్‌కు బానిసలుగా మార్చారు. ఈ రాష్ట్రాన్ని డ్రగ్స్ పెడ్లర్ల అడ్డాగా మార్చారు. రెండుసార్లు గోవా ప్రజలు మోసపోయారు. మూడోసారి భాజపాను నమ్మి గోవా ప్రజలు మోసపోవద్దు. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావాల్సిన అవసరం ఉంది" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# వారిది అర్థం లేదని వాదన

మరిన్ని ఆప్షన్లు పెరుగుతాయన్నారు. ఖరీదు ఎక్కువగా ఉంటే.. ఎవరూ కొనుగోలు చేయరన్నారు. "అంబానీ దళారీ సైన్యం వాదనకు ఏమాత్రం అర్థం లేదు. ఓ వైపు అంబానీ ఏకఛత్రాధిపత్యం కింద ఆఫర్ చేసే ధరలతో స్టార్‌లింక్ ఏమాత్రం పోటీపడలేదని అంటున్నారు. మరోవైపు స్టార్‌లింక్ బలమైన పోటీదారు అంటున్నారు. ఇది పూర్తిగా అర్థరహితం. హాస్యాస్పదం.. వారి వాదనకు పూర్తి విరుద్ధం.స్టార్‌లింక్ రాకతో భారతీయ పౌరులకు మరిన్ని ఛాయిస్‌లు లభించి లబ్ధి పొందుతారు. అంబానీ లాభాలు తగ్గొచ్చు కానీ, వ్యాపారం నుంచి పూర్తిగా వైదొలగరు. సాధారణంగా భారత్‌లో స్టార్‌లింక్ ధరలు అధికంగా ఉంటే.. ఎవరూ కొనుగోలు చేయరు. కాబట్టి.. స్టార్‌లింక్ ధరలను మేం అందుబాటులో ఉంచాల్సిందే" అని ఎక్స్ పోస్టులో వెల్లడించారు. వాస్తవానికి స్టార్‌లింక్‌కు భద్రతా పరమైన తనిఖీలు పూర్తికాలేదని ప్రభుత్వం కౌంటర్ ఇచ్చిన విషయం తెలిసిందే. మస్క్ తన పోస్టులో ధరల గురించే ప్రస్తావించారు, కానీ.. భద్రతా అంశాల ఊసే ఎత్తలేదు. ఇప్పటికే భారత వ్యాపారవేత్త అంబానీని లక్ష్యంగా చేసుకొని ఎక్స్‌లో మస్క్ పలు పోస్టులు చేసిన సంగతి తెలిసిందే. గతంలో ఇండియన్ ఎక్స్‌ప్రెస్, అల్‌జజీరా సంస్థల వార్త కథనాలను షేర్ చేశారు. ముకేశ్ అంబానీని నిజమైన భారత ప్రధాని అంటూ వ్యంగ్యంగా పేర్కొన్నారు. వాస్తవానికి భారత్ శాటిలైట్ ఆధారిత ఉపగ్రహ సేవలకు స్టార్ లింక్, జియో శాట్‌లైట్ కమ్యూనికేషన్, భారతీ ఎయిర్‌టెల్ కమ్యూనికేషన్స్‌కు చెందిన వన్‌వెబ్ దరఖాస్తు చేసుకొన్నాయి. వీటిల్లో ఏ సంస్థకు ఇప్పటి వరకు పూర్తి స్థాయి అనుమతులు రాలేదు.

# నేపాల్ మళ్లీ వరదలు

త్రిశూలి దోభన్ వరకు నదీ సమీపంలోకి ఎవరూ వెళ్లవద్దని.. ఎత్తైన ప్రదేశాల్లో ఉండాలని నేపాల్ జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. నదీతీర ప్రాంతాల్లో నివసిస్తున్న వారు వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది. లామ్‌జంగ్, డోల్పా, రుకుం తూర్పు, రుకుం పశ్చిమ, జజ్జర్‌కోట్, దార్చులా, బైతాది, డడేల్‌ధుర, డోటి, కైలాలి, కంచన్‌పూర్ జిల్లాలకు ముప్పుందని అధికారులు వెల్లడించారు. తెల్లవారుజామున 4గంటల సమయంలో సియురిబాస్ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడడంతో పలువురు గాయాలపాలయ్యారు. వరద ప్రభావిత ప్రాంతాలలోని ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి పోలీసులతో పాటు, సైనికులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. పలు నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తుండడంతో సహాయక చర్యలు, సహాయ సామాగ్రి పంపిణీ కోసం హెలికాప్టర్లను మోహరించారు. ఇదీ చదవండి: నేడు భూమిని తాకనున్న శక్తిమంతమైన సౌర తుపాను

## ఓటు కోల్పోయిన వారిని తీసుకొస్తా..

తొలగించారని ఆరోపించారు. రాష్ట్రంలో 70 లక్షల ఓట్లు, హైదరాబాద్‌లో 40లక్షల ఓట్లు పోయాయన్నారు. ఓటరు జాబితా సమగ్ర ప్రక్షాళనను సరిగా చేయాలని.. అంతేగానీ ఓటు కోసం కొట్లాడేవారిని దూషించడం తగదన్నారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో.. అర్హులైన ఓటర్లకు అన్యాయం జరగకూడదని పేర్కొన్నారు.

## తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రెండో పంటవద్దు

నీరు అందుబాటులో లేదని, విద్యుత్తు కొనుగోలు చేయాలన్నా దొరికే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో పేదలకు ఉపయోగపడుతున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని ప్రభుత్వం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

### బొల్లారంలో దారుణం..

## కిడ్నాప్‌నకు గురైన చిన్నారి హత్య

**హైదరాబాద్(జనంసాక్షి):**సికింద్రాబాద్‌లోని బొల్లారం పరిధి కౌకూర్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. శనివారం రాత్రి కిడ్నాప్‌నకు గురైన ఆరేళ్ల బాలికను దుండగుడు హత్య చేశాడు. చిన్నారి కాళ్లు, చేతులు కట్టేసి సంపులో పడేశాడు. చిన్నారిని వాచ్‌మెన్ చంపి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. కౌకూర్‌లోని విల్లా ఆర్చిడ్స్ అపార్టుమెంట్‌లో రాత్రి 9 గంటల ప్రాంతంలో చిన్నారి సెల్లార్‌లో ఆడుకుంటుండగా అదృశ్యమైంది. దీంతో చిన్నారి కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించడంతో ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. గుర్తుతెలియని వ్యక్తి చిన్నారిని కిడ్నాప్ చేసినట్లు అనుమానిస్తున్నారు. సీసీ ఫుటేజీలో బాలిక వాచ్‌మెన్‌తో పాటు ఉండడాన్ని పోలీసులు గుర్తించారు.

# రాజు ప్రాణం చిలకలో ఉంది.. మోదీ ప్రాణం జ్ఞానేశ్‌లో ఉంది



వాతావరణం సృష్టించారని, ఇదంతా కేవలం ఒక వ్యక్తిని కాపాడేందుకు జరుగుతోందని విమర్శించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను రక్షించే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ పోరాటంలో తాము వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. ఢిల్లీలో శనివారం ఎమర్జెన్సీ తరహా పరిస్థితులు కనిపించాయని సీజేపీ నేత అశుతోష్ రాంకా విమర్శించారు. రైళ్లు, ఇంటర్నెట్ సేవలు నిలిపివేసి ప్రజలను ఇబ్బంది పెట్టారన్నారు. "గతంలో ఎమర్జెన్సీ గురించి విన్నాం.. ఇప్పుడు ప్రత్యక్షంగా చూశాం. జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడేందుకు మోదీ, అమిత్ షా ప్రయత్నిస్తున్నారు. ఆయన్ను కాపాడేందుకు దేశ ప్రజలతోనే యుద్ధం చేస్తున్నారు" అని వ్యాఖ్యానించారు.

**20 కేసులు నమోదు..**

ఢిల్లీలో శనివారం నాటి నిరసనలకు సంబంధించి 20 కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. భద్రతా సిబ్బందిపై దాడి, ప్రభుత్వ ఉద్యోగులను వారి విధులు నిర్వర్తించకుండా అడ్డుకోవడం వంటి ఆరోపణలపై కేసులు నమోదైనట్లు తెలిపారు. అదేవిధంగా విద్యార్థులపై దాడి, మహిళలను దుర్భాషలాడటం వంటి అభియోగాలపై అదుపులోకి తీసుకున్న నలుగురు వ్యక్తులపైనా కేసు నమోదు చేసినట్లు చెప్పారు. శనివారం నాటి ఘటనల్లో 15 మందికి పైగా పోలీసు సిబ్బంది గాయపడ్డారు.

# ఢిల్లీలో మళ్లీ ఉత్కంఠ

సీజేఐ జస్టిస్ సూర్య కాంత్‌ను కలవనున్నట్లు తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయాలు, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై ఎన్నికల కమిషనర్ల అభ్యంతరా లు, ఓట్ల తొలగింపుపై జోక్యం చేసుకోవాలని సీజేఐకి విజ్ఞప్తి చేయనున్నట్లు ఖర్గే పేర్కొన్నారు. శనివారం ఢిల్లీలో అప్రకటిత అత్యవసర పరిస్థితి ఏర్పడిందని.. నేడు కూడా అది కొనసాగుతోందని విమర్శలు గుప్పించారు. 'శనివారం ప్రధాని, హోంమంత్రి కలిసి ఢిల్లీలో గందరగోళం సృష్టించారు. 32వేల మంది పోలీసులు, 7,500 మంది సీఆర్పీఎఫ్ సిబ్బందిని మోహరించారు. యువత ఆందోళన పట్ల ప్రభుత్వం భయపడుతోందనడానికి ఈ చర్యలే నిదర్శనం. ఢిల్లీలో వారు విధించిన ఆంక్షలు ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం. ప్రజాస్వామ్యాన్ని, ప్రజల రాజ్యాంగ హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మా పోరాటం కొనసాగుతుంది' అని ఖర్గే పేర్కొన్నారు.



# ఎవరినీ నిర్బంధించవద్దు

అన్ని పక్షాల వాదనలు పూర్తిగా వింటామని.. అసౌకర్యం లేకుండా చేస్తామని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఢిల్లీలో ఆందోళనలపై కోర్టు ధిక్కార పిటిషన్ల విషయంలో స్పందిస్తూ.. న్యాయవాదులందరి వాదనలు వింటామని. జరిగినదానిని తక్కువ చేయబోమని కోర్టు తెలిపింది. ఈ పిటిషన్లపై జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. రవాణా, రైల్వే, మెట్రో సేవలను నిలిపివేయడంపై దాఖలైన కోర్టు ధిక్కారణ పిటిషన్‌ను కూడా పరిశీలిస్తామని చెప్పింది. కేంద్రం తరఫున సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ఢిల్లీలో మొత్తం 303 మెట్రో స్టేషన్లలో కేవలం 45 మాత్రమే మూసివేసినట్లు కోర్టుకు వెల్లడించారు. ఒక స్టేషన్ మూసివేస్తే.. పక్క స్టేషన్ తెరిచి ఉందని వెల్లడించారు. "మెట్రో స్టేషన్లు తెరిచి ఉంటాయని.. ఇంటర్నెట్‌ను పునరుద్ధరిస్తామని, లాయర్లు తమ విధులు నిర్వహించకుండా అడ్డుకోబోమని, ప్రజా భద్రతకు లోబడి సాధారణ రాకపోకలు కొనసాగిస్తామని" ఎస్జీ చేసిన వాదనలను రికార్డు చేసుకుంటున్నామని ధర్మాసనం ఈ సందర్భంగా వెల్లడించింది.నగరంలో నిలిపివేసిన ఇంటర్నెట్ సేవలను వెంటనే పునరుద్ధరించాలి. ఎలాంటి ఆంక్షలు లేకుండా మెట్రో రైలు సేవలను వెంటనే యథావిధిగా నడపాలి. న్యాయవాదుల విధులకు అడ్డంకులు సృష్టించవద్దు... ఏ ఒక్క లాయర్‌ను వారి వృత్తిపరమైన బాధ్యతలు నిర్వర్తించకుండా అడ్డుకోవడానికి వీల్లేదని తేల్చిచెప్పిన ధర్మాసనం నగర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన అనవసరమైన బారికేడ్లను వెంటనే తొలగించాలి వివరణాత్మక అఫిడవిట్ దాఖలు చేయాలి. అక్టోబర్ 10న ఏ ఆంక్షలు విధించారు? ఎందుకు విధించారు? అనే దానిపై వచ్చే వారం పూర్తి వివరాలతో అఫిడవిట్‌లో పేర్కొనాలని కేంద్రాన్ని ఆదేశించిన సుప్రీంకోర్టు

# సీజేపీ నేతల విడుదల..

### ఢిల్లీలో భారీ భద్రతా ఏర్పాట్లు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రధాన ఎన్నికల కమిషనరు జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనే డిమాండుతో శనివారం జంతర్ మంతర్‌వద్ద ఆందోళన చేపట్టాలనుకున్న కాక్రోచ్ జనతా పార్టీ నేతలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న అభిజీత్ దీప్కే సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను ఆదివారం ఢిల్లీ కంటోన్మెంట్ పోలీస్ స్టేషన్‌లోని ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. న్యాయమూర్తి వారిని విడుదల చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయాన్ని సీజేపీ నేత రత్నాసింగ్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఒక సంవత్సరం పాటు శాంతికి విఘాతం కలిగించే ఎలాంటి కార్యక్రమాల్లో పాల్గొనకూడదనే షరతుపై వారిని విడుదల చేసినట్లు తెలుస్తోంద్ని. సీజేపీ ఇన్‌ఛార్జ్ అజింక్య శిందే ఆధ్వర్యంలో నేడు జంతర్ మంతర్‌వద్ద నిరసన కొనసాగే అవకాశం ఉండడంతో రెండో రోజు కూడా ఆ ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. 30,000 మందికి పైగా పోలీసులు, పారామిలిటరీ సిబ్బంది మోహరించారు. ఢిల్లీ సరిహద్దులు, రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినళ్లు, ఇతర సున్నితమైన ప్రదేశాలలో నిఘాను పెంచారు. పరిస్థితిని అదుపు చేయడంలో ఢిల్లీ పోలీసులకు 120కి పైగా కేంద్ర సాయుధ పోలీసు బలగాలు సహకరిస్తున్నాయి. న్యూఢిల్లీని 20 జోన్లుగా విభజించారు. జాయింట్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, అదనపు డిప్యూటీ కమిషనర్లు క్షేత్రస్థాయిలో పరిణామాలను పర్యవేక్షిస్తున్నారు. నిరసనకారులు ఆశ్రయం పొందకుండా హోటళ్లు, గెస్ట్ హౌస్‌లు, లాడ్జీలు, ధర్మశాలల వద్ద భద్రతా బలగాలు తనిఖీలు ముమ్మరం చేశాయి. సోషల్ మీడియా వేదికలపైనా ప్రత్యేక నిఘా పెట్టారు.

**కవరేజీకి వచ్చిన జర్నలిస్టుల నిర్బంధం..**

శనివారం దేశ రాజధానిలో జరిగిన నిరసనలను కవర్ చేస్తున్న పలువురు జర్నలిస్టులను నిర్బంధించడం, వేధించడాన్ని ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా (పీసీఐ), ఇండియన్ ఉమెన్స్ ప్రెస్ కార్ప్స్ (ఐడబ్ల్యూపీసీ) సహా నాలుగు పాత్రికేయ సంఘాలు ఖండించాయి. జర్నలిస్టులు తమ ప్రెస్ గుర్తింపు కార్డులు చూపించినప్పటికీ పోలీసులు వారిని నిర్బంధించారని, కొందరు రిపోర్టర్ల ఫోన్లు, పరికరాలను స్వాధీనం చేసుకున్నారని స్పష్టం చేశాయి. పోలీసుల చర్యలను కవర్ చేస్తున్న జర్నలిస్టులను కూడా బస్సుల్లోకి ఎక్కించి వివిధ నిర్బంధ కేంద్రాలకు తరలించారని ఆరోపించాయి. ఈ చర్యలను పత్రికా స్వేచ్ఛపై దారుణమైన దాడిగా అభివర్ణించాయి. నిర్బంధంలో ఉన్న జర్నలిస్టులందరినీ తక్షణమే విడుదల చేయాలని, ఢిల్లీ పోలీసులు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి.

## రియాద్ విమానాశ్రయంపై దాడులు సరికాదు

### ఖండించిన భారత్

న్యూఢిల్లీ (జనంసాక్షి):సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో అంతర్జాతీయ విమానాశ్రయంపై శనివారం జరిగిన దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది పౌర మౌలిక సదుపాయాలపై ఇటువంటి పునరావృత దాడులు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది. 'గత కొన్ని రోజులుగా రియాద్‌లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై జరుగుతున్న దాడులు, ముఖ్యంగా అక్టోబర్ 10న జరిగిన దారుణమైన దాడిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. అవి తక్షణమే ఆగిపోవాలి. ఈ దాడుల వల్ల ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరిగింది. ఎందరో ప్రజలు గాయాలపాలయ్యారు. సౌదీలో వీలైనంత త్వరగా శాంతి, సాధారణ పరిస్థితులు నెలకొంటాయని ఆశిస్తున్నాం' అని భారత్ పేర్కొంది. సౌదీ లోని విమానాశ్రయంపై జరిగిన దాడిలో మృతుల సంఖ్య 12కు చేరగా..300లకు పైగా ప్రజలు గాయాలపాలయ్యారని అధికారులు వెల్లడించారు. మృతులలో నలుగురు సౌదీ పౌరులతో పాటు ఇద్దరు బంగ్లాదేశీయులు, పాలస్తానా, అమెరికా, ఈజిప్ట్, జోర్డాన్, సిరియా, సూడాన్ దేశస్థులు ఉన్నట్లు తెలిపారు. హూతీలే ఈ దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ దాడిలో ఎయిర్‌పోర్టులోని పలు విమానాలు కూడా ధ్వంసమయ్యాయన్నారు. రియాద్‌లో అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం కూడా సర్వీసుల రద్దు కొనసాగుతోందన్నారు. సౌదీ రాజధానిపై తాజా దాడికి సంబంధించి హూతీల నుంచి ఎలాంటి ప్రకటనా రాలేదు. కాగా... హూతీలపై దాడుల్లో తాము కూడా పాల్గొనే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. అయితే ఇంకా దానిపై నిర్ణయం తీసుకోలేదన్నారు.

# మనం కోరుకునే భారత్ ఇది కాదు



గుప్పించింది. ఓట్ల చోరీ చేసేందుకు వీలుగా ఎన్నికల సంఘం (ఈసీ) స్వయం ప్రతిపత్తిని కేంద్ర ప్రభుత్వం దెబ్బతీస్తోందని విమర్శించింది. మోదీ, షా కలిసి దేశంలో ప్రజాస్వామ్య నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని ఆరోపించింది. దేశంలో ప్రస్తుతం అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందని విమర్శించింది. నిరసనకారులను అణచివేయడానికి ఢిల్లీలో ఏకంగా సుమారు 32,000 మంది పోలీసులను మోహరించారంటేనే, మోదీ ప్రభుత్వంలో ఎంతటి భయం దాగి ఉందో అర్థమవుతోందని ఎద్దేవా చేసింది. ఆదివారం బెంగళూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే మోదీ సర్కార్?పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఈసీ నిర్ణయాలు, సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై ఎన్నికల కమిషనర్ల వ్యక్తం చేసిన అభ్యంతరాలను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు మల్లికార్జున ఖర్గే తెలిపారు. ఇప్పటికే ఈ వ్యవహారంపై సీజేఐకు లేఖ రాసినట్లు వివరించారు. సోమవారం సాయంత్రం రాహుల్ గాంధీ సహా ఇతర కీలక నేతలతో కలిసి సీజేఐను కలవనున్నట్లు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఖర్గే వెల్లడించారు. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై ఖర్గే తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 2023లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్నికల కమిషనర్ల నియామక చట్టాన్ని మల్లిఖార్జున ఖర్గే తప్పుపట్టారు. ఈ చట్టం ద్వారా భారత రాష్ట్రపతికి గానీ, ప్రధాన న్యాయమూర్తికి గానీ, లేని వినూత్నమైన మినహాయింపులను, రక్షణలను కేవలం ఒక్క చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు మాత్రమే ఎందుకు కల్పించారని ప్రశ్నించారు. సీఈసీ చేసే తప్పులకు జీవితాంతం ఎలాంటి శిక్షలు లేకుండా మినహాయింపు ఇవ్వడం వెనుక పెద్ద కుట్ర అని ఆరోపించారు. ఈవీఎంలు, ఓట్ల దొంగతనం ద్వారా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే కుట్ర అని అన్నారు.

## ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ తయారీదారుగా భారత్

రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి తన నిబద్ధత స్థిరంగా ఉందన్నారు. "ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కరుణానిధి, జయలలితతో మాట్లాడే అవకాశాలు చాలాసార్లు నాకు లభించాయి. నేను ప్రధానమంత్రి అయిన తర్వాత జయలలిత, పన్నీర్‌సెల్వం, పళనిస్వామి, ఎం.కె. స్టాలిన్‌లతో కలిసి పనిచేసే అవకాశం దక్కింది. ప్రభుత్వాలు మారినప్పటికీ, తమిళనాడును అభివృద్ధి చేయాలనే, ఇక్కడి ప్రజలకు సేవ చేయాలనే నా సంకల్పం మాత్రం అలాగే ఉంది. ఇప్పుడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్‌తో కలిసి ఈ ప్రయాణాన్ని ముందుకు సాగిస్తున్నాం." అని అన్నారు.

సీఎం విజయ్‌తో కలిసి మెట్రోలో ప్రధాని ప్రయాణం

అంతకుముందు 13 వేల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. చెన్నై విమానాశ్రయంలో దిగిన ప్రధానికి గవర్నర్ అర్లేకర్, సీఎం విజయ్ ఘన స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్ట్ వెలుపల ప్రధాని కాసేపు రోడ్‌షో నిర్వహించి కార్యకర్తలకు అభివాదం చేశారు. అనంతరం 4వేల 900 కోట్లతో నిర్మితమైన చెన్నై మెట్రో ఫేజ్-2లోని పూనమల్లి-వడపళని మార్గాన్ని ప్రధాని ప్రారంభించారు. స్వయంగా జఖఎ చెల్లింపు చేసి టికెట్ తీసుకున్న మోదీ, పోరూర్ నుంచి పూనమల్లి బైపాస్ స్టేషన్ వరకు విజయ్‌తో కలిసి మెట్రోలో ప్రయాణించారు.

## ఆఫ్రికాలో ఘోరవిషాదం

- జిబూటి తీరంలో పడవ బోల్తా..
- 109 మంది వలసదారుల మృతి
- మరో 116 మందికి పైగా గల్లంతు

**గుహెరే (జనంసాక్షి)**

:ఆఫ్రికా దేశమైన జిబూటి తీరంలో పడవ మునిగిపోయిన ఘటనలో 109 మంది వలసదారులు మృతి చెందారు. మరణించిన వారిలో 52 మంది పురుషులు, 42 మంది మహిళలు, 15 మంది చిన్నారులు ఉన్నారు. మరో 116 మందికి పైగా గల్లంతయినట్లు అంతర్జాతీయ వలసల సంస్థ ప్రకటించింది.ప్రమాద సమయంలో పడవలో దాదాపు 350 మంది ఉన్నట్లు సమాచారం. జిబూటి నుంచి యెమెన్‌కు వెళ్తుండగా.. గుహెరే ప్రాంతానికి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. 80 మందికిపైగా ఇథియోపియా పౌరులు ప్రాణాలతో బయటపడినట్లు తెలుస్తోంది. అధికారులు ఘటనాస్థలంలో సహాయక చర్యలు చేపట్టారు.ఉపాధి అవకాశాలు, భద్రత కోసం గల్ఫ్ దేశాలకు చేరుకోవాలనే ఆశతో ఏటా వేలాదిమంది వలసదారులు జిబూటి మీదుగా ప్రయాణించి.. ప్రమాదకర పరిస్థితుల్లో బాబ్ ఎల్ మండెబ్ జలసంధిని దాటి, యెమెన్‌కు వెళ్తుంటారు. ఐఓఎం వివరాల ప్రకారం.. 2025లో ఈ మార్గంలో 900 మందికిపైగా వలసదారులు మరణించారు/గల్లంతయ్యారు.



### సౌదీలో దాడి ఘటన..

# హైదరాబాద్ వాసి మృతి

**రియాద్(జనంసాక్షి):**

సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంపై జరిగిన దాడిలో ఓ భారతీయుడు మృతి చెందాడు. అక్కడి భారత రాయబార కార్యాలయం ఈ విషయాన్ని ధ్రువీకరించింది. ఈ ఘటనపై సంతాపం వ్యక్తం చేసింది. బాధిత కుటుంబంతో సంప్రదింపులు జరుపుతున్నామని, మృతదేహాన్ని త్వరగా స్వదేశానికి తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు 'ఎక్స్' వేదికగా తెలిపింది. రియాద్ ఎయిర్‌పోర్ట్‌పై దాడి ఘటనలో చనిపోయిన వ్యక్తి హైదరాబాద్‌లోని మెహదీపట్నంకు చెందిన మహమ్మద్ యూసుఫ్ అలీ అని తెలుస్తోంది. ఈ మేరకు ఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు."యూసుఫ్ ఇద్దరు కుమారులకు గాయాలయ్యాయి. ఆయన భార్య, కుమార్తె సురక్షితంగా ఉన్నారు. ఆయన సమీప బంధువుకు గాయమైనప్పటికీ.. ఆమె ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు" అని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి సాయం అందించాలని విదేశాంగశాఖ



మంత్రి జైశంకర్‌కు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా రియాద్‌లోని యూసుఫ్ బంధువుతో సంప్రదింపులు జరుపుతున్నామని, అక్కడి దౌత్యాధికారి కూడా సాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. శనివారం నాటి ఈ ఘటనలో 300 మందికిపైగా గాయపడగా.. వారిలో 10 మంది భారతీయులు ఉన్నట్లు అక్కడి భారత రాయబార కార్యాలయం తెలిపింది.

## ఎఫ్-35 యుద్ధ విమానాలు భారత్‌కు విక్రయించడమనేది హాస్యాస్పదం

- అమెరికా అధికారులను మనల్ని వాటి దగ్గరికి కూడా రానివ్వరు
- సీనియర్ కమాండర్ ఎదుటే ఐఏఎఫ్ చీఫ్ ఏపీ సింగ్ చురకలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**అధునాతన ఎఫ్-35 యుద్ధ విమానాలను విక్రయించేందుకు అమెరికా సిద్ధంగా ఉన్నట్లు కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. అయినప్పటికీ ఈ విషయంలో ఒప్పందం కుదరకపోవడంపై భారత వైమానిక దళం చీఫ్ అమర్ ప్రీత్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. జోధ్‌పూర్‌లో జరిగిన 'తరంగ్ శక్తి-2026' ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతూ.. అమెరికాకు చెందిన ఎఫ్-35 యుద్ధవిమానాల దగ్గరకు కూడా భారత అధికారులను ఆ దేశ సిబ్బంది రానివ్వరని వ్యాఖ్యానించారు. కానీ, దానిని భారత్‌కు విక్రయించడం గురించి మాత్రం మాట్లాడుతుంటుందని అమెరికాకు చురకలు అంటించారు. ఆయన ఈ వ్యాఖ్యలు చేసినప్పుడు యూఎస్ పసిఫిక్ ఎయిర్ ఫోర్సెస్ కమాండర్ జనరల్ కెవిన్ ఆయన పక్కనే ఉండడం గమనార్హం. తమ ఐదో తరం ఈ-35 యుద్ధ విమానాలను



భారత్‌కు విక్రయించేందుకు అమెరికా ఏదైనా అధికారిక ప్రతిపాదన చేసిందా అన్న ప్రశ్నకు స్పందిస్తూ.. ఐఏఎఫ్ చీఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ-35 విషయంలో అగ్రరాజ్యం నుంచి ఎటువంటి అధికారిక ప్రతిపాదన అందలేదని స్పష్టం చేశారు. రష్యా తమ ఐదోతరం అత్యాధునిక స్టెల్త్ యుద్ధ విమానం సుఖోయ్ ఎస్‌యూ-57ను భారత్‌కు అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. అయితే ఆ విమానాన్ని కొనుగోలు చేయాలా వద్దా అనే విషయంపై ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. కాగా, జోధ్‌పూర్‌లో 'తరంగ్ శక్తి-2026' పేరుతో నిర్వహించిన యుద్ధ విమానాల విన్యాసాలలో భారత వైమానిక దళంతో పాటు మరో ఏడు దేశాలకు చెందిన వైమానిక దళాలు పాల్గొన్నాయి

# పాలనా వికేంద్రీకరణలో కేసీఆర్‌ది నూతన ఒరవడి

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి
- వనపర్తి జిల్లా దశాబ్ది ఉత్సవాల్లో 2కే రన్..



**వనపర్తి రూరల్, అక్టోబర్ 11 (జనంసాక్షి) :** వనపర్తి జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో 2కే రన్ నిర్వహించారు. పాలిటెక్నిక్ కళాశాల నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు సాగిన ఈ ర్యాలీలో విద్యార్థులు, యువకులు, వాకింగ్ గ్రూపుల సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి చిన్నారులతో పూలమాలలు వేయించి నివాళులర్పించిన నిరంజన్‌రెడ్డి, జిల్లా దశాబ్ది ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ద్వారా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని పేర్కొన్నారు. తెలంగాణ సాధన అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనా వికేంద్రీకరణకు ప్రాధాన్యమిస్తూ 33 జిల్లాలు, కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాలను ఏర్పాటు చేసి పాలనను ప్రజలకు చేరువ చేశారని కొనియాడారు. వనపర్తి జిల్లా ఏర్పాటుతో ప్రజలకు అనేక వసతులు అందుబాటులోకి వచ్చాయని, జీవన ప్రమాణాల్లో మార్పులు వచ్చాయని అన్నారు. జిల్లా మరో వెయ్యేళ్లపాటు అభివృద్ధి పథంలో పయనిస్తూ భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. 2కే రన్‌లో గణేష్, బాలాజీ, హనుమాన్ వాకింగ్ గ్రూపులతో పాటు రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులు, జై కిసాన్--జై జవాన్ సభ్యులు, కరాటే విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నిరంజన్‌రెడ్డి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ దశాబ్ది ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. బసవేశ్వర టిఫిన్ సెంటర్ నిర్వాహకులను కలిసి వారి వ్యాపార పరిస్థితులను అడిగి

# గ్రీన్ ఫీల్డ్ హైవే బాధిత రైతులకు న్యాయం చేయండి

- కేంద్రమంత్రి, కలెక్టర్లకు ఫోన్ చేసిన ఎంపీ ఈటల రాజేందర్



**పరకాల, అక్టోబర్ 11 (జనంసాక్షి)** : గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న బాధిత రైతులు ఆదివారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ప్రభుత్వం ఇస్తున్న నష్టపరిహారం బహిరంగ మార్కెట్ ధరతో పోలిస్తే 10% కూడా మించడం లేదని, తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని రైతులు ఎంపీకి విన్నవించారు. రైతుల వినతికి సానుకూలంగా స్పందించిన ఎంపీ ఈటల రాజేందర్ గారు వెంటనే సంబంధిత కేంద్రమంత్రివర్యులతో ఫోన్ ద్వారా మాట్లాడి బాధిత రైతుల సమస్యను వివరించారు. దీనిపై స్పందించిన కేంద్రమంత్రి బాధిత రైతులకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.అలాగే ఎంపీ ఈటల రాజేందర్ సంబంధిత జిల్లా కలెక్టర్లతో ఫోన్ లో సంప్రదించి, రైతులకు ప్రస్తుత బహిరంగ మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని కోరారు.రైతులకు అండగా ఉంటానని, న్యాయమైన పరిహారం వచ్చే వరకు పోరాడుతానని ఎంపీ హామీ ఇవ్వడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

# మానసిక చైతన్య రథసారథి పోగు అశోక్‌కు టీచర్ ఎక్సలెన్సీ అవార్డు




**వరంగల్ ఈస్ట్, అక్టోబర్ 11 ( జనం సాక్షి) :** "విద్య అంటే కేవలం పుస్తకాల జ్ఞానం మాత్రమే కాదు... ఒక వ్యక్తిత్వాన్ని మలచడం, ఒక జీవితానికి ధైర్యాన్ని నూరిపోయడం''అక్షరాల వెలుగులు పంచుతూ, మానసిక వికాసంతో విద్యార్థుల జీవితాల్లో నవ చైతన్యాన్ని నింపుతున్న ఉపాధ్యాయుడు, సైకాలజిస్ట్ పోగు అశోక్ ని ప్రతిష్టాత్మక "టీచర్ ఎక్సలెన్సీ అవార్డు" వరించింది. వరంగల్ నగరంలోని కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్న ఆయన, సమాజానికి మరియు విద్యారంగానికి చేస్తున్న అసమాన కృషికి గాను శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ఈ గౌరవాన్ని ప్రకటించింది. హైదరాబాదులోని స్టేట్ మ్యూజియం మహావీర్ ఆడిటోరియం ప్రాంగణంలో ఆదివారం వర్ణరంజితంగా జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిధులు తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్-ఛైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం చేతుల మీదుగా ఈ అవార్డును స్వీకరించారు. ఉపాధ్యాయుడిగా తరగతి గది సరిహద్దులను దాటి, ఒక బాధ్యతాయుతమైన సైకాలజిస్ట్‌గా వరంగల్ ఉమ్మడి జిల్లాలోని గడప గడపకూ విద్యార్థుల వద్దకు వెళ్లారు పోగు అశోక్ . పరీక్షల భయం, మానసిక ఒత్తిళ్లతో సతమతమయ్యే వేలాది మంది విద్యార్థులకు ఉచిత కౌన్సిలింగ్, ప్రేరణాత్మక శిక్షణా తరగతులు నిర్వహిస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. అంతేకాకుండా, సామాజిక చైతన్యం, విద్యా రంగానికి సంబంధించిన లోతైన విశ్లేషణలతో దినపత్రికలలో వారు రాస్తున్న వ్యాసాలు నిత్యం సమాజానికి దిశానిర్దేశం చేస్తున్నాయి. ఒకవైపు ఉపాధ్యాయుడిగా, మరోవైపు మానసిక విశ్లేషకుడిగా, ఇంకోవైపు సమాజహిత వ్యాసకర్తగా త్రివేణి సంగమంలా సాగుతున్న వారి సేవలు విద్యా జగత్తుకు ఆదర్శంగా నిలిచాయి. ఈ సందర్భంగా అవార్డు పొందిన ఉపాధ్యాయుడు అశోకుని సెక్టోరియల్ ఆఫీసర్ శ్రీనివాస్, సైన్స్ అధికారి సురేష్ బాబు, మండల విద్యాధికారి, హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

# అమరులకు పెత్రమాస రోజున బియ్యం ఇవ్వటం హర్షణీయం

- ప్రొఫెసర్ కోదండరాంకు అభినందనలు : బీఎస్ రాములు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** పెత్రమాస సందర్భంగా గన్ పాన్ పార్కు వద్ద అమర వీరులకు బియ్యం ఇచ్చే సంప్రదాయాన్ని 10వ తేదీన ప్రారంభించిన సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాంకు బీసీ కమిషన్ మాజీ చైర్మెన్ బీఎస్ రాములు అభినందనలు తెలిపారు. పెత్రమాసనే అమర వీరుల దినోత్సవంగా జరపాలని, కొత్త తేదీలు వద్దని, ప్రజల సంస్కృతిలో భాగం కావాలి తప్ప విడిపోకూడదని కొండపల్లి సీతారామయ్యకి చెప్పానని, వినిపించుకోలేదని, 28 జూలై చారు మజుందార్ అమరత్వం రోజున అమర వీరుల సంస్మరణ దినోత్సవం గా ప్రకటించి నిర్వహిస్తూ వచ్చారని, ప్రజల సంస్కృతి నుండి విడిపోయారని, 40 ఏండ్ల తరువాత తన కోరిక నెరవేరిందని, నాలుగున్నర దశాబ్దాల పౌరహక్కుల ఉద్యమ సహచరుడు మిత్రుడు , ప్రొఫెసర్ కోదండరాం అమర వీరుల స్థూపం గన్ పార్కు వద్ద పెత్రమాసలో అమర వీరుల సంస్మరణలో బియ్యడం అనే కార్యక్రమం నిర్వహించడం హర్షణీయమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమం మొదటి నుండి ఇలా ప్రజల సంస్కృతిలో , ప్రజల్లో భాగమై కొనసాగుతున్నదని, తెలంగాణ ధూం ధాంలో ప్రాచీన కళలు, బొడ్రాయి ఏర్పాటు, బతుకమ్మ పండుగ, హోలీ పండుగ, తెలంగాణ తల్లి, రోడ్ల పై వంటా వార్పు, ఆట పాటలు, మానవహారం మొదలైన వాటి ద్వారా ప్రజల్లో కలిసి, ప్రజలను కలుపుకొని ముందుకు సాగిన చరిత్ర అని, 2007లో పూర్తి మెజారిటీ తో గెలిచిన మాజీ ముఖ్యమంత్రి మాయావతి బీఎస్పీ ఎన్నికల్లో యుపీలో ఇలా ప్రజల సంస్కృతి, సంస్మరణలను ముందుకు తీసుకు వెళ్లారని, బిజెపీ విజయంలో కూడ ఈ పాత్ర వుందని, తెలంగాణ జన సమితి నేత ఎమ్మెల్సీ కోదండరాం పెత్రమాసనాడు తెలంగాణ అమర వీరులను పెద్దల్లో కలిపి బియ్యం ఇచ్చే సంస్కృతి సంప్రదాయాన్ని ప్రారంభించినందుకు అభినందనలు తెలిపారు.

# గద్వాల జిల్లాలో కులవివక్షపై వరుస ఘటనలు

- కులాంతర వివాహాలపై కులవివక్ష ఇంకెన్నాళ్లు?
- కులాంతర వివాహాలకు కేంద్ర ప్రోత్సాహం



**రాజోళి, అక్టోబర్ 11 (జనంసాక్షి):** ఒకప్పటితో పోలిస్తే ఇటీవలి కాలంలో కులాంతర వివాహాలు పెరుగుతున్నట్లు కనిపిస్తున్నప్పటికీ, పెళ్లిళ్ల విషయంలో కుల పట్టింపులు మాత్రం ఇంకా తగ్గడం లేదు. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలు 'పరువు' అనే ఆలోచనకు ప్రాధాన్యమిస్తూ, పిల్లల జీవిత నిర్ణయాలను అంగీకరించలేకపోతున్నాయి. కులం పేరుతో ప్రేమజంటలను వ్యతిరేకించడం, వారి స్వేచ్ఛను ప్రశ్నించడం, దాడులకు పాల్పడడం వంటి ఘటనలు సమాజంలో ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా జోగులాంబ గద్వాల జిల్లాలో చోటుచేసుకున్న ఘటనలు కులవివక్షపై మరోసారి చర్చకు తెరలేపాయి.

జోగులాంబ గద్వాల జిల్లాలోని రేపల్లె గ్రామానికి చెందిన దళిత యువకుడు రంగముని, అదే గ్రామానికి చెందిన బోయ వర్గానికి చెందిన మహేశ్వరి హైదరాబాద్‌లో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో యువతి బంధువులు యువకుడి ఇంటిని జేసీబీతో కూల్చివేశారు. కులాంతర వివాహం నేపథ్యంలో చోటుచేసుకున్న ఈ ఘటన తెలుగు రెండు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది. అయిజ మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన యువతి, యువకుడు ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అయితే కులాలు వేరు కావడంతో ఆ యువకుడికి మరో యువతితో నిశ్చితార్థం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న యువతి మనస్థాపానికి గురై ధరూర్ మండలంలోని జూరాల డ్యాంలో దూకేందుకు యత్నించింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పోలీసులు యువతిని రక్షించి, కౌన్సెలింగ్ ఇచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ప్రియాంక, గద్వాల జిల్లా గట్టు మండలం చిన్నోనిపల్లికి చెందిన రఘునాథ్ గౌడ్ హైదరాబాద్‌లో కానిస్టేబుల్ శిక్షణ సమయంలో ప్రేమలో పడ్డారు. ఉద్యోగం వచ్చిన తర్వాత పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చిన యువకుడు, అనంతరంస్త్ర కులాంతర వివాహానికి కుటుంబ సభ్యులు అంగీకరించడం లేద న్నాడు. దీంతో ప్రియాంక నెల రోజుల పాటు యువకుడి ఇంటి వద్ద నిరసన తెలిపింది. అనంతరం నిద్రమాత్రలు తీసుకుని మృతి చెందింది.

## వేరే కులం వారిని పెండ్లి చేసుకుంటే.!

పిల్లలు కులాంతర వివాహాలు చేసుకుని తమ కుటుంబం పరువు తీశారని తల్లితండ్రులు, తోబుట్టువులు, బంధువులు వాదిస్తున్నారు. ఆధిపత్య కులాల వారు తమ కులం పరువుపోతోందని ఇలాంటి ఘోరాలకు పాల్పడుతున్నారు. రెండు వేర్వేరు కులాల వాళ్లు పెండ్లి చేసుకుంటే ఒకరు పైకులంగా, ఇంకొకరు కింది కులంగా భావించడమే ఇందుకు కారణం. తమ కులం కంటే తక్కువ కులమని భావించిన ప్రతి ఒక్కరూ దాడులకు, దౌర్జన్యాలకు, హత్యలకు తెగబడుతున్నారు. కులాంతర వివాహాన్ని వ్యతిరేకించని తల్లిదండ్రులను కూడా మిగతా బంధువులు వెలివేస్తున్నారు. వారి పిల్లల్ని ఆదరించకుండా వాళ్లను శిక్షించాలని కులమంతా వేధిస్తోంది. ఎవరైనా కులాంతర వివాహాలు చేస్తున్నా, ప్రోత్సహిస్తున్నా వారిని ధర్మం తప్పినట్లు కుల సమాజం చూస్తోంది. హంతకులుగా మారుతున్న రక్త సంబంధికులెవరూ తాము చేసింది తప్పని అనుకోవడం లేదు. కుల ధర్మాన్ని కాపాడటానికే ఈ పని చేశామని ఫీల్ అవుతున్నారు.

## కులాల కట్టుబాట్లకు జీవితాలు బలి

కులవివక్షను రూపుమాపాలంటే చట్టాలపై అవగాహనతో పాటు చిన్నప్పటి నుంచే పిల్లల్లో సమానత్వం, మానవత్వం, పరస్పర గౌరవం వంటి విలువలను పెంపొందించాలి. కులం ఆధారంగా కాకుండా వ్యక్తిత్వం, ప్రవర్తన, గుణగణాల ఆధారంగా మనుషులను గౌరవించే సంస్కృతి రావాలి. కులాంతర వివాహాలను రెండు కుటుంబాల సమస్యగా కాకుండా సమానత్వం దిశగా సమాజం వేస్తున్న అడుగుగా చూడాలి. పుట్టుకతో వచ్చిన కులం మనిషి విలువను నిర్ణయించకూడదు. ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, గౌరవం లభించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. కులాల పేరుతో నిర్మించిన గోడలు కూలి, మానవత్వమే మనుషులను కలిపే బంధంగా మారినప్పుడే సమానత్వ సమాజం సాకారమవుతుంది.

రూ.5 లక్షల వరకు ప్రోత్సాహకం!

కులాంతర వివాహాలను ప్రోత్సహిస్తూ కేంద్ర ప్రభుత్వం డాక్టర్ అంబేద్కర్ సామాజిక సమగ్రత పథకం ద్వారా అర్హులైన జంటలకు ఆర్థిక సహాయం అందిస్తోంది. ఈ పథకం కింద రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు ప్రోత్సాహకం ప్రభుత్వం ప్రకటించింది. అర్హులైన జంటలు వివాహ ఇద్దరి కుల ధ్రువీకరణ పత్రాలు, వయస్సు ఆధారాలు, మొదటి వివాహానికి సంబంధించిన ధ్రువీకరణ, ఆధార్, రేషన్ కార్డులతో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత అధికారులు పత్రాలను పరిశీలించి, అర్హతను నిర్ధారించిన అనంతరం నిబంధనల ప్రకారం ప్రోత్సాహకం అందిస్తారు. కులాంతర వివాహం చేసుకున్న అర్హులైన జంటలు ఈ పథకానికి సంబంధించిన తాజా అర్హతలు, దరఖాస్తు విధానం, ప్రోత్సాహక మొత్తం వివరాలను సంబంధిత జిల్లా కార్యాలయంలో నిర్ధారించుకోవాలి.

## నచ్చినవారిని చేసుకునే హక్కుంది



రాజ్యాంగంలోని 21వ అధికరణం ప్రకారం మేజర్లయిన వారు తమకు నచ్చిన వ్యక్తిని ఎంపిక చేసుకునే హక్కు ఉందని శక్తివాహిని వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. వ్యక్తిగత స్వేచ్ఛ, గౌరవప్రద జీవితం, జీవిత భాగస్వామిని స్వేచ్ఛగా ఎంచుకునే హక్కుకు రాజ్యాంగ పరిరక్షణ కల్పించిన కీలక తీర్పుగా ఇది గుర్తింపు పొందింది. కులం, కుటుంబ గౌరవం పేరుతో కులాంతర వివాహాలను అడ్డుకోవడం, జంటలను బెదిరించడం రాజ్యాంగ విలువలకు విరుద్ధం. ఇలాంటి చర్యలకు పాల్పడితే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు ఉంటాయి.

**- సురేష్ మహారాజ్ అడ్వకేట్, గద్వాల**

# ఉక్రెయిన్ నుంచి మృతదేహం తరలింపు

- ఖర్చు భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం
- రూ.6 లక్షల ఆర్థిక సహాయం కోరుతూ సీఎంకు లేఖ రాసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**జగిత్యాల బ్యూరో అక్టోబర్ 11(జనం సాక్షి) :** ఉక్రెయిన్‌లో ఉద్యోగం చేస్తున్న జగిత్యాల జిల్లా, జగిత్యాల అర్బన్ మండలం, హస్నాబాద్ గ్రామానికి చెందిన వావిలాల సుదర్శన్ సెప్టెంబర్ 1న రష్యా రాకెట్ దాడిలో మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని స్వదేశానికి తరలించేందుకు రూ.6 లక్షలు చెల్లించాలని ఇండియన్ ఎంబసీ సూచించడంతో, ఆర్థిక సహాయం కోసం మృతుడి భార్య వావిలాల భార్గవి, తల్లి గంగు శుక్రవారం హైదరాబాద్‌లోని సీఎం ప్రవాసీ ప్రజావాణి ని ఆశ్రయించారు. సీఎం ప్రవాసీ ప్రజావాణి ని సందర్శించిన రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహం కోసం కుటుంబ సభ్యులు 39 రోజులుగా ఎదురు చూస్తుండటం పట్ల వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై వెంటనే స్పందించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) అధికారులతో మాట్లాడి, మృతదేహాన్ని స్వదేశానికి తరలించేందుకు రూ.6 లక్షల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి అధికారికంగా లేఖ రాశారు. అదేవిధంగా, సీఎం ప్రజావాణి నోడల్ అధికారి కె. విద్యాసాగర్ ప్రత్యేక చొరవ తీసుకుని సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాస్‌తో మాట్లాడి బాధిత కుటుంబానికి సహాయం అందించే అంశంపై దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, హస్నాబాద్ మాజీ సర్పంచ్ బత్తుల గంగాధర్, తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ సభ్యులు చెన్నమనేని శ్రీనివాస రావు, స్వదేశ్ పరికిపండ్ల, నంగి దేవేందర్ రెడ్డి, వాలంటీర్లు గంగుల మురళీధర్ రెడ్డి, గాజుల సంపత్ కుమార్, మలేసియా ఎన్నారై గాజెంగి రంజిత్, సీఎం ప్రవాసీ ప్రజావాణి లైజన్ ఆఫీసర్ భార్గవి నద్దునూరి తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో అరెస్టులు, నిర్బంధాలు అక్రమం

- కోఆర్డినేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రైట్స్ ఆర్గనైజేషన్స్ (సీడీఆర్వో)

**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** ఢిల్లీలో అరెస్టులు, నిర్బంధాలు అక్రమమని, కేంద్ర ప్రభుత్వ ఆ దుశ్చర్యను కోఆర్డినేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రైట్స్ ఆర్గనైజేషన్స్ (సీడీఆర్వో) ఖండించారు. కో-ఆర్డినేటర్లు ఆశిష్ గుప్తా, క్రాంతి చైతన్య, ధీమన్ ఛటర్జీ, అరిజిత్ గంగూలీ ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. శనివారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సిజెపి (సీజేపీ), కాంగ్రెస్, వామపక్షాలతో సహా ఇతర రాజకీయ పార్టీలు పిలుపునిచ్చిన నిరసన ప్రదర్శనను కేంద్ర ప్రభుత్వం దారుణంగా అణచివేసింది. ఢిల్లీకి వస్తున్న నిరసనకారులను ఢిల్లీ పోలీసులు మార్గమధ్యలోనే అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో, ఇతర ఎన్నికల కమిషనర్ల అభిప్రాయభేదాలు ఉన్నప్పటికీ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) ఏకపక్షంగా 13 కోట్లకు పైగా ఓటర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించినట్లు స్పష్టమవుతోంది. ఎస్ఐఆర్ కుంభకోణంపై సిఇసి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని సిజెపి చేసిన పిలుపులో నిరసనకారులు కూడా భాగస్వాములయ్యారని, నిరసన పిలుపునకు ప్రభుత్వ భయాందోళన నిరసన రోజైన అక్టోబర్ 10న ఢిల్లీలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు 30,000 మంది పారామిలిటరీ సిబ్బందిని మోహరించడమే నిదర్శనమని, ఢిల్లీ పోలీసులు నగరాన్ని తమ అదుపులోకి తీసుకుని, సిపిఐ-ఎం ఆఫీసులపై దాడులు చేశారు; జమియా మిల్లియా, ఢిల్లీ యూనివర్సిటీ హాస్టళ్లు, పిజి వసతి గృహాలు మొదలైన వాటిని ముట్టడించారు; న్యూఢిల్లీకి వస్తున్న రైళ్లలోని కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారని, ఇటార్సి జంక్షన్ అంత దూరంలో ఉన్న రైళ్ల నుండి కూడా కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. పూణేకు చెందిన ఎఐఎస్ఎఫ్ కార్యకర్తలను రైళ్లలోనే నిర్బంధించారు. సిజెపి ముఖ్య నిర్వాహకులైన అభిజీత్ దిప్కే, అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్‌లను ఢిల్లీలో విమానం దిగగానే విమానం నుండి నేరుగా తీసుకెళ్లి తెలియని ప్రదేశంలో నిర్బంధించారు. పోలీసుల దురాగతాల వార్తలు బయటకు రాకుండా నిరోధించేందుకు ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. విలేకరులు తమ గుర్తింపు కార్డులను బహిరంగంగా ధరించాలని, పోలీసులు నిర్దేశించిన ప్రదేశాల నుంచే నిరసన కవరేజ్ చేయాలని, కవరేజ్ సమయంలో నిరసనకారులతో కలవకూడదని విలేకరులకు ఆదేశాలు జారీ చేశారు. పత్రికా విలేకరుల గుర్తింపు కార్డులను డిమాండ్ చేసిన పోలీసులు, ప్రజలు తమను గుర్తుపట్టకుండా ఉండేందుకు తాము మాత్రం నేమ్‌ట్యాగ్‌లు ధరించలేదు! ఇన్ని అడ్డంకులు ఎదురైనప్పటికీ, పోలీసులు ప్రజలను అదుపులోకి తీసుకోవడాన్ని 'ది వైర్' విలేకరులు జాహ్నవి సేన్, శ్రావస్తి దాస్‌గుప్తా మరియు అంతర బారువా నివేదించారు. 'ది క్వింట్స ప్రెస్ కార్డులు చూపించినప్పటికీ విలేకరులను బస్సుల్లో నిర్బంధించినట్లు నివేదించింది. ఆ సంస్థకు చెందిన సార్థక్ జైస్వాల్‌ను కూడా నిర్బంధించారు. 'ది స్క్రోల్స తన రిపోర్టర్ ఆయుష్ తివారీ ప్రెస్ కార్డు చూపించినప్పటికీ అతడిని నిర్బంధించినట్లు తెలిపింది. హెచ్‌కేఎస్ భవన్ వద్ద తనను నిర్బంధించారని, తాను అంతటా తన ప్రెస్ కార్డ్‌ను స్పష్టంగా ధరించానని తివారీ 'ది వైర్'తో చెప్పారు. 'న్యూస్‌లాండ్రీ'కి చెందిన ముగ్గురు రిపోర్టర్లు అన్మోల్ ప్రీతమ్, అశ్విని కుమార్ సింగ్ మరియు ఆస్థా సవ్యసాచిలను కూడా ఢిల్లీ పోలీసులు నిర్బంధించి, వారి ఫోన్లను లాక్కున్నారని తెలిపారు.



# నిజాయితీ చాటిన చిన్నారులు

- దొరికిన రూ 600 పోలీస్ స్టేషన్‌కు అప్పగింత

**ఆత్మకూర్, అక్టోబర్ 11 (జనం సాక్షి):** ఆత్మకూర్ లోని వివేకానంద కోచింగ్ సెంటర్ విద్యార్థులు ఆదివారం ఉదయం యధావిధిగా కోచింగ్ తరగతులకు వెళ్తుండగా మార్గమధ్యలో రోడ్డుపై రూ. 600 నగదు పడి ఉండటం గమనించారు. వెంటనే ఆ డబ్బును తీసుకుని నేరుగా ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ కు వెళ్లారు. తమకు దొరికిన డబ్బును పోలీసులకు అప్పగిస్తూ, ఈ డబ్బును పోగొట్టుకున్న వారిని గుర్తించి వారికి అందజేయాలని కోరారు. చిన్న వయసులోనే పెద్ద మనసు చాటుకున్న విద్యార్థులను పోలీసులు ప్రత్యేకంగా అభినందించారు. వారి నిజాయితీని చూసి స్థానికులు కూడా ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. నేటి సమాజానికి ఈ చిన్నారులు ఆదర్శమని పలువురు కొనియాడారు.

# రోడ్డుపై కారు దగ్ధం

**గీసుకొండ, అక్టోబర్ 11, (జనం సాక్షి) :** వరంగల్ నుంచి నర్సంపేట వైపు వెళ్తున్న ఎరుపు రంగు మారుతి సుజుకి బ్రెజ్జా కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన గీసుగొండ మండలంలోని కోనాయిమాకుల ప్రాంతంలో చోటుచేసుకుంది. వరంగల్‌లో డీజిల్ నింపించుకుని నర్సంపేట వైపు ప్రయాణిస్తున్న సమయంలో కారు ముందు భాగంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇంజిన్‌కు సంబంధించిన సాంకేతిక సమస్య కారణంగా మంటలు వ్యాపించి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. కారును ప్రశాంత్ నడుపుతుండగా, ఘటన సమయంలో ఆయన ఒక్కరే ఉన్నారు. మంటలు గమనించిన వెంటనే కారు నుంచి సురక్షితంగా బయటకు రావడంతో ప్రాణాపాయం తప్పింది.

# అపోలో మెడికల్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ వేడుక




**హైదరాబాద్, అక్టోబర్ 11 (జనంసాక్షి) :** అపోలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్, హైదరాబాద్, అండర్ గ్రాడ్యుయేట్ బ్యాచ్ 2020, పోస్ట్ గ్రాడ్యుయేట్ బ్యాచ్ 2022 విద్యార్థుల కోసం గ్రాడ్యుయేషన్ వేడుకను జూబ్లీహిల్స్ లోని డా. బి ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, భవనం వెంకట్రాం ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించింది. ముఖ్య అతిథిగా పద్మశ్రీ డాక్టర్ బి. సోమరాజు, ప్రఖ్యాత కార్డియాలజిస్ట్, కేర్ హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు, సింధు హాస్పిటల్స్ కార్డియాలజీ కన్సల్టెంట్, మెంటర్ డైరెక్టర్ హాజరయ్యారు. డీన్ డాక్టర్ కె. మనోహర్ విద్యార్థులను మరియు తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగించారు, ఏఐఎంఎస్ఆర్ సీఓఓ అపర్ణా రెడ్డి సభకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా 97 మంది అండర్ గ్రాడ్యుయేట్లు మరియు 44 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లు డిగ్రీలను అందుకున్నారు. 2012లో ప్రారంభమైనప్పటి నుండి అపోలో మెడికల్ కాలేజ్, హైదరాబాద్ నుండి 700 మందికి పైగా విద్యార్థులు పట్టభద్రులయ్యారు. కళాశాల పూర్వ విద్యార్థులలో 90% కంటే ఎక్కువ మంది దేశంలోని వివిధ వైద్య కళాశాలల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లు మరియు విదేశాలలో రెసిడెన్సీ ప్రోగ్రామ్‌లను పొందారు. ప్రతిష్టాత్మక ఛైర్మన్ మెడల్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి గోల్డ్ మెడల్ ఉత్తమ యూజీ విద్యార్థిగా 2020 బ్యాచ్‌కి చెందిన మాయా దేవి కోచెర్లకోటకు మరియు ఉత్తమ పీజీ విద్యార్థిగా జనరల్ మెడిసిన్ విభాగానికి చెందిన డా. సముద్రాల కావ్యకు ప్రదానం చేశారు. సీనియర్ ఫిజిషియన్ దివంగత డా. కె.వి.ఆర్. ప్రసాద్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన డా. కె వి ఆర్ ప్రసాద్ మెమోరియల్ గోల్డ్ మెడల్‌ను వెల్లూరి శర్వాణి రమ్యకు అందజేశారు. 97 మంది అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ఎంబీబీఎస్ డిగ్రీ అవార్డులు, 44 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ఎండీ, ఎంఎస్ డిగ్రీ అవార్డులు అందజేశారు. 2020 యూజీ బ్యాచ్‌కి చెందిన మాయా దేవి కోచెర్లకోటకు ఉత్తమ విద్యార్థిగా డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి గోల్డ్ మెడల్, 2020 యూజీ బ్యాచ్‌కి చెందిన వెల్లూరి శర్వాణి రమ్యకు డా. కె వి ఆర్ ప్రసాద్ మెమోరియల్ గోల్డ్ మెడల్, జనరల్ మెడిసిన్ విభాగానికి చెందిన సముద్రాల కావ్యకు ఉత్తమ పీజీ విద్యార్థిగా డాక్టర్ ప్రతాప్ సి రెడ్డికి గోల్డ్ మెడల్ అందజేశారు.

## జ్ఞానేశ్వర్ కుమార్ మౌనం వీడాలి

ప్రజాస్వామ్యానికి పునాది ఓటు. ఆ ఓటు హక్కుపైనే అనుమానాలు ముసురుకున్నప్పుడు, వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిది. దేశవ్యాప్తంగా ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, యువత ఆందోళన వ్యక్తం చేస్తున్నా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ మౌనం వహించడం తీవ్ర అభ్యంతరకరం. రాజ్యాంగబద్ధ సంస్థ అధిపతిగా ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆయనపై ఉంది.

దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్యానికి సంబంధించిన అత్యంత తీవ్రమైన అంశం. ఇంత పెద్ద సంఖ్యలో ఓట్లు తొలగించడంపై ప్రజల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నప్పుడు ఎన్నికల సంఘం వాటిని తేలికగా తీసుకోవడానికి వీల్లేదు. తొలగించిన ప్రతి ఓటు వెనుక కారణాన్ని స్పష్టంగా వెల్లడించాలి. ఏ ప్రాతిపదికన పేర్లను తొలగించారు? ఎంతమంది ఓటర్లు ప్రభావితమయ్యారు? అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా ఎలాంటి చర్యలు తీసుకున్నారు? ఈ ప్రశ్నలన్నింటికీ ప్రజలకు సమాధానం చెప్పాలి.

ఎన్నికల సంఘంలోనే విభేదాలు ఉన్నాయన్న ఆరోపణలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. సహచర ఎన్నికల కమిషనర్లు పలుమార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న వాదనలపై కూడా స్పష్టత ఇవ్వాలి. త్రిసభ్య ఎన్నికల సంఘంలో సమష్టి నిర్ణయాలకు ప్రాధాన్యం ఉందా? లేక ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారా? అన్న సందేహాలను నివృత్తి చేయాలి. ఎన్నికల సంఘం స్వతంత్రత, పారదర్శకతపై ప్రజలకు నమ్మకం కల్పించాల్సిన బాధ్యత దాని అధిపతిదే.

ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించడమే కాదు, ప్రజలకు ఆ నిష్పక్షపాతంపై విశ్వాసం కలిగించాలి. ఓటు హక్కును కాపాడాల్సిన సంస్థపైనే ప్రజలు ప్రశ్నలు సంధిస్తున్న పరిస్థితి రావడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. దాదాపు 13 కోట్ల ఓట్ల తొలగింపుపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో జ్ఞానేశ్వర్ కుమార్ తక్షణమే మౌనం వీడి, ప్రజల ముందుకు వచ్చి వివరణ ఇవ్వాలి. ఈ ఆరోపణలకు సమాధానం చెప్పలేని పరిస్థితి ఉంటే, తన పదవిలో కొనసాగడంపై నైతిక బాధ్యతతో నిర్ణయం తీసుకోవాలి. ఓటరు హక్కును కాపాడటంలో రాజీకి తావు లేదు. ప్రజాస్వామ్యంపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడం ఎన్నికల సంఘం ప్రథమ కర్తవ్యం.

## హక్కులే ప్రజాస్వామ్యానికి ప్రాణం!



*ప్రభుత్వం తీసుకునే చర్యలు చట్టబద్ధంగా ఉండటమే కాకుండా, న్యాయసమ్మతంగా, సహేతుకంగా ఉండాలని న్యాయస్థానాలు స్పష్టం చేశాయి. నిరసన తెలిపే వ్యక్తులను కేవలం విమర్శకులనే కారణంతో నిర్బంధించడం, శాంతియుత సమావేశాలను నిరోధించడం లేదా భిన్నాభిప్రాయాలను భద్రతా సమస్యగా చిత్రీకరించడం జరిగితే, అవి రాజ్యాంగ విలువలపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతాయి.*

ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు నిర్వహించడం, ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడం మాత్రమే కాదు. పౌరులకు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే హక్కు, శాంతియుతంగా నిరసన తెలిపే అవకాశం, ప్రభుత్వాన్ని ప్రశ్నించే స్వేచ్ఛ ఉండటమే నిజమైన ప్రజాస్వామ్యానికి పునాది. ఈ హక్కులను రాజ్యాంగం కల్పించినప్పటికీ, వాటిని వినియోగించుకునే పౌరులపై ఆంక్షలు పెరుగుతున్నాయనే ఆందోళన దేశంలో చర్చనీయాంశంగా మారింది. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ప్రభుత్వ యంత్రాంగమే పౌరుల స్వరాన్ని అణచివేయడానికి ప్రయత్నిస్తే, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన పరిస్థితులు ఏర్పడతాయి.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ) పౌరులకు వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వేచ్ఛను కల్పిస్తుంది. ఆర్టికల్ 19(1)(బి) ఆయుధాలు లేకుండా శాంతియుతంగా సమావేశమయ్యే హక్కును గుర్తిస్తుంది. ఈ రెండు హక్కులు ప్రజాస్వామ్యంలో పరస్పరం సంబంధం కలిగినవి. ఒక సమస్యపై ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం, సమూహంగా సమావేశమై ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేయడం ప్రజాస్వామ్య ప్రక్రియలో అంతర్భాగాలు. అయితే, ఈ హక్కులు సంపూర్ణమైనవి కావు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(2), 19(3) ప్రకారం ప్రజా శాంతి, భద్రత వంటి నిర్దిష్ట కారణాలతో చట్టబద్ధమైన, సహేతుకమైన ఆంక్షలు విధించవచ్చు. కానీ ఆంక్షలు విధించడానికి అవకాశం ఉందనే కారణంతోనే నిరసన హక్కును నిరాకరించలేరు. పరిమితులు అవసరానికి తగినవిగా ఉండాలి; ప్రభుత్వ అసౌకర్యాన్ని ప్రజల హక్కుల కంటే పైస్థాయిలో ఉంచకూడదు.

ఆర్టికల్ 21 జీవించే హక్కుతో పాటు వ్యక్తిగత స్వేచ్ఛకు రాజ్యాంగ రక్షణ కల్పిస్తుంది. ఈ హక్కును సుప్రీంకోర్టు తన వివిధ తీర్పుల ద్వారా విస్తృతంగా వివరించింది. గౌరవప్రదమైన జీవితం, వ్యక్తిగత స్వేచ్ఛ, న్యాయబద్ధమైన ప్రక్రియ వంటి అంశాలు ఇందులో భాగమయ్యాయి. ప్రభుత్వం తీసుకునే చర్యలు చట్టబద్ధంగా ఉండటమే కాకుండా, న్యాయసమ్మతంగా, సహేతుకంగా ఉండాలని న్యాయస్థానాలు స్పష్టం చేశాయి. నిరసన తెలిపే వ్యక్తులను కేవలం విమర్శకులనే కారణంతో నిర్బంధించడం, శాంతియుత సమావేశాలను నిరోధించడం లేదా భిన్నాభిప్రాయాలను భద్రతా సమస్యగా చిత్రీకరించడం జరిగితే, అవి రాజ్యాంగ విలువలపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతాయి.

అయితే, నిరసనకారుల హక్కులను సమర్థించడం అంటే ప్రజా శాంతికి సంబంధించిన సమస్యలను విస్మరించడం కాదు. పెద్ద సంఖ్యలో ప్రజలు సమావేశమైనప్పుడు ట్రాఫిక్, అత్యవసర సేవలు, స్థానిక నివాసితుల స్వేచ్ఛకు ఇబ్బందులు కలగవచ్చు. వాటిని పరిష్కరించడానికి పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకోవాలి. కానీ అనుమతి ప్రక్రియను నిరసనలను పూర్తిగా అడ్డుకునే సాధనంగా మార్చకూడదు. ప్రత్యామ్నాయ ప్రదేశాలను సూచించడం, సమయ పరిమితులను సహేతుకంగా నిర్ణయించడం, అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయడం వంటి మార్గాలు అందుబాటులో ఉన్నాయి. నిరసనలను నియంత్రించడానికీ, వాటిని అణచివేయడానికీ మధ్య స్పష్టమైన తేడా ఉంది. ప్రజాస్వామ్య ప్రభుత్వం ఆ తేడాను గౌరవించాలి. భారత ప్రజాస్వామ్య చరిత్రలో శాంతియుత నిరసనలు అనేక కీలక మార్పులకు దోహదపడ్డాయి. స్వాతంత్ర్య ఉద్యమం నుంచి కార్మికుల పోరాటాలు, రైతుల ఆందోళనలు, విద్యార్థుల ఉద్యమాలు, సామాజిక న్యాయం కోసం జరిగిన పోరాటాల వరకు ప్రజల సమష్టి స్వరం పాలకులను నిర్ణయాలను పునఃపరిశీలించుకునేలా చేసింది. నిరసనల వల్లే ప్రతి సమస్య పరిష్కారమైందని చెప్పలేం. కానీ పాలకుల నిర్ణయాలను ప్రశ్నించే అవకాశం లేకపోతే, ప్రజల అసంతృప్తి ప్రజాస్వామ్య వ్యవస్థలో వ్యక్తమయ్యే మార్గాలను కోల్పోతుంది. అప్పుడు ఎన్నికల మధ్య కాలంలో పౌరుల పాత్ర నామమాత్రంగా మిగిలిపోయే ప్రమాదం ఉంది.



**డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్**
ramkishore.1504@gmail.com

## పూలలో ప్రకృతి.. బతుకమ్మలో తెలంగాణ సంస్కృతి

*బతుకమ్మ తెలంగాణ నేలతో, తెలంగాణ జీవన విధానంతో, మహిళల ఆత్మీయతతో విడదీయరాని అనుబంధాన్ని ఏర్పరచుకున్న పూల పండుగ. ఇది కేవలం ఒక మతపరమైన లేదా సంప్రదాయపరమైన వేడుకగా మాత్రమే చూడలేని విశిష్టమైన సాంస్కృతిక ప్రక్రియ. తరతరాలుగా తెలంగాణ గ్రామీణ జీవనంలో ప్రకృతిని, పూలను, నీటిని, స్త్రీత్వాన్ని, కుటుంబ సంబంధాలను, సామాజిక ఐక్యతను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన ప్రజా సంస్కృతి బతుకమ్మ. అందుకే బతుకమ్మను తెలంగాణ ప్రజల జీవన తాత్వికతకు ప్రతీకగా పేర్కొనవచ్చు. పూలను దేవతగా భావించి పూజించడం మాత్రమే కాకుండా, ప్రకృతిలో లభించే స్థానిక పూలను సేకరించి వాటితో బతుకమ్మను పేర్చి, మహిళలు సామూహికంగా పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ, బతుకమ్మ చుట్టూ తిరుగుతూ జరుపుకునే ఈ సంప్రదాయం తెలంగాణ సమాజంలోని సామూహిక జీవన స్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది. ఒకప్పుడు పల్లె జీవితంలో సహజంగా వికసించిన పూలను సేకరించి బతుకమ్మగా పేర్చడం ద్వారా ప్రకృతిని ఇంటి ఆవరణలోకి తీసుకువచ్చిన మహిళలు, నేడు పట్టణాల్లోనూ అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ తమ మూలాలతో అనుబంధాన్ని నిలుపుకుంటున్నారు. అందువల్ల బతుకమ్మ ఒక కాలానుగుణ పండుగ మాత్రమే కాదు; తరతరాలుగా సాగే సాంస్కృతిక వారసత్వం.*

బతుకమ్మ పండుగకు సంబంధించిన పూర్వ చరిత్రపై అనేక అభిప్రాయాలు, జానపద కథనాలు, ప్రాంతీయ విశ్వాసాలు ఉన్నాయి. అయితే వీటిని చారిత్రక ఆధారాలతో విడదీసి పరిశీలించాల్సిన అవసరం ఉంది. బతుకమ్మకు సంబంధించిన ప్రతి కథనాన్ని యథాతథ చారిత్రక వాస్తవంగా స్వీకరించడం కంటే, వాటి వెనుక ఉన్న ప్రజా స్మృతి, ప్రకృతి ఆరాధన, స్త్రీల సామాజిక పాత్ర, స్థానిక వ్యవసాయ సంస్కృతి వంటి అంశాలను పరిశీలించడం ద్వారా ఈ పండుగ పరిణామాన్ని అర్థం చేసుకోవచ్చు. తెలంగాణ ప్రాంతంలో శతాబ్దాలుగా కొనసాగిన ప్రకృతి ఆధారిత జీవన విధానం, ఋతువుల మార్పు, వర్షాకాలం ముగింపు, చెరువులు--కుంటలు నీటితో నిండటం, పొలాల్లో కొత్త జీవచైతన్యం మొదలవడం వంటి పరిణామాలతో పూల పండుగకు ఉన్న సంబంధం ప్రత్యేకంగా గమనించదగినది. బతుకమ్మకు ఖచ్చితమైన ప్రారంభ సంవత్సరం లేదా ఒకే చారిత్రక మూలాన్ని నిర్ధారించే ప్రాథమిక ఆధారాలు పరిమితంగా ఉన్నప్పటికీ, తెలంగాణ జానపద జీవనంలో దీని నిరంతర కొనసాగింపు దాని సాంస్కృతిక ప్రాచీనతను సూచిస్తుంది. పౌరాణిక కథనాలు, జానపద విశ్వాసాలు, ప్రకృతి ఆరాధన, స్త్రీల సామూహిక జీవనం పరస్పరం కలిసిపోయి బతుకమ్మకు ప్రస్తుత రూపాన్ని అందించినట్లు భావించవచ్చు.

**బతుకమ్మలో ఉపయోగించే పూలకు ప్రత్యేకమైన జీవవైవిధ్య ప్రాధాన్యం ఉంది.** తంగేడు, గునుగు, బంతి, చామంతి, గుమ్మడి పువ్వు వంటి స్థానికంగా లభించే అనేక రకాల పూలను ఉపయోగించడం ద్వారా తెలంగాణ ప్రకృతి వైవిధ్యం పండుగలో ప్రత్యక్షమవుతుంది. ముఖ్యంగా తంగేడు పువ్వు తెలంగాణ ప్రకృతి, పల్లె సంస్కృతితో ప్రత్యేక అనుబంధాన్ని కలిగి ఉంది. పూలను ఎంచుకోవడం, వాటిని శుభ్రపరచడం, పొరలుగా పేర్చడం, బతుకమ్మకు ఆకృతి ఇవ్వడం వంటి ప్రక్రియలో మహిళల సృజనాత్మకత స్పష్టంగా కనిపిస్తుంది. ఆధునిక కాలంలో ఈ పూల వినియోగం తగ్గిపోతూ కొన్ని చోట్ల మార్కెట్‌లో లభించే పూలపై ఆధారపడే పరిస్థితి ఏర్పడుతున్నప్పటికీ, సంప్రదాయ బతుకమ్మలో స్థానిక పూలకు ఉన్న ప్రాధాన్యం పర్యావరణ పరిరక్షణకు కూడా ఒక సందేశాన్ని అందిస్తుంది. ప్రకృతిని కేవలం వినియోగించుకునే వనరుగా కాకుండా జీవన భాగస్వామిగా చూడాలనే భావన బతుకమ్మలో అంతర్లీనంగా కనిపిస్తుంది. స్థానిక పూల మొక్కలను సంరక్షించడం, గ్రామీణ ప్రాంతాల్లో వాటి పెంపకాన్ని ప్రోత్సహించడం, సహజ పుష్పవైవిధ్యాన్ని కాపాడటం ద్వారా బతుకమ్మను పర్యావరణ పరిరక్షణతో అనుసంధానించవచ్చు.

బతుకమ్మ పండుగలో మహిళల పాత్ర అత్యంత కీలకం. కుటుంబ జీవితం, వ్యవసాయ పనులు, పిల్లల సంరక్షణ, సామాజిక బాధ్యతలు వంటి అనేక బాధ్యతలను నిర్వహించే మహిళలకు బతుకమ్మ ఒక సామూహిక సాంస్కృతిక వేదికగా నిలుస్తుంది. ఈ పండుగలో మహిళలు తమ భావాలను పాటల రూపంలో వ్యక్తం చేస్తారు. కుటుంబ సంబంధాలు, పుట్టింటి జ్ఞాపకాలు, అత్తింటి జీవితం, ప్రకృతి, గ్రామీణ జీవనం, సామాజిక అనుభవాలు, ప్రేమ, బాధ, ఆశ, ఆనందం వంటి అనేక భావాలు బతుకమ్మ పాటల్లో ప్రతిఫలిస్తాయి. అందువల్ల బతుకమ్మ పాటలు కేవలం వినోద గీతాలు కావు. అవి తెలంగాణ మహిళల మౌఖిక చరిత్రకు, జానపద సాహిత్యానికి, సామాజిక అనుభవాలకు విలువైన ఆధారాలు. పూర్వకాలంలో మహిళల అనుభవాలు లిఖిత రూపంలో పెద్దగా నమోదుకాకపోయినా, పాటల రూపంలో వారి జీవితం, భావోద్వేగాలు, ఆశలు, బాధలు, కుటుంబ సంబంధాలు తరతరాలకు చేరాయి. ఈ కారణంగా బతుకమ్మ మహిళల సాంస్కృతిక స్వరానికి ఒక ప్రత్యేక వేదికగా నిలిచింది.

2016లో హైదరాబాద్‌లోని ఎల్.బి. స్టేడియంలో 9,292 మంది మహిళలు ఒకే కార్యక్రమంలో బతుకమ్మ ఆడిన కార్యక్రమం గిన్నిస్ ప్రపంచ రికార్డును సాధించడం బతుకమ్మ చరిత్రలో ఒక ముఖ్యమైన సంఘటనగా నిలిచింది. ఒక ప్రాంతీయ జానపద పండుగ అంతర్జాతీయ రికార్డు స్థాయిలో ప్రదర్శించబడటం ద్వారా బతుకమ్మకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పెరిగింది. 2017లో తెలంగాణ ప్రభుత్వం సుమారు 1.04 కోట్ల మంది మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేయడానికి రూ.222 కోట్లను ఖర్చు చేసినట్లు అధికారిక, వార్తా నివేదికలు పేర్కొన్నాయి. తరువాతి సంవత్సరాల్లో కూడా ఈ కార్యక్రమం కొనసాగింది. 2017-18 నుంచి 2022-23 వరకు బతుకమ్మ చీరల కార్యక్రమానికి సంబంధించి సుమారు రూ.1,777 కోట్ల వ్యయం నమోదైనట్లు నివేదికలు సూచిస్తున్నాయి. అయితే బతుకమ్మ చీరలు పొందిన మహిళల సంఖ్యను బతుకమ్మను వాస్తవంగా ఆచరించిన మహిళల సంఖ్యగా పరిగణించడం శాస్త్రీయంగా సరైనది కాదు. అది ప్రభుత్వ పథకం పరిధిని సూచించే గణాంకం మాత్రమే.

ప్రస్తుత కాలంలో తెలంగాణలో ఎంత శాతం మంది బతుకమ్మను ఆచరిస్తున్నారు అనే ప్రశ్నకు పరిశోధనాత్మక దృష్టితో సమాధానం ఇవ్వాలి. తెలంగాణ మొత్తం జనాభాలో లేదా మహిళలలో బతుకమ్మను ఆచరించే వారి శాతాన్ని జిల్లా, గ్రామీణ-పట్టణ, వయస్సు, కుటుంబ స్థాయి వంటి అంశాల ఆధారంగా కొలిచిన తాజా సమగ్ర శాస్త్రీయ సర్వే అందుబాటులో లేకపోవడంతో 80 శాతం, 90 శాతం, 95 శాతం వంటి సంఖ్యలను ఆధారం లేకుండా పేర్కొనడం సరైంది కాదు. అయితే రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, సామాజిక, విద్యా, సాంస్కృతిక సంస్థలు నిర్వహిస్తున్న విస్తృత కార్యక్రమాలు, కోటి మందికి పైగా మహిళలను లక్ష్యంగా చేసుకున్న బతుకమ్మ చీరల పథకం, గ్రామాల నుంచి పట్టణాల వరకు కొనసాగుతున్న సామూహిక వేడుకలు, విదేశాల్లో కూడా నిర్వహిస్తున్న తెలంగాణ సంఘాల కార్యక్రమాలు బతుకమ్మకు విస్తృత సామాజిక వ్యాప్తి ఉందని సూచిస్తున్నాయి. ఖచ్చితమైన శాతాన్ని నిర్ధారించడానికి 33 జిల్లాలను ప్రాతిపదికగా తీసుకుని ప్రత్యేక సామాజిక సర్వే నిర్వహించడం అవసరం.

పాత బతుకమ్మకు, ఆధునిక బతుకమ్మకు మధ్య స్పష్టమైన మార్పులు కనిపిస్తున్నాయి. పాతకాలంలో మహిళలు పొలాల గట్లకు, చెరువుల పరిసరాలకు వెళ్లి సహజంగా లభించే పూలను సేకరించేవారు. ఇప్పుడు పట్టణాల్లో నివసించే మహిళలు మార్కెట్ నుంచి పూలను కొనుగోలు చేస్తున్నారు. ఒకప్పుడు గ్రామ వీధులు బతుకమ్మకు ప్రధాన వేదికలు కాగా, ఇప్పుడు అపార్ట్‌మెంట్ సముదాయాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, వాణిజ్య సముదాయాలు కూడా బతుకమ్మ వేడుకలకు వేదికలుగా మారాయి. సామాజిక మాధ్యమాల విస్తరణతో బతుకమ్మ పాటలు, నృత్యాలు, బతుకమ్మ అలంకరణలు, సంప్రదాయ దుస్తులు ప్రపంచవ్యాప్తంగా కనిపించే స్థాయికి చేరాయి. మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలు బతుకమ్మను కొత్త తరానికి పరిచయం చేయడంలో ఒక కొత్త సాధనంగా మారాయి. ఈ మార్పు ఒకవైపు సంప్రదాయాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తుండగా, మరోవైపు అసలు జానపద రూపాన్ని సంరక్షించాల్సిన బాధ్యతను కూడా పెంచుతోంది.



2025లో హైదరాబాద్‌లో 19.44 మీటర్లు, అంటే 63 అడుగుల 9 అంగుళాల ఎత్తైన బతుకమ్మను నిర్మించడం, తొమ్మిది రకాల పూలతో భారీ బతుకమ్మను రూపొందించడం మరో ప్రపంచ రికార్డుగా నమోదైంది. అదే కార్యక్రమంలో 1,314 మంది పాల్గొన్న తెలంగాణ జానపద నృత్య ప్రదర్శన కూడా ప్రపంచ రికార్డుగా నమోదైంది. ఈ పరిణామం బతుకమ్మ ఎలా చిన్న గ్రామీణ పూల గుట్ట నుంచి భారీ సాంస్కృతిక ప్రదర్శనగా పరిణమించిందో తెలియజేస్తుంది. అయితే భారీ ప్రదర్శనలు బతుకమ్మకు ప్రచారం తీసుకురావడంతో పాటు అసలు జానపద రూపాన్ని కూడా కాపాడాల్సిన బాధ్యతను గుర్తు చేస్తున్నాయి. రికార్డులు, భారీ కార్యక్రమాలు బతుకమ్మకు కొత్త గుర్తింపును తీసుకురావచ్చు; కానీ దాని అసలైన విలువ మాత్రం మహిళల పాటలో, సహజ పూలలో, సామూహిక ఆచరణలో, తెలంగాణ జీవన సంబంధాల్లోనే ఉంది.

**బతుకమ్మకు ఆర్థిక ప్రాధాన్యం కూడా పెరుగుతోంది.** పూల విక్రయాలు, చీరలు, ఆభరణాలు, సంప్రదాయ దుస్తులు, అలంకరణ వస్తువులు, రవాణా, చిన్న వ్యాపారాలు, హస్తకళలు, పర్యాటకం వంటి అనేక రంగాలకు బతుకమ్మ కాలంలో డిమాండ్ ఏర్పడుతుంది. ముఖ్యంగా బతుకమ్మ చీరల పథకం ద్వారా చేనేత, పవర్‌లూమ్ రంగాలకు పెద్ద మొత్తంలో ఆర్డర్లు లభించాయి. 2017--18 నుంచి 2022--23 మధ్య సుమారు రూ.1,777 కోట్ల వ్యయం నమోదవడం ద్వారా బతుకమ్మ పండుగ చుట్టూ ఏర్పడిన ఆర్థిక కార్యకలాపాల పరిమాణాన్ని అంచనా వేయవచ్చు. పూల సాగును ప్రోత్సహించడం, స్థానిక మహిళా స్వయం సహాయక సంఘాలను పూల విక్రయాల్లో భాగస్వామ్యం చేయడం, గ్రామీణ హస్తకళలకు మార్కెట్ కల్పించడం ద్వారా బతుకమ్మను స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఉపయోగించుకోవచ్చు. పూల సాగు, పూల మార్కెట్లు, సంప్రదాయ వస్త్రాలు, స్థానిక ఆహార ఉత్పత్తులు, హస్తకళలకు బతుకమ్మ ఒక స్థిరమైన మార్కెట్ అవకాశంగా మారే అవకాశం ఉంది.

అయితే ఆధునిక బతుకమ్మకు కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. సహజ పూల వినియోగం తగ్గి మార్కెట్ ఆధారిత పూల వినియోగం పెరగడం, ప్లాస్టిక్ పదార్థాల వినియోగం, కృత్రిమ అలంకరణలు, భారీ కార్యక్రమాల వల్ల ఏర్పడే వ్యర్థాలు, నీటి వనరుల్లో నిమజ్జనం వంటి అంశాలను పర్యావరణ పరంగా పరిశీలించాలి. బతుకమ్మ అసలు స్ఫూర్తి ప్రకృతిని ఆరాధించడమే కాబట్టి ఆ పండుగ వల్ల ప్రకృతికి నష్టం కలగకుండా చూడడం మన బాధ్యత. సహజ పూల వినియోగాన్ని ప్రోత్సహించడం, ప్లాస్టిక్‌ను పూర్తిగా తగ్గించడం, నిమజ్జనానికి ప్రత్యేక నీటి ప్రాంతాలను ఏర్పాటు చేయడం, పూల వ్యర్థాలను సేకరించి కంపోస్టుగా మార్చడం, చెరువులను కాలుష్యం నుంచి రక్షించడం వంటి చర్యలు బతుకమ్మను నిజమైన పర్యావరణహిత పండుగగా నిలబెట్టగలవు. పండుగ ముగిసిన తరువాత పూల వ్యర్థాలను నిర్లక్ష్యంగా పడేయకుండా సేంద్రియ ఎరువుల తయారీకి ఉపయోగిస్తే బతుకమ్మ ప్రకృతి నుంచి తీసుకుని ప్రకృతికే తిరిగి ఇచ్చే సంప్రదాయంగా మరింత అర్థవంతమవుతుంది.

**బతుకమ్మపై మరింత శాస్త్రీయ పరిశోధన జరగాల్సిన అవసరం ఉంది.** తెలంగాణలోని వివిధ జిల్లాల్లో బతుకమ్మను ఎలా జరుపుకుంటున్నారు, ఉపయోగించే పూలలో ప్రాంతీయ తేడాలు ఏమిటి, బతుకమ్మ పాటల్లో ఎలాంటి సామాజిక చరిత్ర నమోదైంది, మహిళల జీవితాల్లో ఈ పండుగ ఎలాంటి మార్పులను తీసుకొచ్చింది, చెరువులు-పూలు-వ్యవసాయం మధ్య ఉన్న సంబంధం ఏమిటి వంటి అంశాలపై విశ్వవిద్యాలయ స్థాయిలో పరిశోధనలు జరగాలి. పాత బతుకమ్మ పాటలను సేకరించి డిజిటల్ రూపంలో భద్రపరచడం, వృద్ధ మహిళల నుంచి మౌఖిక చరిత్రను నమోదు చేయడం, స్థానిక పూల జీవశాస్త్రంపై అధ్యయనం చేయడం, బతుకమ్మకు సంబంధించిన జానపద కళలను పాఠ్యాంశాల్లో చేర్చడం వంటి చర్యలు భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగపడతాయి. ముఖ్యంగా తెలంగాణలోని 33 జిల్లాల్లో ప్రాంతీయ వైవిధ్యాన్ని నమోదు చేసే సమగ్ర బతుకమ్మ అధ్యయనం జరిగితే జానపద సంస్కృతి, భాష, మహిళా అధ్యయనం, పర్యావరణం, వ్యవసాయం, సామాజిక శాస్త్రాల పరిశోధనలకు కొత్త మార్గాలు ఏర్పడతాయి.

బతుకమ్మను విద్యతో అనుసంధానించడం కూడా అవసరం. పాఠశాల స్థాయిలో బతుకమ్మ పాటలు, స్థానిక పూల పేర్లు, పర్యావరణ సంబంధం గురించి పిల్లలకు అవగాహన కల్పించవచ్చు. కళాశాల స్థాయిలో బతుకమ్మపై జానపద సాహిత్యం, మహిళా అధ్యయనం, మాధ్యమాలు, పర్యావరణం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వంటి విభాగాల్లో పరిశోధనా ప్రాజెక్టులు చేపట్టవచ్చు. విశ్వవిద్యాలయాలు బతుకమ్మపై మౌఖిక చరిత్ర ప్రాజెక్టులు నిర్వహించి, గ్రామీణ మహిళల నుంచి పాటలు, కథలు, ఆచారాలు సేకరించవచ్చు. ఈ విధంగా బతుకమ్మ ఒక పండుగగా మాత్రమే కాకుండా పరిశోధనకు, విద్యకు, సాంస్కృతిక పరిరక్షణకు ఒక విస్తృత అధ్యయన రంగంగా మారుతుంది.

మొత్తంగా చూస్తే బతుకమ్మ ఒక పండుగ మాత్రమే కాదు; అది తెలంగాణ చరిత్రకు ఒక జ్ఞాపకం, మహిళల స్వరానికి ఒక వేదిక, జానపద సాహిత్యానికి ఒక నిలయం, ప్రకృతి ప్రేమకు ఒక ప్రతీక, సామాజిక ఐక్యతకు ఒక సాధనం, స్థానిక జీవవైవిధ్యానికి ఒక గుర్తింపు, తెలంగాణ తెలుగు సంస్కృతికి ఒక జీవంతమైన ప్రతిరూపం. కాలం మారినా, జీవన విధానాలు మారినా, సాంకేతికత ఎంతగా విస్తరించినా బతుకమ్మ తన మూల విలువలను నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉంది. పూలను పేర్చినట్లే తరతరాల జ్ఞాపకాలను, కుటుంబ బంధాలను, సామాజిక అనుబంధాలను, ప్రకృతి పట్ల బాధ్యతను, తెలంగాణ భాషా--సాంస్కృతిక వారసత్వాన్ని ఒకచోట చేర్చే శక్తి బతుకమ్మకు ఉంది. అందుకే బతుకమ్మను కేవలం తెలంగాణ మహిళల పండుగగా పరిమితం చేయకుండా తెలంగాణ ప్రజల సమగ్ర సాంస్కృతిక వారసత్వంగా చూడాలి.

బతుకమ్మ పూర్వ చరిత్రకు ఖచ్చితమైన ప్రారంభ సంవత్సరాన్ని నిర్ధారించే ఆధారం లేకపోయినా, శతాబ్దాలుగా కొనసాగుతున్న తెలంగాణ జానపద సంప్రదాయంగా దాని స్థానం బలంగా ఉంది. 2014లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత బతుకమ్మకు రాష్ట్ర సాంస్కృతిక గుర్తింపులో మరింత ప్రాధాన్యం వచ్చింది. 2016లో 9,292 మంది మహిళల సామూహిక బతుకమ్మ ప్రపంచ రికార్డు సాధించడం, 2017లో కోటికి పైగా మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ ప్రారంభం కావడం, 2025లో 19.44 మీటర్ల ఎత్తైన బతుకమ్మ ప్రపంచ రికార్డు సాధించడం వంటి పరిణామాలు బతుకమ్మ గ్రామీణ జానపద సంప్రదాయం నుంచి రాష్ట్రస్థాయి, జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక ప్రతీకగా ఎదిగిన పరిణామాన్ని తెలియజేస్తున్నాయి.

అయితే బతుకమ్మ ఆధునికతలోకి ప్రవేశించినప్పటికీ దాని మూల స్ఫూర్తి కోల్పోకూడదు. బతుకమ్మలోని పూలు కేవలం అలంకరణ కాదు; అవి తెలంగాణ జీవవైవిధ్యానికి ప్రతీకలు. బతుకమ్మ పాటలు కేవలం వినోదం కాదు; అవి తెలంగాణ ప్రజల మౌఖిక చరిత్రకు ఆధారాలు. మహిళల సమూహం కేవలం వేడుక కాదు; అది సామాజిక ఐక్యతకు ప్రతీక. చెరువులో బతుకమ్మ నిమజ్జనం కేవలం ఒక ఆచారం కాదు; తెలంగాణ సమాజానికి నీటి వనరులతో ఉన్న చారిత్రక సంబంధానికి ప్రతిబింబం. అందువల్ల బతుకమ్మను భవిష్యత్ తరాలకు అందించాలంటే సంప్రదాయాన్ని మాత్రమే కాకుండా దాని వెనుక ఉన్న ప్రకృతి జ్ఞానాన్ని, స్థానిక పూల వైవిధ్యాన్ని, జానపద పాటలను, మహిళల సామాజిక పాత్రను కూడా భద్రపరచాలి.

బతుకమ్మ పాటలను ప్రాంతాల వారీగా సేకరించి డిజిటల్ భాండాగారాలుగా రూపొందించాలి. తంగేడు, గునుగు వంటి స్థానిక పూల మొక్కలను విస్తృతంగా పెంచాలి. గ్రామీణ ప్రాంతాల్లో సహజ పూల సంరక్షణకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి. చెరువులు, కుంటలు, నీటి వనరులను రక్షించాలి. ప్లాస్టిక్ రహిత బతుకమ్మను ప్రోత్సహించాలి. పూల వ్యర్థాలను పర్యావరణహిత పద్ధతిలో నిర్వహించాలి. పాఠశాలలు, కళాశాలల్లో బతుకమ్మ చరిత్ర, పాటలు, పూల జాతులు, పర్యావరణ సంబంధం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలి. స్థానిక మహిళా సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, కళాకారులు, రైతులు, పూల సాగుదారులను బతుకమ్మ ఆర్థిక కార్యకలాపాలతో అనుసంధానిస్తే గ్రామీణ ఉపాధికి కూడా కొత్త అవకాశాలు ఏర్పడతాయి.

అంతిమంగా బతుకమ్మ తెలంగాణ తెలుగు సంస్కృతికి ఒక జీవంతమైన ప్రతీక. అది గతాన్ని వర్తమానంతో, ప్రకృతిని మనిషితో, గ్రామాన్ని పట్టణంతో, తల్లితరాన్ని కొత్త తరంతో, తెలంగాణను ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు సమాజంతో అనుసంధానించే సాంస్కృతిక వారధి. కాలం మారినా పూలు మారినా, పండుగ నిర్వహణ పద్ధతులు మారినా, బతుకమ్మలోని జీవన సందేశం మాత్రం మారకూడదు. ప్రకృతిని గౌరవించడం, కుటుంబాన్ని గౌరవించడం, మహిళలను గౌరవించడం, స్థానిక సంస్కృతిని కాపాడడం, సామాజిక ఐక్యతను పెంపొందించడం అనే విలువలు బతుకమ్మకు అసలైన బలం. అందుకే బతుకమ్మ పూలతో పేర్చిన ఒక పండుగ మాత్రమే కాదు; తెలంగాణ మట్టి వాసనను, మహిళల గొంతులోని పాటను, చెరువుల జ్ఞాపకాన్ని, పల్లె జీవన సౌందర్యాన్ని, తెలుగు సంస్కృతి నిరంతర ప్రవాహాన్ని ప్రతిబింబించే ఒక జీవంతమైన సాంస్కృతిక వారసత్వం.

**బతుకమ్మ బతికినంతకాలం తెలంగాణ జానపద సంస్కృతి బతుకుతుంది; తెలంగాణ పూల పరిమళం, పాటల స్వరం, చెరువుల జ్ఞాపకం, మట్టితో ముడిపడిన జీవన తత్వం కూడా తరతరాలకు కొనసాగుతుంది. అదే బతుకమ్మ పండుగ యొక్క అసలైన సాంస్కృతిక మహత్తు, అదే తెలంగాణ తెలుగు సంస్కృతికి దాని చిరస్థాయి ప్రతీక.**



ప్రొఫెసర్.సుంకరి జ్యోతి
డాక్టర. రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## రామంతాపూర్‌లో 'లక్కీ గైస్' మల్టీబ్రాండ్ స్టోర్ ప్రారంభం

**ఉప్పల్, అక్టోబర్ 11 (జనం సాక్షి) :** రామంతాపూర్‌లోని గణేష్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన లక్కీ గైస్ – ది మల్టీబ్రాండ్ స్టోర్‌ను ఆదివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టోర్‌ను సందర్శించి అక్కడ అందుబాటులో ఉంచిన వివిధ రకాల వస్త్రాలు, ఫ్యాషన్ ఉత్పత్తులను పరిశీలించారు. ఒకే చోట పురుషులు, మహిళలకు సంబంధించిన దుస్తులతో పాటు ఫుట్‌వేర్, ఫ్యాషన్ యాక్సెసరీస్, ఇతర జీవనశైలి ఉత్పత్తులను అందుబాటులో ఉంచడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రామంతాపూర్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు వివిధ బ్రాండ్లకు చెందిన వస్త్రాలు, ఫ్యాషన్ ఉత్పత్తులు ఒకే చోట లభించడం ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని అన్నారు. నూతనంగా వ్యాపారాన్ని ప్రారంభించిన స్టోర్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, లక్కీ గైస్ మల్టీబ్రాండ్ స్టోర్ ప్రజల ఆదరణ పొందుతూ విజయవంతంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్టోర్ నిర్వాహకులు, స్థానిక నాయకులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.




# వికలాంగుల హక్కుల కోసం ధారూర్ నుంచే దండయాత్ర

- హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం
- వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ హెచ్చరిక

**ధారూర్, అక్టోబర్ 11 (జనంసాక్షి) :** అసెంబ్లీ ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ధారూర్ నుంచే దండయాత్ర ప్రారంభిస్తామని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి (బీవీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ హెచ్చరించారు. హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. వికలాంగుల సమస్యలను పరిష్కరించాలని,ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు పోతురాజు సుధీర్ ఆధ్వర్యంలో జిల్లా క్రమశిక్షణ కమిటీ చైర్మన్ అర్జున్ బాలరాజు అధ్యక్షతన ధారూర్ మండల నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గిద్దె రాజేష్ మాట్లాడుతూ...అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలును విస్మరించిందని ఆరోపించారు. రూ.6 వేల పింఛన్



హామీ ఏమైంది.? మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన ప్రభుత్వం వికలాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయడం లేదని గిద్దె రాజేష్ ప్రశ్నించారు.వికలాంగులకు నెలకు రూ.6 వేల పింఛన్ అందిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు.వికలాంగుల హక్కుల పరిరక్షణకు సంబంధించిన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని,వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సంక్షేమ శాఖను ఏర్పాటు చేసి ప్రత్యేక అధికారులను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఇందిరమ్మ ఇళ్ల పథకంలో వికలాంగులకు ప్రాధాన్యం కల్పించాలని,విద్య, ఉద్యోగ,రాజకీయ రంగాల్లో జనాభా దామాషా ప్రకారం అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.వికలాంగుల సంక్షేమం పట్ల ప్రభుత్వం ఇదే విధంగా నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఆందోళనలు చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని హెచ్చరించారు. వికలాంగులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ధారూర్ మండల నూతన కమిటీ ఎన్నిక అనంతరం జిల్లా అధ్యక్షుడు పోతురాజు సుధీర్ ధారూర్ మండల నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా జానీ మహేష్, ఉపాధ్యక్షుడిగా ఆశయ్య, కార్యదర్శిగా టి.హరికృష్ణ,మండల సలహాదారుగా శ్రీశైలం, మీడియా కన్వీనర్‌గా రామచందర్, యువజన విభాగం అధ్యక్షుడిగా భాస్కర్ నాయక్,మహిళా అధ్యక్షురాలిగా రాధ, ఉపాధ్యక్షురాలిగా దేవిబాయి, సలహాదారుగా లక్ష్మీబాయి, కోశాధికారిగా పాండు నాయక్‌ను నియమించారు.నూతన కార్యవర్గానికి నియామక ఉత్తర్వులు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు ఊరడి హనుమంతు,మండల నాయకులు,జిల్లా నాయకులు, సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మహేశ్వరం మండలంలో జోరుగా మట్టి దందా...!

- గుట్టలు మాయం...?
- పట్టించుకోని అధికారులు

**మహేశ్వరం, అక్టోబర్ 11 (జనం సాక్షి) :** మహేశ్వరం మండలంలో ప్రకృతి సహజ సిద్ధంగా ఉన్న గుట్టలు రాత్రికి రాత్రే మాయం చేస్తున్నారు.కొందరు అక్రమార్కులు అసైన్డ్ మెంట్ భూములల్లో రాత్రిపూట మట్టిదందా మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా నడిపిస్తున్నారు.ప్రకృతి సహజ సంపదను అక్రమార్కులు సొమ్ము చేసుకొని లక్షలు దండుకుంటున్నారు.అక్రమార్కులు రాత్రిపూట గుట్టు చప్పుడు కాకుండా ఎర్రమట్టి,నల్లమట్టి, మొర్రాన్ని మహేశ్వరం మండలంలోని ప్లాస్టిక్ పార్క్,ఈ సిటీ,హార్డ్ వేర్ పార్క్,అమోజన్, వెంచర్లలకు,విల్లాలకు,కంపెనీలకు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు.అక్రమార్కులు ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే మట్టిని పాతాళంలోకి తోవ్వుతున్నారు.మరికొంత మంది అక్రమార్కులు గోరంత అనుమతి తీసుకొని కొండంత తవ్వేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. టిప్పర్లల్లో ఓవర్ లో నింపడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులకు



ఒక్క ట్రిప్ కు 200-300 రూపాయలు ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. అక్రమార్కులు 4000-5000 రూపాయలకు అమ్ముకుంటున్నారు. మహేశ్వరం మండలాలలో రెవిన్యూ,మైనింగ్ శాఖ నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే తవ్వకాలు జరుపుతున్నారు. మట్టి దందాను కొంతమంది ఉపాధి అవకాశంగా ఉపయోగించుకుంటున్నారు. అక్రమ మట్టి దందాను అరికట్టడంలో రెవిన్యూ,మైనింగ్ శాఖ అధికారులు విఫలమయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు. మట్టి మాఫియా నుంచి రెవిన్యూ,మైనింగ్ శాఖ అధికారులు మామూళ్లు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

### తుమ్మలూరు తోవ్వేస్తున్నారు

మహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామ రెవిన్యూ పరిధిలోని సర్వే నంబర్ 315 లావాణి భూమిలో అక్రమార్కులు మట్టిని పాతాళంలోకి తోవ్వుతున్నారు.గట్టుపల్లి గ్రామ రెవిన్యూ పరిధిలోని సర్వే64, 65, మన్సాన్ పల్లి,నాగిరెడ్డిపల్లి,గంగారం, మహేశ్వరం,సిరిగిరిపురం,కోళ్ల పడకల్,దుబ్బచర్ల, రావిర్యాల,మండలంలోని పలు గ్రామాలల్లో మైనింగ్ శాఖల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే మట్టి తవ్వకాలు జరుపుతున్నారు.పచ్చని చెట్లతో ఉన్న ప్రకృతిని పిండి చేస్తున్నారాని పలువురు ఆరోపిస్తున్నారు. తుమ్మలూరు గ్రామంలో జరిగే మట్టి మాఫియాను అరికట్టాలని గ్రామస్తులు పేర్కొంటున్నారు. నిద్రమత్తులో అధికారులు...రెవిన్యూ, మైనింగ్ శాఖ అధికారులు మట్టి మాఫియాతో కుమ్మక్కయ్యారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.ఇప్పటికైనా మహేశ్వరం మండల పరిధిలోని జరిగే అక్రమ మట్టి మాఫియాను అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## పాలనా వికేంద్రీకరణలో కేసీఆర్‌ది నూతన ఒరవడి

**వనపర్తి రూరల్, అక్టోబర్ 11 (జనం సాక్షి) :** వనపర్తి జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో 2కే రన్ నిర్వహించారు. పాలిటెక్నిక్ కళాశాల నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు సాగిన ఈ ర్యాలీలో విద్యార్థులు, యువకులు, వాకింగ్ గ్రూపుల సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి చిన్నారులతో పూలమాలలు వేయించి నివాళులర్పించిన నిరంజన్‌రెడ్డి, జిల్లా దశాబ్ది ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ద్వారా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని పేర్కొన్నారు. తెలంగాణ సాధన అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనా వికేంద్రీకరణకు ప్రాధాన్యమిస్తూ 33 జిల్లాలు, కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాలను ఏర్పాటు చేసి పాలనను ప్రజలకు చేరువ చేశారని కొనియాడారు. వనపర్తి జిల్లా ఏర్పాటుతో ప్రజలకు అనేక వసతులు అందుబాటులోకి వచ్చాయని, జీవన ప్రమాణాల్లో మార్పులు వచ్చాయని అన్నారు. జిల్లా మరో వెయ్యేళ్లపాటు అభివృద్ధి పథంలో పయనిస్తూ భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. 2కే రన్‌లో గణేష్, బాలాజీ, హనుమాన్ వాకింగ్ గ్రూపులతో పాటు రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులు, జై కిసాన్--జై జవాన్ సభ్యులు, కరాటే విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నిరంజన్‌రెడ్డి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ దశాబ్ది ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. బసవేశ్వర టిఫిన్ సెంటర్ నిర్వాహకులను కలిసి వారి వ్యాపార పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వాకింగ్ గ్రూపుల సభ్యులు, పార్టీ కార్యకర్తలతో కలిసి అల్పాహారం తీసుకుంటూ ఉత్సవాల్లో సందడి చేశారు.

# సీఈసీ తక్షణమే రాజీనామా చేయాలి

- ఢిల్లీలో సీపీఎం నాయకుల అరెస్టు దుర్మార్గం ఎన్. చంద్రమోహన్

హయత్‌నగర్, అక్టోబర్ 11 (జనం సాక్షి) : ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిలిపివేయాలని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎన్. చంద్రమోహన్ డిమాండ్ చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సీపీఎం అఖిల భారత నాయకులతో పాటు తెలంగాణకు చెందిన పలువురు నాయకులను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ వనస్థలిపురం చౌరస్తాలో సీపీఎం ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి చంద్రమోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడమేనని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం కలిగించేలా ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, ఓటర్ల జాబితా సవరణలో పూర్తి పారదర్శకత పాటించాలని కోరారు. ఓటు హక్కును పరిరక్షించడం ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని పేర్కొన్న ఆయన,




ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును గౌరవించాలని, అరెస్టు చేసిన నాయకులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చూడాలని, ప్రజల్లో ఆందోళనలు, అనుమానాలు కలిగిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని అన్నారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం వామపక్షాలు, ప్రజాసంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం సర్కిల్ కమిటీ సభ్యులు పొట్టేపాకు రామస్వామి, భూష రాజు కాశయ్య, మన్యం రాధమ్మ, కుక్కముడి వెంకటయ్య, దాసరి కురుమయ్య, బుష్పాక రేణుక, జె. లక్ష్మమ్మ, రెడ్డమ్మ, తన్నీరు అరుణమ్మ, వెంకన్న, అన్నదానం, రామేశ్వరమ్మ, గ్యార కలమ్మ, సతీష్, వరలక్ష్మి, అను, అర్జున్, గాయత్రి, కాశమ్మ, నల్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

- డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్

**ఉప్పల్, అక్టోబర్ 11 (జనం సాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో మల్లాపూర్‌లోని వీఎన్ఆర్ గార్డెన్స్‌లో మహబూబ్‌నగర్--రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. పట్టభద్రులు తమ ఓటు హక్కును నిర్లక్ష్యం చేయకుండా, ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. పట్టభద్రుల సమస్యలు, వారి హక్కులు, ఆకాంక్షలు చట్టసభల్లో ప్రతిబింబించాలంటే ఓటరు నమోదు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్ మోహన్ రెడ్డికి పట్టభద్రులు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. అర్హులైన పట్టభద్రులందరికీ ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో




సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి అర్హుడికి నమోదు ప్రక్రియకు సంబంధించిన సమాచారం చేరవేసి, ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకునేలా చొరవ తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో పట్టభద్రుల ఓటరు నమోదుపై విస్తృత అవగాహన కల్పించడం, అర్హులైన పట్టభద్రులందరినీ నమోదు ప్రక్రియలో భాగస్వాములను చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గంలోని వివిధ డివిజన్ల కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ సభ్యులు, మాజీ కార్పొరేటర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పట్టభద్రులు పాల్గొన్నారు.

## రామంతాపూర్‌లో శ్రీ మార్కండేయ ఆలయ కమాన్ ప్రారంభం



**ఉప్పల్, అక్టోబర్ 11 (జనం సాక్షి) :** రామంతాపూర్‌లోని ఇందిరానగర్‌లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ మార్కండేయ ఆలయ కమాన్‌ను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరై కమాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం ప్రతినిధులు, దేవాలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఆలయ కమాన్ ప్రారంభోత్సవం సందర్భంగా సంఘం ప్రతినిధులు, స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు కొండ కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి సిరిసాల విజయ ప్రకాష్, కోశాధికారి కొంగరి బాలచంద్రయ్య, సలహాదారులు పి.వి. రాం నర్సయ్య, గుండ్ల రవీంద్ర కుమార్, ఉపాధ్యక్షులు వర్కల స్వామి, ఏలే రమేష్, సంగిశెట్టి యాదగిరి, సహాయ కార్యదర్శి రాపోలు శేఖర్, సంయుక్త కార్యదర్శి గజం మురళి, సహాయ కోశాధికారి దునుక మురళి పాల్గొన్నారు. అలాగే కార్యనిర్వాహక సభ్యులు సంఘం వేణు, మునగపాటి నరసింహ, కార్యవర్గ సభ్యులు ఉలుగొండ నారాయణదాసు, పండాల నర్సింలు, గారిపల్లి లక్ష్మీనారాయణ, గంజి సురేష్, మిరియాల సందీప్, గంజి గణేష్, ఈడెం బాలు పాల్గొన్నారు. దేవాలయ కమిటీ చైర్మన్ జన్ను వెంకటయ్య, వైస్ చైర్మన్ వర్కాల పెంటయ్య, వ్యవస్థాపకులు సకినాల కృష్ణ, రాపోలు రాములు, తిరందాసు వెంకటేష్, గుర్రం అంబయ్య, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ వనం యాదగిరి, వైస్ చైర్మన్ రాపోలు రామచంద్రం, వ్యవస్థాపకులు చింతల సత్యనారాయణ, తిరందాసు శేషయ్య, చిక్క సత్యనారాయణ, బిక్షమయ్య, వీరేశం, గంజి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వనపర్తి జిల్లా దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహణ

- 2కే రన్, రోగులకు పండ్లు, మిఠాయిల పంపిణీ..
- చిట్యాలలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సంబరాలు

**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 11 (జనంసాక్షి) :** వనపర్తి జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా కేంద్రంతో పాటు మండలంలోని చిట్యాల గ్రామంలో ఆదివారం దశాబ్ది ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో 2కే రన్ చేపట్టగా, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. చిట్యాల గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. పాలిటెక్నిక్ కళాశాల నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు 2కే రన్ జిల్లా దశాబ్ది సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి జిల్లా ప్రజలకు, రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఏర్పాటుకు కృషి చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు విద్యార్థులు, యువకులు, వాకింగ్ గ్రూపుల సభ్యులు, ప్రముఖులతో కలిసి 2కే రన్ నిర్వహించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి చిన్నారులతో పూలమాలలు వేయించి నివాళులర్పించారు. పాల్గొన్న వారికి స్వీట్లు పంపిణీ చేసి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని పేర్కొన్నారు. తెలంగాణలో పరిపాలన వికేంద్రీకరణ, పాలనా సౌలభ్యం కోసం కేసీఆర్ ప్రభుత్వం 33 జిల్లాలు, కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాలను ఏర్పాటు చేసిందని అన్నారు. ప్రజల వద్దకు పాలనను తీసుకెళ్లడం ద్వారా ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యాయని తెలిపారు. జిల్లా ఏర్పాటుతో అనేక వసతులు అందుబాటులోకి వచ్చాయని, ప్రజల జీవన ప్రమాణాల్లో మార్పులు వచ్చాయని పేర్కొన్నారు. వనపర్తి జిల్లా మరో వెయ్యేళ్లు వర్ధిల్లుతూ భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. 2కే రన్ అనంతరం ప్రజలను ఆప్యాయంగా పలకరించిన నిరంజన్ రెడ్డి, బసవేశ్వర టిఫిన్ సెంటర్ నిర్వాహకులతో మాట్లాడి వ్యాపార పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం కార్యకర్తలు, వాకింగ్ గ్రూపుల సభ్యులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో గణేష్, బాలాజీ, హనుమాన్ వాకింగ్ గ్రూపుల సభ్యులు, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల బృందం, జై కిసాన్ జై జవాన్ సభ్యులు, కరాటే విద్యార్థులు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, మిఠాయిల పంపిణీ

జిల్లా దశాబ్ది వేడుకల్లో భాగంగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆదేశాల మేరకు వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 14వ వార్డు బీఆర్ఎస్ పార్టీ కాంటెస్టెడ్ కౌన్సిలర్ పవిత్ర భాను మోహనప్ప, 33వ వార్డు మాజీ కౌన్సిలర్ ఉంగ్లం తిరుమల్, పట్టణ సీనియర్ నాయకులు ఎం. నీలస్వామి, గులాం ఖాదర్, రహీం, వెంకటేష్, సాగర్, సింగనమోని రాజు, దండు యాదితో పాటు 14వ వార్డు పార్టీ కమిటీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

### చిట్యాలలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సంబరాలు

వనపర్తి మండలం చిట్యాల గ్రామంలో బీఆర్ఎస్ మండల




అధ్యక్షుడు కే. మాణిక్యం, సింగిల్ విండో అధ్యక్షులు వెంకట్రావు, భాను ప్రకాష్ రావు, గ్రామ సర్పంచ్ శోభ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, చిట్యాల గ్రామం బీఆర్ఎస్ పార్టీకి బలమైన స్థావరమని పేర్కొన్నారు. గ్రామంలో రాష్ట్రంలోనే అతిపెద్ద వ్యవసాయ మార్కెట్ యార్డును ఏర్పాటు చేయడం అభివృద్ధికి నిదర్శనమని అన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో జిల్లా కార్యాలయాలు, విద్యాసంస్థలు, సాగునీటి వసతులు ప్రజలకు మరింత చేరువయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్లు రఘువర్ధన్ రెడ్డి, వెంకట్రావు, మాజీ జెడ్పీటీసీ ధర్మనాయక్, నాయకులు మాధవరెడ్డి, నరేష్, అచ్యుతాపురం సర్పంచ్ శాంతయ్య, మాజీ సర్పంచులు ఫుల్‌సింగ్ నాయక్, లక్ష్మణ్ నాయక్, శారద, ఆశన్న నాయుడు, కర్ణాకర్, సుధాకర్, గ్రామ అధ్యక్షుడు కొమ్ము రాములు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో కాషాయజెండా ఎగురవేస్తాం

- 2029 లక్ష్యంగా బీజేపీ అడుగులు..
- శివంపేటలో బీజేపీకి యువజోష్
- భాజపాలో భారీగా చేరిన యువకులు
- అందోల్‌లో అభివృద్ధి ఏదీ..?
- మంత్రి తీరుపై బీబీ పాటిల్ విమర్శలు
- వైద్య సేవలు మెరుగుపర్చాలని చంటి ప్రభు డిమాండ్



**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 11 (జనం సాక్షి) :** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో మెజార్టీ స్థానాలు గెలుచుకొని కాషాయ జెండా ఎగరవేస్తామని బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, మాజీ ఎంపీ బీబీ పాటిల్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు చంటి ప్రభు భీమా వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా చౌట్కూర్ మండలం శివంపేట గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు యువకులు భారతీయ జనతా పార్టీలో చేరారు. బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చంటి ప్రభు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జహీరాబాద్ మాజీ ఎంపీ, తెలంగాణ క్రికెట్ సంఘం అధ్యక్షుడు బీబీ పాటిల్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పార్టీలో చేరిన యువకులకు కాషాయ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీబీ పాటిల్ మాట్లాడుతూ... అందోల్ నియోజకవర్గ అభివృద్ధిలో మంత్రి దామోదర రాజనర్సింహ ఆశించిన స్థాయిలో కృషి చేయలేదని విమర్శించారు. నియోజకవర్గంలోని రహదారుల దుస్థితి అభివృద్ధి తీరుకు అద్దం పడుతోందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఓట్లు అడగడానికి వచ్చే నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. యువత బీజేపీలో చేరడం పార్టీకి నూతన ఉత్సాహాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. చంటి ప్రభు మాట్లాడుతూ... వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అందోల్ నియోజకవర్గంలో బిజెపి అభ్యర్థి గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులవుతున్న యువత భారతీయ జనతా పార్టీ వైపు చూస్తున్నారన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా దామోదర రాజనర్సింహ ఉన్నప్పటికీ రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదని విమర్శించారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ... 2029 ఎన్నికల్లో తెలంగాణలో పార్టీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. అందోల్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాశేకర్ రెడ్డి, జిల్లా నాయకులు జగదీశ్వర్ పాటిల్, భూమన, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు బొర్రా ప్రవీణ్ యాదవ్, యువమోర్చా రాష్ట్ర కోశాధికారి నరేంద్ర దేశ్‌పాండే, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బుట్టో, వివిధ విభాగాల నాయకులు, చౌట్కూర్ మండల అధ్యక్షుడు నీరుడి ప్రవీణ్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల, అక్టోబర్ 11 (జనంసాక్షి) :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం జడ్చర్ల మున్సిపాలిటీలోని 3, 14వ వార్డుల్లో నిర్వహించిన వనమహోత్సవంలో మున్సిపల్ కమిషనర్ గిరీష్‌తో కలిసి పాల్గొని, మహిళలు, చిన్నారులకు పండ్ల, పూల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని, జడ్చర్లను పచ్చదనంతో సుందరంగా తీర్చిదిద్దాలని కోరారు. కమిషనర్ గిరీష్ మాట్లాడుతూ పంపిణీ చేసిన మొక్కలను ఇళ్ల వద్ద నాటి జాగ్రత్తగా పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ అశోక్, వార్డు అధికారులు కృష్ణయ్య, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కలే లక్ష్యం

**జడ్చర్ల, అక్టోబర్ 11 (జనంసాక్షి) :** అర్హులైన పేదలందరికీ సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జడ్చర్ల పట్టణంలో నిర్వహించిన హజ్రత్ సయ్యద్ హలీమ్ షా ఖాద్రి 310వ ఉర్సు షరీఫ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పాల్గొన్నారు. ఉర్సు వేడుకలు ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరగాలని కోరుకుంటూ నియోజకవర్గ ప్రజలందరికీ శుభాలు కలగాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు.



## దేవాలయ భూముల పరిరక్షణకు ధార్మిక సెల్ ఆధ్వర్యంలో ఉద్యమాలు

**వనపర్తి, అక్టోబర్ 11 (జనం సాక్షి) :** వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో బీజేపీ ధార్మిక సెల్ నూతన నియామకాలు చేపట్టారు. ఆదివారం వనపర్తిలోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ధార్మిక సెల్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ కొత్తకోట స్వాతి రెడ్డి ఆధ్వర్యంలో నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా గువ్వల బాలరాజు మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎన్నికల సమయంలో కొన్ని వర్గాలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటూ మతపరమైన విభేదాలను ప్రోత్సహిస్తున్నాయని విమర్శించారు. బీజేపీ మాత్రం ప్రజలను భాగస్వాములను చేస్తూ దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. అయోధ్యలో 500 ఏళ్ల తర్వాత భవ్యమైన రామమందిర నిర్మాణం జరిగిందని ఆయన తెలిపారు. తెలంగాణలో దేవాలయాలకు చెందిన భూముల పరిరక్షణకు ధార్మిక సెల్ ప్రత్యేకంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 92,758 ఎకరాల దేవాదాయ భూములు ఉండగా, అందులో 25 వేల ఎకరాలు అధికార పార్టీ నాయకుల ఆధీనంలో ఉన్నాయని ఆయన ఆరోపించారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో దేవాలయ భూములు అన్యాక్రాంతమయ్యాయని విమర్శించారు. దేవాదాయ భూములను తిరిగి స్వాధీనం చేసుకునే వరకు పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మెంటపల్లి పురుషోత్తం రెడ్డి, ధార్మిక సెల్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ నిరంజన్ దేశాయ్, కో-కన్వీనర్ దేవి ప్రసాద్ సముద్రాల, రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు అనుజ్ఞా రెడ్డి, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ గౌడ్, పెద్దిరాజు, కల్పన, జిల్లా కోశాధికారి బి. కుమారస్వామి, వాణిజ్య సెల్ రాష్ట్ర నాయకుడు బాశెట్టి శ్రీను, జిల్లా ఎండోమెంట్ సెల్ కో-కన్వీనర్లు రాధా రెడ్డి, ప్రతాపరెడ్డి, విజయ్, శంకర్, గద్వాల జిల్లా కో-కన్వీనర్లు రాఘవయ్య, రెడ్డప్ప, వీరేందర్, మదన్మోహన్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కవిత యాదవ్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గంధం ప్రవీణ్, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు అరవింద్, వివిధ మండలాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## విద్యుత్ కోతలకు నిరసనగా సబ్ స్టేషన్ వద్ద అన్నదాతల ఆందోళన

- సబ్ స్టేషన్ ఎదుట రైతుల వంటా వార్పు



**ఊర్కొండ, అక్టోబర్ 11 (జనం సాక్షి) :** జడ్చర్ల నియోజకవర్గం ఊర్కొండ మండలం జాకినాలపల్లి సబ్ స్టేషన్ వద్ద అదివారం రోజు రైతులు వినూత్న నిరసన చేపట్టారు. సక్రమంగా విద్యుత్ సరఫరా లేదని ఆరోపిస్తూ ఊర్కొండపేట, జాకినాలపల్లి రైతులతో కలిసి మాజీ సర్పంచ్ కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో సబ్ స్టేషన్ ఎదుట వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కాలువల నీళ్ల రాక, కరెంటు సరిగా లేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి సాగు చేస్తుంటే, పొలాలకు నీరు పెట్టాల్సిన సమయంలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందన్నారు. రైతు కుటుంబాల భవిష్యత్తు వ్యవసాయంపైనే ఆధారపడి ఉందని, నాణ్యమైన విద్యుత్ అందించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. విద్యుత్ కోతలను నివారించి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

### రైతులకు ఇబ్బందులు లేకుండా నాణ్యమైన సరఫరా

సబ్ స్టేషన్ పరిధిలోని రైతులకు ఎలాంటి ఆటంకం కలగకుండా నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తామని రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఈ సందర్భంగా తెలియజేశారు. ఆపరేటర్లు సిబ్బంది ఇలాంటి నిర్లక్ష్యానికి పాల్పడ్డ వెంటనే నాకు ఫిర్యాదు చేయాలని తెలియజేశారు. విద్యుత్ శాఖ ఏఈ హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు రామాంజనేయులు, సూక్కపురం అంజయ్య, శ్రీధర్ రెడ్డి, కటమోని జంగయ్య, ఆలకుంట మల్లేష్, కప్పర చంద్రయ్య, సురేందర్, సాయి రెడ్డి, మోటపురం యాదయ్య, బాల్ రాజ్, సిరిగిరి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## వట్టిపల్లి ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంకు రాష్ట్రస్థాయి ఎక్సలెన్స్ అవార్డు

- విద్యారంగంలో విశేష సేవలకు గుర్తింపు
- రవీంద్ర భారతిలో పురస్కార ప్రదానం




**తెలకపల్లి, అక్టోబర్ 11 (జనం సాక్షి) :** మండల పరిధిలోని వట్టిపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. జైపాల్‌కు రాష్ట్రస్థాయి ఎక్సలెన్స్ అవార్డు లభించింది. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌కు చెందిన శ్రీ శారద ఎడ్యుకేషనల్ సొసైటీ అందించే "ఎక్సలెన్స్ అవార్డ్ ఆఫ్ ది ఇయర్ – 2026" పురస్కారాన్ని ఆయన ఆదివారం అందుకున్నారు. అక్టోబర్ 11న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం చేతుల మీదుగా ఈ అవార్డును స్వీకరించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయడం, వినూత్న బోధనా విధానాలను అనుసరించడం, విద్యార్థుల్లో నైతిక విలువలు, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం వంటి సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం అందజేశారు. మారుమూల ప్రాంతంలోని వట్టిపల్లి ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు జైపాల్ చేస్తున్న కృషికి ఈ అవార్డు గుర్తింపుగా నిలిచింది. ఈ సందర్భంగా జైపాల్ మాట్లాడుతూ, ఈ పురస్కారం తనలో మరింత ప్రోత్సాహాన్ని, పట్టుదలను పెంచుతుందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేసేందుకు మరింత బాధ్యతతో కృషి చేస్తానని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న తోటి ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, దాతలు, యువకులు, విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అందరి సమష్టి సహకారంతో ప్రభుత్వ పాఠశాలను మరింత అభివృద్ధి చేయవచ్చని అన్నారు.

## మోదీపై ఆరోపణలు చేస్తే సహించేది లేదు

**తెలకపల్లి, అక్టోబర్ 11 (జనం సాక్షి) :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలను బీజేపీ నాయకులు ఖండించారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఈర్లపల్లి శ్రీనివాసులు ముదిరాజ్ , యువ మోర్చా జిల్లా ఐటీ కో కన్వీనర్ కనుక రమేష్ , ఎగ్జిక్యూటివ్ నెంబర్ భాను ప్రసాద్ గౌడ్ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రధానమంత్రి మోదీపై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. విమర్శలు చేసే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని, ఆరోపణలు చేస్తే తగిన ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో విమర్శించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నప్పటికీ, ఆ హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రధాని మోదీపై వ్యక్తిగత విమర్శలు చేస్తూ ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. ప్రజా సమస్యలు, దేశాభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చించకుండా రాజకీయ ప్రయోజనాల కోసం ఆరోపణలు చేయడం తగదన్నారు. సినీ నటుడు ప్రకాష్ రాజ్ ప్రధానమంత్రి మోదీపై చేస్తున్న విమర్శలను కూడా ఆయన ఖండించారు. నిరాధార ఆరోపణలతో రాజకీయ వాతావరణాన్ని కలుషితం చేయకుండా, నిర్మాణాత్మక చర్చలకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రతిపక్ష పార్టీలకు సూచించారు. ఈ సమావేశంలో బీజేవైఎం కార్యవర్గ సభ్యుడు భాను ప్రకాష్ గౌడ్, బీజేపీ ఐటీ కో-కన్వీనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ కోతలతో రైతాంగం ఆగమాగం

- పంటలు ఎండిపోతున్నా పట్టించుకోవడం లేదు
- ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తి చూపిన ఎమ్మెల్యే సునితా రెడ్డి



**హత్నూర, అక్టోబర్ 11 (జనం సాక్షి) :** విద్యుత్ కోతల కారణంగా పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వంలో ఏమాత్రం చలనం కనిపించడం లేదని ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డి ఆరోపించారు. మండలంలోని భీంలా తాండా,దేవుని గుట్ట తండా శివారులో గల వ్యవసాయ పొలాల్లో ఆదివారం క్షేత్ర స్థాయిలో పర్యటించి విద్యుత్తు కోతలతో సాగునీరందక ఎండిపోయిన పంటలను వారు పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.సాగు విస్తీర్ణం,పెట్టుబడి వ్యయం,విద్యుత్ సరఫరా తదితర వివరాలపై రైతులతో మాట్లాడారు.విద్యుత్ కోతలతో చేతికొచ్చిన పంట ఎండుముఖం పడుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆమె దుయ్యబట్టారు. కరెంటు సమస్యను నిరసిస్తూ రైతులు విభిన్న పద్ధతుల్లో ధర్నాలు,నిరసనలు,ఆందోళనలు వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా అనిపించడం లేదని ఆమె విమర్శించారు.రైతులు సాగు చేసిన పంటలను కాపాడాల్సిన ప్రభుత్వం అదేమీ పట్టనట్టు బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని ఆమె ధ్వజమెత్తారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిరంతరాయంగా విద్యుత్ ను సరఫరా చేయడంతో పాటు ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## వనపర్తిలో సీబీఎస్ షాపింగ్ మాల్‌లో 'దసరా డబుల్ ధమాకా సేల్' ప్రారంభం

- సినీనటి పాయల్ రాజ్‌పుత్ సందడి..
- ప్రత్యేక ఆఫర్లు, ఆకర్షణీయమైన బహుమతులు
- బతుకమ్మ ఆడిన సినీనటి పాయల్ రాజ్‌పుత్..
- తెలంగాణ పండుగలంటే ఎంతో ఇష్టమని వెల్లడి



**వనపర్తి, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** వనపర్తి పట్టణంలోని శ్రీరంగ థియేటర్ ఎదురుగా ఉన్న సీబీఎస్ (చందన బ్రదర్స్ షాపింగ్ మాల్)లో 'దసరా డబుల్ ధమాకా సేల్'ను సినీనటి పాయల్ రాజ్‌పుత్ శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె సందడి చేయడంతో షోరూంలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ సంప్రదాయ పండుగ బతుకమ్మ అంటే తనకు ఎంతో ఇష్టమని పేర్కొన్న పాయల్.. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా పాయల్ రాజ్‌పుత్ మాట్లాడుతూ.. వనపర్తికి రావడం, సీబీఎస్ దసరా డబుల్ ధమాకా సేల్ ప్రారంభోత్సవంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కుటుంబ వేడుకలు, ప్రత్యేక కార్యక్రమాలు, సినిమా షూటింగ్‌లకు అవసరమైన కాస్ట్యూమ్స్ కోసం తాను సీబీఎస్‌లోనే షాపింగ్ చేస్తానని తెలిపారు. ఇక్కడ లభించే విభిన్న డిజైన్లు, ప్రత్యేకమైన వస్త్రాల కలెక్షన్లు తనను ఆకట్టుకుంటాయని, అందుకే సీబీఎస్ తనకు ఇష్టమైన షాపింగ్ కేంద్రంగా మారిందని పేర్కొన్నారు.

### 40 ఏళ్ల అనుబంధంతో విస్తరిస్తున్న సీబీఎస్

సీబీఎస్ మేనేజింగ్ డైరెక్టర్ జానా సురేష్ మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాలుగా వినియోగదారుల ఆదరణతో తమ సంస్థ తెలుగు రాష్ట్రాల్లో విస్తరిస్తోందని తెలిపారు. తాము ప్రారంభించిన ప్రతి షోరూంకు స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. వనపర్తి ప్రజల అభిరుచులకు అనుగుణంగా ప్రత్యేక వస్త్ర కలెక్షన్లతో షోరూంను తీర్చిదిద్దామని, స్థానిక వినియోగదారుల కోసం 'దసరా డబుల్ ధమాకా సేల్'ను అందుబాటులోకి తీసుకొచ్చామని వివరించారు.

అన్ని ఆదాయ వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన సంప్రదాయ వస్త్రాలతో పాటు ఆధునిక ఫ్యాషన్ దుస్తులను అందించడమే తమ లక్ష్యమని చెప్పారు. దసరా, దీపావళి పండుగలతో పాటు షోరూం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక తగ్గింపులు, ఆకర్షణీయమైన ఆఫర్లు అందిస్తున్నట్లు వెల్లడించారు.

### వినియోగదారులతో కిటకిటలాడిన షోరూం

ప్రారంభోత్సవం సందర్భంగా షోరూంకు వినియోగదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్యంగా మహిళలు ప్రత్యేక ఆఫర్లను సద్వినియోగం చేసుకుంటూ చీరలు, ఇతర వస్త్రాలను కొనుగోలు చేశారు. దీంతో షోరూం సందడిగా మారింది.

సీబీఎస్ చందన బ్రదర్స్ షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'దసరా డబుల్ ధమాకా సేల్'లో భాగంగా వినియోగదారులకు ఆకర్షణీయమైన ధరల్లో ప్రత్యేక ఆఫర్లు, బహుమతులు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు.

## మల్దకల్‌లో ఘనంగా జిల్లా దశాబ్ది ఉత్సవాలు



**మల్దకల్, అక్టోబర్ 11 (జనంసాక్షి) :** మండలకేంద్రంలో తెలంగాణలో జిల్లాల ఏర్పాట్లు భాగంగా కేసీఆర్ జోగులాంబ గద్వాల జిల్లాను ఏర్పాటు చేసి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారంగద్వాల నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు ఆదేశాల మేరకు బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ చిత్రపటానికి మల్దకల్ మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాలాభిషేకం చేసి,సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యాన్న, డి.శేఖర్ నాయుడు, తిరుమలేష్, రమేష్, హరిబాబు, లక్ష్మీ నారాయణ, తిమ్మప్ప, రాముడు, నరసింహులు, జార్జి,గోవిందు,వీరేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో గ్రూపులకు తావులేదు

- ఎమ్మెల్యే గడ్డం వినోద్



బెల్లంపల్లి, అక్టోబర్ 11 (జనంసాక్షి) : బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ లో గ్రూపులకు తావులేదని అందరం కలిసికట్టుగా పనిచేస్తామని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, పార్టీ సీనియర్ నాయకుడు మత్తమారి సూరిబాబు సంయుక్తంగా ప్రకటించారు. సీనియర్లను గౌరవించడం లేదని గత కొన్నాళ్ళుగా ఎదురు తిరిగిన అసమ్మతి వర్గం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పట్టణంలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారంతో పాటు పట్టణ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు మాట్లాడుతూ బెల్లంపల్లి కాంగ్రెస్ పార్టీలో గ్రూపు విభేదాలకు తావులేదని, పార్టీ నాయకులమంతా ఒకే కుటుంబంలా ఐక్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ నాయకత్వంలో బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్, పట్టణ అధ్యక్షులు బండి ప్రభాకర్, మాజీ పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో కలిసి సమష్టిగా పనిచేస్తామని తెలిపారు. బెల్లంపల్లి పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా అందరం కలిసికట్టుగా ముందుకు సాగుతామని, ఎమ్మెల్యే నాయకత్వానికి ఎల్లప్పుడూ అండగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములమవుతామని సీనియర్ నాయకులు ప్రకటించారు. దీంతో ఇన్నాళ్లు అసమ్మతి కుంపటి కాస్త పార్టీ పెద్దల ఆదేశాల మేరకు కలిసికట్టుగా పని చేయడానికి ఏకం కావడం శుభపరిణామం అని పార్టీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేశాయి.

# క్రీడలతో క్రమశిక్షణ, పట్టుదల, స్నేహభావం, లక్ష్యసాధనను నేర్పుతాయి

- ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యులు గొడం నగేష్



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 11(జనంసాక్షి): క్రీడలు శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, స్నేహభావం, లక్ష్యసాధనను నేర్పుతాయని ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యులు గొడం నగేష్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆదర్శ క్రీడా పాఠశాలలో జిల్లా కలెక్టర్ కె.హరిత, ఎస్.పి. నితిక పంత్, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసన సభ్యురాలు కోవ లక్ష్మి లతో కలిసి 12వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ – 2026 పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి, క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి, జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్రంలోని 32 జిల్లాల నుంచి క్రీడాకారులు ఈ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్నారని తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లా ఏర్పడి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జరిగిన ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని, విద్యార్థుల జీవితంలో క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఉందని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసానికి, క్రమశిక్షణకు, ఆత్మవిశ్వాసానికి దోహదపడతాయని తెలిపారు. చిన్న వయస్సు నుండి క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని, క్రీడలలో గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ పట్టుదలతో ముందుకు సాగాలని క్రీడాకారులకు సూచించారు. రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనడం ద్వారా క్రీడాకారులకు తమ ప్రతిభను నిరూపించుకునే మంచి అవకాశం లభిస్తుందని, ఇందుకు ఛాంపియన్షిప్ పోటీలు ఒక వేదిక అని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, క్రీడలతో విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, సమయపాలన, జట్టుగా పనిచేసే నైపుణ్యాలు పెంపొందుతాయని తెలిపారు . క్రీడాకారులు క్రమం తప్పకుండా సాధన చేస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని, గ్రామీణ ప్రాంతాలలోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహిస్తామని తెలిపారు. ఇలాంటి రాష్ట్ర స్థాయి పోటీల నిర్వహణ ద్వారా యువ క్రీడాకారులకు తమ ప్రతిభను చాటుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. క్రీడలు క్రమశిక్షణ, పట్టుదల, లక్ష్యసాధన వంటి విలువలను నేర్పుతాయని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం పోటీలలో విజయం సాధించిన వారికి జ్ఞాపికలు, బహుమతి, పతకాలు, ధ్రువపత్రాలు అందజేశారు. ప్రథమ స్థానంలో పి.కౌశిక్, ద్వితీయ స్థానంలో హిమంత్ రావు, తృతీయ స్థానంలో ప్రణీత్ లు నిలిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎం.శేకు, డి.సి.సి. ప్రతినిధి ఆత్రం సుగుణ, అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధి కొట్నాక విజయ్, వివిధ శాఖల అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు, నిర్వాహకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

- జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్
- జిల్లా ప్రధాన కార్యదర్శిగా షేక్ రహీం



జైనూర్, అక్టోబర్ 11 (జనంసాక్షి) : జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శిగా షేక్ రహీం నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షురాలు సుగుణక్క, జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ జిల్లా అధ్యక్షుడు అర్షద్ హుస్సేన్ తెలిపారు. షేక్ రహీంను జిల్లా మైనారిటీ ప్రధాన కార్యదర్శి గా నియమించడంతో ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు షేక్ రషీద్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి శాలువా తో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ శ్రేణులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన జిల్లా మైనారిటీ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. జిల్లా లోని మైనారిటీ వర్గాలను పార్టీతో మరింత అనుసంధానం చేస్తూ, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, నియోజకవర్గ ఇంచార్జ్ శ్యామ్ నాయక్, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు ఆర్షద్ హుస్సేన్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జైనూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ రషీద్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షులు సుద్దాల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు పెందుర్ ప్రకాష్, మాజీ వైస్ ఎంపిపి చిర్లే లక్ష్మణ్, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు దుర్వా సింధు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు భుజంగ్ రావ్, మైనారిటీ మండల సెల్ అధ్యక్షుడు షేక్ అబ్బు, బిసి సెల్ మండల అధ్యక్షుడు దండుగుల మహేష్, సర్పంచ్ రాజేందర్, సయ్యద్ వసీం పాల్గొన్నారు.

# శాత్రాజ్‌పల్లిలో గృహాల కూల్చివేత

- నోటీసులు ఇవ్వకుండా కూల్చివేశారంటూ బాధితుల ఆవేదన



మల్హర్, అక్టోబర్ 11 (జనంసాక్షి) : మండల కేంద్రమైన తాడిచర్లలోని శాత్రాజ్‌పల్లి లో శనివారం అర్ధరాత్రి, రెవెన్యూ, పోలీస్, సింగరేణి, అగ్నిమాపక అధికారులు సుమారు 400 ఇళ్లను ఎనిమిది జేసీబీలతో కూల్చివేసి నేలమట్టం చేశారు. సుమారు 200 మందికి పైగా పోలీసుల బందోబస్తు మధ్య రెవెన్యూ, సింగరేణి, పోలీసు, అగ్నిమాపక సిబ్బంది ఈ చర్య చేపట్టారు. తాడిచర్ల బ్లాక్–2 గని నేపథ్యంలో ఈ కూల్చివేతలు జరిగినట్లు తెలుస్తోంది. కూల్చివేతల సమాచారం తెలుసుకున్న సర్పంచ్ బండి స్వామి, గ్రామస్తులతో కలిసి అధికారులను అడ్డుకున్నారు. ముందుగా గ్రామసభ నిర్వహించి, నోటీసులు ఇచ్చిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని కోరారు. పేదలు అప్పులు చేసి లక్షల రూపాయలతో నిర్మించుకున్న ఇళ్లను అర్ధరాత్రి కూల్చడం అన్యాయమని వాదించినప్పటికీ, జేసీబీలతో కూల్చివేతలు కొనసాగాయని గ్రామస్తులు తెలిపారు.

### పరిహారం కల్పించాలని డిమాండ్

ఇళ్ల నిర్మాణానికి కలపను ఇతర ప్రాంతాల నుంచి అటవీశాఖ అనుమతులు, రుసుములతో కలప తెచ్చుకున్నామని బాధితులు చెబుతున్నారు. ముందస్తు నోటీసులు ఇవ్వకపోవడంతో ఇంటి సామగ్రిని కూడా తొలగించుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అర్ధరాత్రి ఇళ్లను కూల్చివేయడంపై చట్టబద్ధత ప్రశ్నార్థకంగా మారింది. కూల్చివేతలపై విచారణ జరిపించి, బాధితులకు న్యాయం చేయాలని స్థానికులు జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు.



# రైల్వే స్టేషన్ వద్ద గ్యార్మి షరీఫ్ ఉత్సవాలు

- వందలాది మందికి అన్నదానం

వరంగల్ ఈస్ట్, అక్టోబర్ 11 (జనం సాక్షి) : వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని 35 వ డివిజన్ శివనగర్ రైల్వే స్టేషన్ ఆటో వద్ద ఆదివారం గ్యార్మి షరీఫ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మందికి అన్నదానం నిర్వహించారు. అంతకుముందు ముస్లిం సోదరులు అంత కలిసి ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు ఎంఏ జబ్బర్, మసూద్, షౌకత్, అబిట్, హుస్సేన్, మగ్దూం, హుస్సేన్ తో పాటు మెరుగు అశోక్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ప్రతి సంవత్సరం ఎంతో గొప్పగా గ్యార్మి షరీఫ్ఉత్సవాలునిర్వహించడంసంతోషదాయకమన్నారు. సాయంత్రం జండా ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరుగుతోందని పేర్కొన్నారు. అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని వారు కోరారు. కార్యక్రమంలో కుమార్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ సత్యశారద



వరంగల్ ఈస్ట్, అక్టోబర్ 11 (జనం సాక్షి) : శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కుటుంబ సమేతంగా ఆదివారం వరంగల్‌లోని శ్రీ భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు కుటుంబ సమేతంగా విచ్చేసిన జిల్లా కలెక్టర్‌కు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు చేపట్టి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో భద్రకాళి అమ్మవారి ఆలయం భక్తులతో సందడిగా మారింది. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అమ్మవారి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. శరన్నవరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించేలా ఆలయ పరిపాలన విభాగం అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. భద్రకాళి ఆలయంలో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడుతున్నాయని వారు పేర్కొన్నారు.

# జంగల్ సఫారీ మారథాన్‌కు శ్రీకారం



- 30కె, 10కె, 5కె రన్ ప్రారంభించిన ఎమ్మెల్యే

మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 11 (జనంసాక్షి) : మంచిర్యాల జిల్లాలోని హాజీపూర్ మండలం ర్యాలీగడపూరి సమీపంలోని ఏసీసీ క్వారీ వద్ద తెలంగాణ అటవీ శాఖ, గ్రీన్ స్క్వేర్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన దేశీయ స్థాయి తొలి ఫారెస్ట్ సఫారీ మారథాన్ 30కె, 10 కె, 5కె రన్నింగ్ జంగల్ సఫారీ, కార్యక్రమాన్ని ఉట్నూర్ ఐటీడీఏ పీవో మంద మకరందు ఐఏఎస్, మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు , డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ డైరెక్టర్ శాంత రామ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ... ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్వహించిన అడవి శాఖ అధికారులను అభినందించారు..అడవుల అందాలను పరిచయం చేస్తూ, ప్రకృతి పరిరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించే లక్ష్యంతో ఈ మారథాన్ నిర్వహించారని తెలిపారు .అడవులను కాపాడుకోవడంతోపాటు పచ్చని పకృతి ఒడిలో పరిగెత్తడం వల్ల మంచి స్వచ్ఛమైన గాలిని పిలుచుకోవచ్చని అన్నారు.పర్యాటకాన్ని ప్రపంచానికి తెలియజేయడంతో పాటు శారీరక దృఢత్వం పెంచుకోవచ్చని అన్నారు.

# కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయమే లక్ష్యం : చల్లా ధర్మారెడ్డి



హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 11 (జనంసాక్షి) : రాబోయే వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కంకణబద్ధులై పనిచేయాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టభద్రుల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు, పట్టభద్రుల ఓటరు నమోదుపై ఆత్మకూరు, గీసుగొండ మండలాలు, జీడబ్ల్యూఎంసీ 15, 16, 17 డివిజన్ల పార్టీ నాయకులతో హన్మకొండలోని వారి నివాసంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో చల్లా ధర్మారెడ్డి మాట్లాడారు. గతంలో పరకాల నియోజకవర్గ పరిధిలో సుమారు 19,500 పట్టభద్రుల ఓట్లు ఉన్నాయని, ఈసారి అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా పార్టీ శ్రేణులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఓటర్ల నమోదు, పర్యవేక్షణ కోసం క్లస్టర్లను ఏర్పాటు చేసి సమన్వయకర్తలను నియమించినట్లు తెలిపారు. గ్రామాలు, డివిజన్ల వారీగా ప్రత్యేక క్యాంపులు నిర్వహించి, ప్రైవేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వైద్యులు, న్యాయవాదులు, బ్యాంకు ఉద్యోగులతో పాటు డిగ్రీ పూర్తి చేసి మూడేళ్లు నిండిన అర్హులైన పట్టభద్రులను కలిసి ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. గతంలో ఓటు నమోదు చేసుకున్నవారు సైతం తాజా ఓటరు జాబితా కోసం నిబంధనల ప్రకారం మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరాన్ని వారికి వివరించాలన్నారు.ప్రతి నాయకుడు, కార్యకర్తకు బాధ్యత అప్పగించి సమష్టిగా పనిచేస్తే బీఆర్ఎస్ విజయానికి బలమైన పునాది వేయవచ్చని అన్నారు. పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేస్తూ అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు పూర్తయ్యేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఆత్మకూరు, గీసుగొండ మండలాలు, జీడబ్ల్యూఎంసీ 15, 16, 17 డివిజన్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రేపు జిల్లాలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు పర్యటన

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ ఈ నెల 13న జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టరేట్ లో ఎస్టీ వర్గాల నుండి వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. అనంతరం అన్ని శాఖల అధికారులతో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు సమగ్ర నివేదికలతో హాజరు కావాలని కలెక్టర్ సూచించారు.

# జిల్లా కలెక్టర్ బ్రీడింగ్ చెక్కర్స్‌ను ఆదుకోవాలి



- బ్రీడింగ్ చెక్కర్స్ యూనియన్ వరంగల్ జిల్లా అధ్యక్షులు భూక్య శ్రీనివాస్

చెన్నారావుపేట, అక్టోబర్ 11( జనం సాక్షి): జిల్లా కలెక్టర్ బ్రీడింగ్ చెక్కర్స్ ను విధుల్లోకి తీసుకొని తమ కుటుంబాలను ఆదుకోవాలని బ్రీడింగ్ చెక్కర్స్ యూనియన్ వరంగల్ జిల్లా అధ్యక్షులు భూక్య శ్రీనివాస్, ఉపాధ్యక్షులు చిన్నపెల్లి దేవేందర్ లు కోరారు. ఆదివారం చెన్నారావుపేట మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. వరంగల్ జిల్లాలోని గ్రామాలలో బ్రీడింగ్ చెక్కర్స్ గా పనిచేయడానికి విధుల్లోకి తీసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజారెడ్డికి ఆదేశాలు జారీ చేశారన్నారు. దీంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజారెడ్డిని సెప్టెంబర్ 30వ తేదీన మర్యాదపూర్వకంగా కలిసి తమను విధుల్లోకి తీసుకోవాలని కలవగా తమ నుండి దరఖాస్తులను కూడా స్వీకరించినట్లు తెలిపారు. కానీ ఇప్పటివరకు విధుల్లోకి తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తమను విధుల్లోకి తీసుకునే విధంగా చూడాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్రీడింగ్ చెక్కర్స్ రాజు, శేఖర్, రామ్ చందర్, భద్రయ్య, సూర్య, రవి, బాబు, రామ్ కుమార్, సిహెచ్ రాజు, దేవేందర్, రాజేశ్వరరావు, చాణిక్య, సరిత, సల్లావుద్దిన్, తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవకు అరుదైన గౌరవం..

- గురిజాల శ్రీరామ్ రెడ్డికి గౌరవ డాక్టరేట్
- చెన్నైలో జరిగిన 'సోషల్ లీడర్స్ అండ్ విజనరీస్ కాన్‌క్లేవ్-2026'లో డాక్టరేట్ ప్రదానం



ఆత్మకూరు, అక్టోబర్ 11 (జనంసాక్షి) : సామాజిక సేవా రంగంలో విశేష కృషి చేస్తున్న గురిజాల శ్రీరామ్ రెడ్డికి అరుదైన గౌరవం లభించింది. విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి కనబరుస్తూ, వివిధ సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు అండగా నిలుస్తున్న ఆయనకు యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్‌షిప్ అండ్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో "డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్ (హానరీస్ కాఉషా)' గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. 2026 అక్టోబర్ 10న శనివారం చెన్నైలోని కృష్ణ గాన సభ ఆడిటోరియంలో ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన 'సోషల్ లీడర్స్ అండ్ విజనరీస్ కాన్‌క్లేవ్–2026' కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. వివిధ రంగాల్లో నాయకత్వ ప్రతిభ, సామాజిక బాధ్యత, విశిష్ట సేవలు అందించిన వ్యక్తులను గౌరవించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ వ్యవస్థాపకులు, డైరెక్టర్, తమిళనాడు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కె. వెంకటేశన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా అంబాసిడర్ డాక్టర్ పర్విందర్ సింగ్, డాక్టర్ స్వామి పద్మేంద్ర, అభిషేక్ పుష్కర్, ప్రొఫెసర్ పి. అమృతవల్లి తదితరులు పాల్గొన్నారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల సమక్షంలో గౌరవ డాక్టరేట్ ప్రదానం కార్యక్రమం నిర్వహించారు. గురిజాల శ్రీరామ్ రెడ్డి విద్యార్థి దశలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) వాలంటీర్‌గా సేవలు ప్రారంభించారు. అనంతరం శ్రీరామ్ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు విద్యా సహాయం, పేదలకు సామాజిక సహకారం, ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, అన్నదానం, ఆహార, వస్త్రాల పంపిణీ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ సామాజిక సేవలో తనదైన ముద్ర వేశారు. పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులకు సహాయం అందించడం వంటి కార్యక్రమాల్లోనూ ఫౌండేషన్ సేవలందిస్తోంది. విద్య, వైద్యం, పేదల సంక్షేమం వంటి రంగాల్లో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్న శ్రీరామ్ రెడ్డికి గౌరవ డాక్టరేట్ లభించడం ఆయన సేవా ప్రస్థానంలో మరో ముఖ్యమైన ఘట్టంగా నిలిచింది. ఈ గుర్తింపు భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రేరణగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# విద్యుద్ఘాతంతో యువకుడు మృతి



కాటారం అక్టోబర్ 11( జనం సాక్షి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల పరిధిలోని దంతాలపల్లి గ్రామపంచాయతీలో భౌతు కరుణాకర్(20 ) యువకుడు దసరా సందర్భంగా సద్దుల బతుకమ్మ కొరకు విధి దీపాలు పెడుతుండగా విద్యుత్ షాక్ తో కుప్పకూలిపోయాడు. 108 ద్వారా మహదేవ్పూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతను అప్పటికే మృతి చెందినట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి . పండుగ పూట కుటుంబంలో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

## రూ.25 లక్షలతో హైలెవల్ వంతెన నిర్మాణం పూర్తి

- మల్లెలమడుగు ప్రజల రాకపోకల కష్టాలకు తెర..
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు



**అశ్వాపురం, అక్టోబర్ 11 (జనంసాక్షి) :** మల్లెలమడుగు గ్రామ పరిధిలో వరదల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న రాకపోకల ఇబ్బందులకు హై లెవల్ వంతెనతో పరిష్కారం లభించింది. సుమారు రూ.25 లక్షల అంచనా వ్యయంతో గిరిజన అభివృద్ధి నిధుల ద్వారా నిర్మించిన ఈ వంతెనతో వర్షాకాలంలో ముంపు సమస్య నుంచి ఉపశమనం కలగనుంది. ఆదివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కొబ్బరికాయ కొట్టి రిబ్బన్ కట్ చేసి ఈ వంతెనను ప్రారంభించారు. గతంలో వరదల సమయంలో రహదారులు నీట మునగడంతో మల్లెలమడుగు, మల్లన్న గుడి పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. విద్యార్థులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, ఉద్యోగులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడేవారు. ఈ సమస్యను గుర్తించిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి, నిర్మాణ పనులు పూర్తి చేయించారు.వంతెన అందుబాటులోకి రావడంతో వర్షాకాలంలోనూ రాకపోకలు సులభతరం కానున్నాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.అదేవిధంగా మల్లెలమడుగు గ్రామంలో మిగిలిపోయిన అంతర్గత రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, గ్రామ అభివృద్ధికి మరింత కృషి చేయాలని స్థానికులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం మండలం ఎంపీడీవో ముత్యాలరావు, ఆర్ అండ్ బి శాఖ అధికారులు,శ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు, మల్లెల మడుగు సర్పంచ్ మచ్చ నరసింహారావు ,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఎస్ఎల్‌బిసి సొరంగ మార్గాన్ని పూర్తి చేయించడమే నా జీవిత ఆశయం

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- రోడ్లు బాగుంటే పరిశ్రమలు, రైస్ మిల్లులు,
- మార్కెట్ విలువలు పెరుగుతాయి
- ఆడపడుచుల ఆత్మగౌరవానికి చిలుక పచ్చ బతుకమ్మ చీరల పంపిణీ



**కనగల్లు, అక్టోబర్ 11 (జనం సాక్షి) :** శ్రీశైలం సొరంగ మార్గాన్ని పూర్తి చేయించి రెండు పంటలకు నీళ్లు అందించి నల్లగొండ జిల్లాను ఆకుపచ్చని జిల్లాగా చూడడమే నా జీవిత ఆశయమని రాష్ట్ర రోడ్లు భవనముల, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని తేల కంటి గూడెం వయ్య తోరగల్లు మీదుగా ముషంపల్లి, ఎస్ లింగోటం వయ్యా చిన్న మాదారం ఇరగంటి పెల్లి మీదుగా ముషంపల్లీ వరకు 74 కోట్ల రూపాయల నిధులతో చేపట్టనున్న డబల్ రోడ్డు పనులకు సర్పంచులు, అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి, సాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత నిస్తుందని జిల్లా ప్రజల చిరకాల కోరిక శ్రీశైల సొరంగ మార్గమని ఈ ప్రాజెక్టు పూర్తి అయితే నల్లగొండ జిల్లాతో పాటు పాలమూరు జిల్లాలు సాగునీటితో చెరువులు జల కలగా మారి బీడు భూములు కాస్త పచ్చని మాగాని భూములుగా మారతాయని గుర్తు చేశారు. గుడిసెలలో నివాసముండే పేదవాడికి ఐదు లక్షల రూపాయల ఖర్చు చేసి ఇందిరమ్మ గృహ పథకం కింద ఇల్లులు నిర్మించి ఇస్తున్నట్లు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా ఏ ఆధారం లేని నిరుపేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వడంతోపాటు తేల కంటి గూడెంలో పైలెట్ ప్రాజెక్టు కింద గుర్తించి 107 ఇండ్లను మంజూరు ఇచ్చి త్వరితగతిన పూర్తి అయి గృహప్రవేశం కూడా చేయించినట్లు తెలిపారు. గృహ నిర్మాణంలో బిల్లులను ఎల్ 1 ఎల్ 3 సమస్య లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో విడతలవారీగా ఇందిరమ్మ ఇండు ఇస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పథకాలు ప్రకటించి గొప్పలు చెప్పిందే తప్ప ప్రజా ప్రభుత్వంలో ప్రకటించిన ప్రతి పథకం అమలు చేసి చూపిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని ఇది పేదవాడి ప్రభుత్వమన్నారు. ప్రతి గ్రామానికి రోడ్ల సౌకర్యం మెరుగుగా ఉంటే అక్కడ భూముల విలువల పెరగడం, రైస్ మిల్లులు వస్తే రైతులకు సౌకర్యంగా ఉండడం, పరిశ్రమలు ఏర్పడితే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, కూలీలకు చేతినిండా పని దొరుకుతుందన్నారు. రెండు సంవత్సరాలు కాలం సాఫీగా కొనసాగి అన్ని రంగాలు అభివృద్ధి వైపు పరుగులు తీశాయని. ఈ సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా కరువు ఛాయాలతో యాల్‌నినో విపత్తు కారణంగా వర్షాలు సకాలంలో పడక ప్రాజెక్టులలో నీరు తగ్గడం, భూగర్భ జలాలు అడుగంటి నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నందున నీటిని ప్రతి ఒక్కరు పొదుపుగా వాడుకోవాలని, ఏఎంఆర్పి ప్రధాన కాలువ ద్వారా పెద్దపెద్ద చెరువులను నింపి త్రాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి తెలియజేశారు. కెసిఆర్ ప్రభుత్వం ఎక్కడో మూలకు పడేసిన చీరలు తెచ్చి ఇచ్చారని ప్రజా ప్రభుత్వంలో ఆడపడుచుల ఆత్మగౌరవం నిలబడే విధంగా నాణ్యమైన చిలక పచ్చ బతుకమ్మ చీరలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎల్. నీ. వో. ప్రభావంతో నీటి తీవ్రత ఉంటుందని రైతులు వరి పంటలను వేయకుండా ఆరుతడి పంటలవైపు మొగ్గు చూపాలని సూచించారు. ఇంకుడు గుంతలు, నీటి కుంటలు వి బి జి రాంజీ పథకం కింద ఏర్పాటు చేసుకోవాలని, లింగోటం లో ఇంకుడు గుంతలు నిర్మించుకునే విధంగా ప్రజలలో అవగాహన కల్పించడంలో సర్పంచ్ పోషమల్ల సురేష్ కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ ఇ మోహన్ డి ఈ ఈ, శ్రీధర్ రెడ్డి ఆర్డీవో వై అశోక్ రెడ్డి తహసిల్దార్ పద్మ, ఎంపీడీవో వేద రక్షిత, డి . ఇ గణేష్, ఏ.ఇ శ్రీకాంత్ మార్కెట్ చైర్మన్ బైరెడ్డి హేమలత, ఆర్టిఏ జిల్లా సభ్యుడు కే రాజారెడ్డి, ఆత్మ చైర్మన్ గోలి జగాల్ రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు ఓర్సు పెంటయ్య, తేల కంటి గూడెం సర్పంచ్ బైరు నాగమణి నాగయ్య, ఎస్ లింగోటం సర్పంచ్ పోషమల్ల సురేష్, చెట్ల చెన్నారం, బాబా సహేబ్ గూడెం, చిన్న మాదారం సర్పంచులు రావుల మల్లేష్, గోగు గోవర్ధన్ రెడ్డి, మలికంటి సుజాత రాజు, నర్సింగ్ మురళీధర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు అనుపు రెడ్డి, పార్టీ సీనియర్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, గుమ్మల మోహన్ రెడ్డి, బిక్షం యాదవ్, భారత వెంకటేశం , మోహన్ రెడ్డి, నర్సింగ్ కృష్ణయ్య గౌడ్, గోలి నర్సిరెడ్డి, కేసాని వెంకటరెడ్డి, పోచమల్ల లింగయ్య, బక్క రాజశేఖర్, మేకల నరసింహ, ఏం సి డైరెక్టర్ దేవి రెడ్డి లక్ష్మారెడ్డి వివిధ శాఖల ఉన్నతాధికారులు వివిధ హోదాలో ఉన్న ప్రజాప్రతినిధులుపాల్గొన్నారు.

## జూన్ నాటికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ ప్రారంభానికి సిద్ధం చేయాలి

- పొన్నెకల్ యంగ్ ఇండియా స్కూల్‌పై మంత్రి పొంగులేటి దిశానిర్దేశం
- రూ.200 కోట్లతో నిర్మాణం.. పనుల పురోగతిపై క్షేత్రస్థాయి సమీక్ష

**ఖమ్మం రూరల్, అక్టోబర్ 11 (జనం సాక్షి) :** ఖమ్మం రూరల్ మండలం లోని పొన్నెకల్లు గ్రామం పంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి సిద్ధం చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. రూ.200 కోట్లతో చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక నిర్మాణాన్ని వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. ఆదివారం కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి.. పనుల పురోగతిని సమీక్షించి, నిర్ణీత గడువులోగా నిర్మాణం పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

### గడువులోగా పూర్తి చేయాలి



పాఠశాల ప్రాంగణమంతా కలియతిరుగుతూ వివిధ విభాగాల నిర్మాణ పురోగతిని మంత్రి సమీక్షించారు. భవన నిర్మాణ పనుల ప్రస్తుత పరిస్థితిని అధికారులు మ్యాప్‌ల ద్వారా వివరించారు. పనుల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి.. మిగిలిన పనులను వేగవంతం చేయాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా నిర్మాణం పూర్తయ్యేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉండేలా ముందస్తు ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు.

### పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య

పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోందని మంత్రి తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన వసతి, ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పించడమే ఈ పాఠశాలల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్ణీత సమయంలో పాఠశాలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్ పర్సన్ తమ్మినేని నవీన్,ఖమ్మం రూరల్ తహసీల్దార్ వినయేందర్ రెడ్డి, కాంగ్రెస్ రూరల్ మండల అధ్యక్షుడు తోట వీరభద్రం,ఎదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ కిషోర్ నాయక్, కౌన్సిలర్లు, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## దమ్మపేట - మందలపల్లి మార్గంలో చీకట్లు..!

- సెంట్రల్ లైటింగ్ ఉన్నా వెలగని దీపాలు..
- ప్రజలకు తప్పని ఇబ్బందులు..!



**దమ్మపేట, అక్టోబర్ 11 (జనం సాక్షి) :** దమ్మపేట నుంచి మందలపల్లి సెంటర్ వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ఉన్నప్పటికీ,లైట్లు వెలగకపోవడంతో రహదారి రాత్రివేళ చీకటిమయంగా మారుతోంది.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన లైటింగ్ వ్యవస్థ ఉన్నా ప్రయోజనం లేకుండా పోతోందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు,ద్విచక్ర వాహనదారులు చీకటితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై వెలుతురు లేకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారిపై లైటింగ్ వ్యవస్థ పనిచేయకపోవడంపై సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

### అలంకారానికేనా సెంట్రల్ లైటింగ్..?

రహదారికి అందం తీసుకురావడంతో పాటు రాత్రివేళల్లో ప్రజలకు భద్రత కల్పించాల్సిన లైట్లు వెలగకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినప్పుడు ఉన్న శ్రద్ధ నిర్వహణలోనూ కనిపించాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి.. లైట్లు వెలిగించాలి!

దమ్మపేట--మందలపల్లి మార్గంలోని సెంట్రల్ లైటింగ్ సమస్యను సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి, పనిచేయని లైట్లకు మరమ్మతులు చేపట్టి పూర్తిస్థాయిలో వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా రహదారిపై తగిన వెలుతురు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## సెక్యూరిటీ పోస్టులో మహిళల విధులు భేష్

- సింగరేణి డైరెక్టర్(పి.పి) కే వెంకటేశ్వర్లు



**టేకులపల్లి, అక్టోబర్ 11 (జనంసాక్షి) :** సింగరేణి సంస్థలో సెక్యూరిటీ విభాగానికి చెందిన చెక్ పోస్ట్ లో విధులు నిర్వహిస్తున్న మహిళా సిబ్బంది విధుల నిర్వహణ భేష్ అని, వారి పనితీరును సంతృప్తి వ్యక్తి పరిచిన సింగరేణి సంస్థ డైరెక్టర్ (పి.పి.) కె. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం ఇల్లందు ఏరియాలోని కోయగూడెం ఓపెన్ కాస్ట్ ప్రాంతాన్ని సందర్శించారు. ముందుగా ఏరియా సెక్యూరిటీ విభాగానికి చెందిన చెక్ పోస్ట్ ను సందర్శించి, అక్కడ విధులు నిర్వహిస్తున్న మహిళా జనరల్ అసిస్టెంట్ల పనితీరును పరిశీలించారు.ఈ సందర్భం గా చెక్ పోస్ట్ లో లారీల రాకపోకలకు సంబంధించిన వివరాల నమోదు, డ్రైవర్ పేరు, డ్రైవింగ్ లైసెన్స్ వివరాలు, లారీ నంబర్ల నమోదు, కంప్యూటర్ సిస్టమ్‌లో వివరాలను నమోదు చేసే విధానం గురించి మహిళా సిబ్బందిని అడిగి తెలుసుకు న్నారు. అలాగే బ్రీత్ అనలైజర్ ద్వారా డ్రైవర్లను పరీక్షించిన అనంతరమే లారీలను లోపలికి అనుమ తిస్తున్న విధానాన్ని పరిశీలించారు. లోడ్‌తో వచ్చే లారీల బొగ్గు పరిమాణం, బరువు తదితర వివరా లను క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపిస్తున్న విధానాన్ని కూడా సమీక్షించారు.మహిళా సిబ్బంది అప్రమత్తం గా, సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న తీరుపై డైరెక్టర్ (పి.పి) సంతృప్తి వ్యక్తం చేసి వారిని అభినం దించారు. సింగరేణి సెక్యూరిటీ విభాగంలో కీలకమై న ప్రదేశాల్లో మహిళా సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. మహిళలకు మరిన్ని బాధ్యతలు అప్పగించే దిశగా చర్యలు తీసుకోవాలని ఇల్లందు ఏరియా జనరల్ మేనేజర్ వి. కృష్ణయ్యకు సూచిం చారు. సర్వే విభాగాల్లో ఖాళీలు ఉన్నట్లయితే మహిళా సిబ్బందికి కూడా అవకాశాలు కల్పించి, పురుషులతో సమానంగా బాధ్యతలు నిర్వహించేలా చూడాలని తెలిపారు.అనంతరం కోయగూడెం ప్రాంతంలోని కోయగూడెం పిట్-3 ప్రదేశాన్ని సందర్శించి, టెండర్ ప్రక్రియకు వాటికీ సంబంధించి న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్ర మంలో కే.ఓ.సి.పి.ఓ మాధవరావు, సర్వే అధికారి రామమూర్తి, కే.ఓ.సి. మేనేజర్ శ్రీనివాస్,ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలవరం తెలంగాణకు శాపం

- ప్రముఖ పాత్రికేయులు పాశం యాదగిరి




**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 11 (జనం సాక్షి) :** పోలవరం వల్ల ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలు మునిగాయని లక్ష మంది ఆదివాసులు నిర్వాసితులయ్యారని ప్రముఖ జర్నలిస్ట్ పాశం యాదగిరి అన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో తెలంగాణ అధ్యయన సమాలోచన కేంద్రం (టాస్క్) జిల్లా ఆవిర్భావ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ నిజాం నవాబు రాముడికి గుడి కడితే జైశ్రీరామ్ అనేవాళ్లు రామున్ని ముంచుతున్నారని ఇది ఎంత మాత్రం సహించరానిదని తంగేడు పూలతో చెరువు శుద్ధి అవుతుందని మన ఆడబిడ్డలు ఎన్నో ఏళ్ల క్రితం కనిపెట్టారని అందుకే బతుకమ్మ పండుగ లో తంగేడు పూలతో బతుకమ్మను పేర్చి చెరువులో నిమజ్జనం చేస్తారని ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పూలను పూజించటం తెలంగాణ ప్రత్యేకత అని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు కూడా అమలు కాని పరిస్థితి దేశంలో ఏర్పడిందని పారిశ్రామికీకరణ పేరుతో ఫార్మసీ కంపెనీలను నెలకొల్పడం వల్ల అడవులు కనుమరుగై చెంచుల జాతి అంతరించిపోతుందని ఆయన అన్నారు. టాస్క్ ఎప్పటికప్పుడు సమాజాన్ని తట్టి లేపాల్సిన బాధ్యత ఉందని నిజాలను నిర్భయంగా ప్రకటిస్తూ చైతన్య పరచాలని ఆయన సూచించారు. టాస్క్ రాష్ట్ర అధ్యక్షులు ఎర్రోజు శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ పేరుతో ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలుగుతుందని ఫామ్ 7 తో ఎవరి ఓటు అయినా తొలగించవచ్చని నిష్పక్షపాతంగా నడవవలసిన ఎలక్షన్ కమిషన్ కీలుబొమ్మగా మారకూడదని ఆయన అన్నారు.ఈ సమావేశానికి టాస్క్ రాష్ట్ర కో కన్వీనర్ ములక సురేష్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పులి రాజు డాక్టర్ ఆంజనేయులు షేక్ నజీమా బుక్కా సత్యనారాయణ సంగమేశ్వర రావు దశరథ రామ్ ఎన్ఎస్ దశరథ రామ్ రఘు విశ్వ మేకల సుగుణ రావు కట్టుకోజ్వాల రమేష్ రేలా శ్రీనివాస్ కళాకారులు పాగి వెంకన్న గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవీరాంజనేయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- 14, 15 తేదీల్లో మహా సంబురం!
- ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, శిఖర స్థాపనతో పాటు స్వామివారి సంప్రోక్షణ మహోత్సవం

**పెద్దేముల్, అక్టోబర్ 11 (జనంసాక్షి) :** ఆధ్యాత్మిక సందడి.. వేద మంత్రాల ప్రతిధ్వని.. మంగళ వాయిద్యాల నడుమ భక్తి పారవశ్యం.. స్వామివారి నామస్మరణతో పెద్దేముల్ మండల కేంద్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనుంది. శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించనున్న సంప్రోక్షణ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, శిఖర స్థాపన మహోత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల 14, 15 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ వేడుకలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని పంచనున్నాయి.ఆలయ పవిత్రతను చాటుతూ నిర్వహించే వైదిక క్రతువులు, ప్రత్యేక పూజలు, హోమాలు, సీతారాముల కల్యాణోత్సవం, మహా అన్నదానం ఈ మహోత్సవాల్లో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ఆలయ నిర్వాహకులు, గ్రామ సర్పంచ్ డి.వై. నర్సింహులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు.తొలి రోజు 14వ తేదీ బుధవారం ఉదయం 7.30 గంటలకు స్వస్తివాచనంతో మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అనంతరం గణపతి పూజ, గోపూజ, పుణ్యాహవాచనం, ఋత్విగ్వరణం, రక్షాబంధనం, అఖండ దీపారాధన, మాతృకా పూజ, నాందీ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం



అంకురారోపణం, సర్వతోభద్ర మండల దేవతా స్థాపన, వాస్తు పీఠస్థాపన, నవగ్రహ మండల దేవతా స్థాపన, యోగిని పీఠస్థాపన, మండప సంస్కారం వంటి విశిష్ట వైదిక క్రతువులు జరగనున్నాయి. ప్రతిమా శోధనం, ప్రాసాద సంస్కారం, జలాధివాసం, ధాన్యాధివాసం, మూలమంత్ర హోమం, శయ్యాధివాసం తదితర కార్యక్రమాలతో తొలిరోజు ఆధ్యాత్మిక వాతావరణం నెలకొననుంది.రెండోవ రోజు ధ్వజస్తంభ, ప్రతిష్టాపన కార్యక్రమం గురువారం ఉదయం 7 గంటలకు ఆవాహిత స్థాపిత దేవతా పూజ, మూలమంత్ర హోమం,గర్త సంస్కారం,యంత్ర స్థాపన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం మూలమూర్తి సంప్రోక్షణ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, శిఖర ప్రతిష్ఠాపన, పూర్ణాహుతి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరగనున్నాయి. తదుపరి శ్రీ వీరాంజనేయ స్వామివారికి పంచామృత అభిషేకం, సింధూర సమర్పణ, విశేష అలంకరణ నిర్వహించనున్నారు. స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేపడుతున్నారు. రెండు రోజుల పాటు జరిగే పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు. అనంతరం సీతారాముల కల్యాణోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలిరానున్నారు.ఈకల్యాణోత్సవం అనంతరం భక్తుల కోసం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నారు.భక్తుల భాగస్వామ్యంతో ఈ రెండు రోజుల వేడుకలను విజయవంతంగానిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు కృషి చేస్తున్నారు.ఈ మహోత్సవాలకు తెలంగాణ శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గౌరవ అతిథులుగా డీసీసీ అధ్యక్షుడు జాదవ్ ధారాసింగ్, ఎస్. నరేందర్‌రెడ్డి దొర, ధ్వజస్తంభ దాత కోహిర్ రాజు, చిట్టెపు రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డి.వై. నర్సింహులు, ఉప సర్పంచ్ డివై ప్రసాద్,గ్రామ పెద్దలు,గ్రామ ప్రజలు మాట్లాడుతూ.. శ్రీ వీరాంజనేయ స్వామివారి ఆశీస్సులు పొందేందుకు భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి, రెండు రోజుల పాటు జరిగే పవిత్ర మహోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## విద్యుత్ కోతలతో రైతాంగం ఆగమాగం

- పంటలు ఎండిపోతున్నా పట్టించుకోవడం లేదు
- ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తి చూపిన ఎమ్మెల్యే సునితా రెడ్డి



**హత్నూర, అక్టోబర్ 11 (జనం సాక్షి) :** విద్యుత్ కోతల కారణంగా పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వంలో ఏమాత్రం చలనం కనిపించడం లేదని ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డి ఆరోపించారు. మండలంలోని భీంలా తాండా,దేవుని గుట్ట తండా శివారులో గల వ్యవసాయ పొలాల్లో ఆదివారం క్షేత్ర స్థాయిలో పర్యటించి విద్యుత్తు కోతలతో సాగునీరందక ఎండిపోయిన పంటలను వారు పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.సాగు విస్తీర్ణం,పెట్టుబడి వ్యయం,విద్యుత్ సరఫరా తదితర వివరాలపై రైతులతో మాట్లాడారు.విద్యుత్ కోతలతో చేతికొచ్చిన పంట ఎండుముఖం పడుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆమె దుయ్యబట్టారు. కరెంటు సమస్యను నిరసిస్తూ రైతులు విభిన్న పద్ధతుల్లో ధర్నాలు,నిరసనలు,ఆందోళనలు వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా అనిపించడం లేదని ఆమె విమర్శించారు.రైతులు సాగు చేసిన పంటలను కాపాడాల్సిన ప్రభుత్వం అదేమీ పట్టనట్టు బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని ఆమె ధ్వజమెత్తారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిరంతరాయంగా విద్యుత్ ను సరఫరా చేయడంతో పాటు ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# బ్రిడ్జి నిర్మాణంలో జాప్యం..

- వాహనదారులకు తప్పని తిప్పలు
- డైవర్షన్ బోర్డులు లేక ప్రమాదాల ముప్పు
- త్వరగా పనులు పూర్తి చేయాలని ప్రజల విజ్ఞప్తి ..!

**హుజూర్‌నగర్ రూరల్, అక్టోబర్ 11 (జనంసాక్షి) :** హుజూర్‌నగర్ మండల పరిధిలోగల వేపల సింగారం గ్రామానికి వెళ్లే మార్గంలో చేపడుతున్న నూతన బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా భారీ వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో పాటు, ప్రత్యామ్నాయ మార్గాలకు సంబంధించి డైవర్షన్ బోర్డులు ఏర్పాటు చేయకపోవడం ప్రమాదాలకు దారితీస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### డైవర్షన్ బోర్డులు లేక ప్రమాదాలు

ఈ మార్గంలో కొత్తగా ప్రయాణించే వాహనదారులకు దారి మళ్లింపు వివరాలు తెలియకపోవడంతో గందరగోళానికి గురవుతున్నారు. సరైన సూచిక బోర్డులు లేకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. రెండు రోజుల క్రితం ఇదే మార్గంలో ఓ బొలెరో వాహనం బోల్తా పడిన ఘటనను స్థానికులు గుర్తు చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### రైతులకు తప్పని ఇబ్బందులు..!

మరోవైపు, బ్రిడ్జి నిర్మాణ పనుల నేపథ్యంలో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడటంతో రైతులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. నిర్మాణ పనులు ఆలస్యం కావడం వల్ల నీటి సరఫరాపై ప్రభావం పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులను త్వరగా పూర్తి చేయకపోతే వాహనదారులతో పాటు రైతులు మరిన్ని సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు.

### ఉన్నతాధికారులు స్పందించాలి...!

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ప్రమాదాల నివారణకు తక్షణమే డైవర్షన్ బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. వాహనదారులకు స్పష్టమైన మార్గదర్శకాలు అందించడంతో పాటు, నూతన బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.







గుండ్లపల్లి – గన్నేరువరం – పొత్తూరు డబుల్ రోడ్డు ఎక్కడ?

# అటకెక్కిన డబుల్ రోడ్డు హామీ

- నిలదీస్తున్న మహిళా లోకం
- బతుకమ్మ పాటతో రోడ్ల దుస్థితిపై మహిళల వినూత్న నిరసన!

**గన్నేరువరం, అక్టోబర్ 11 (జనంసాక్షి):** గుండ్లపల్లి నుండి గన్నేరువరం మీదుగా పొత్తూరు వరకు డబుల్ రోడ్డు నిర్మాణం హామీలు ఏండ్లు గడుస్తున్నా నెరవేరకపోవడంతో మండల ప్రజలు, ముఖ్యంగా మహిళల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. రోడ్ల దుస్థితిపై మహిళలు వినూత్న రీతిలో నిరసనకు దిగారు.

**గుంతల రోడ్లు, కంకర తేలి... ప్రాణాలు గుప్పెట్లో!**

ప్రస్తుతం గుండ్లపల్లి – గన్నేరువరం – పొత్తూరు రహదారి పూర్తిగా అధ్వాన్నంగా మారింది. రోడ్డు నిండా పెద్ద పెద్ద గుంతలు, కంకర తేలిపోవడంతో రోజూ ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. వాహనాలు వెళ్తుంటే లేస్తున్న దుమ్ముతో చుట్టుపక్కల ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

**బతుకమ్మ పాటతో నిరసన**

ఎన్నిసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో స్థానిక మహిళలు సాంప్రదాయ బతుకమ్మ పాటను ఆయుధంగా మలిచారు. "హామీ ఇచ్చి మరిచిన నాయకులు.. గుంతల రోడ్డుతో పడుతున్న తిప్పలు" అంటూ బతుకమ్మ ఆడుతూ, పాడుతూ తమ ఆవేదనను వెళ్లగక్కుతున్నారు. మహిళలు పాడుతున్న ఈ పాట ప్రస్తుతం గన్నేరువరం మండలంలోని ప్రతి గ్రామం, వాడవాడలా మార్మోగుతూ అందరినీ ఆలోచింపజేస్తోంది. సోషల్ మీడియాలో సైతం ఈ పాట వీడియో వైరల్ గా మారింది.

**తక్షణమే స్పందించాలని డిమాండ్:**

ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గుండ్లపల్లి – గన్నేరువరం – పొత్తూరు డబుల్ రోడ్డు నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించి, తమ రవాణా కష్టాలను తీర్చాలని మహిళలు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# సిరిసిల్ల ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు

**సిరిసిల్ల టౌన్ అక్టోబర్ 11 (జనంసాక్షి):** సిరిసిల్ల జిల్లా ఆవిర్భావం కోసం సిరిసిల్ల పట్టణంలోని పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఐక్య పోరాటం చేశారని బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు పేర్కొన్నారు. సిరిసిల్లలో జిల్లా ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను బి.ఆర్.ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం సిరిసిల్లలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కొత్త బస్టాండ్ సమీపంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు సమర్పించిన అనంతరం కెసిఆర్, కేటీఆర్ ల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తదనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి బెలూన్ ఎగరవేశారు. బి ఆర్ ఎస్ నాయకులు మాజీ ఎం,పీ బోయినపల్లి వినోద్ కుమార్ మాజీ జడ్పీ చైర్మన్ తుల ఉమా, మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, వేములవాడ ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, బి,ఆర్,ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్యలు మాట్లాడుతూ జిల్లా ఏర్పాటుతో మండలాలు గ్రామాలు తండాల ప్రజలకు మేలు జరిగిందని, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అందాలంటే చిన్న జిల్లాలు ఉండాలని చిన్న జిల్లాలతో పాలన ప్రజలకు మరింత చేరువై ప్రభుత్వ పథకాలు అర్హులకు సులభంగా అందే అవకాశం ఉందన్నారు. ఆనాడు జిల్లా ఏర్పాటుకు ఉద్యమం చేయడం జరిగిందన్నారు. జిల్లా ఏర్పాటుతో వైద్య సేవలు మెరుగుపడ్డాయని జడ్పీ చైర్పర్సన్ తుల ఉమా అన్నారు.




**జిల్లా ఏర్పాటుతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు.**

జిల్లా ఏర్పాటుతో ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని బి.ఆర్.ఎస్ పార్టీ వేములవాడ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. జిల్లా అయిన తర్వాత ఇబ్బందులు తొలగాయని పేర్కొన్నారు.

**జిల్లా ఉద్యమకారులకు ఘన సన్మానం.**

రాజన్న సిరిసిల్ల జిల్లాగా ఏర్పాటుకు, పోరాటాలు చేసిన ఉద్యమకారులను ఘనంగా సన్మానించారు. జిల్లా సాధన కోసం ఉద్యమకారులు చేసిన పోరాటాలు, త్యాగాలను స్మరించుకున్నారు. ప్రత్యేక జిల్లా ఏర్పాటులో వారి పాత్రను గుర్తిస్తూ సేవలను భావితరాలకు తెలియజేయడమే లక్ష్యంగా ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు.

**ప్రజల వద్దకే పాలన.**

సిరిసిల్ల జిల్లా ఏర్పడక ముందు కలెక్టర్ లేదా ఎస్పీని ఇతర అధికారులను కలవాలంటే ఒకరోజు ముందే కరీంనగర్ వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ అన్నారు జిల్లా ఏర్పాటు అయిన తర్వాత అధికారులను నిమిషాల వ్యవధిలోనే కలిసే అవకాశం ఏర్పడిందన్నారు ఇది కేసీఆర్ గొప్పతనం అని పేర్కొన్నారు కేసీఆర్ హయంలో తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు.

దశాబ్ది వేడుకల్లో బతుకమ్మ ఆటపాటల సందడి.

రాజన్న సిరిసిల్ల జిల్లా ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మ ఆటపాటలతో మహిళలు సందడి చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి, మహిళా కౌన్సిలర్లు, నాయకురాలు బతుకమ్మ ఆటలు ఆడుతూ పాడుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బి,ఆర్,ఎస్ నాయకులు జిందం చక్రపాణి, గూడూరి ప్రవీణ్, కుంబాల మల్లారెడ్డి, దార్ల సందీప్ గజ బింకర్ రాజన్న, బి ఆర్ ఎస్ పార్టీ అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భూమిని తాకనున్న శక్తిమంతమైన సౌర తుపాను



**వాషింగ్టన్(జనంసాక్షి):** సూర్యుడిలో సంభవించిన రెండు భారీ విస్ఫోటాల కారణంగా ఆదివారం భూమిని శక్తిమంతమైన సౌర తుపాను తాకనుంది. దీనివల్ల భూకక్ష్యలోని కొన్ని ఉపగ్రహాలు, రేడియో కమ్యూనికేషన్లు, నేవిగేషన్ వ్యవస్థలపై ప్రభావం పడొచ్చు. సూర్యుడిలో కరోనల్ మాస్ ఎజెక్షన్ వంటి చర్యల వల్ల భారీగా శక్తి, పదార్థాలు వెలువడటాన్ని సౌర తుపానుగా పేర్కొంటారు. ఈ క్రమంలో భారీగా వెలువడే రేణువులు, అయస్కాంత పదార్థాలు భూమిని తాకినప్పుడు ఇక్కడి అయస్కాంత క్షేత్రం గందరగోళానికి గురవుతుంది. ఫలితంగా భూఅయస్కాంత తుపాను తలెత్తవచ్చు. ఈ పరిణామ తీవ్రతను జీ1 (తక్కువ స్థాయి) నుంచి జీ5 (ఎక్కువ స్థాయి) వరకూ వర్గీకరిస్తారు. ఇటీవల సూర్యుడిపై రెండు భారీ సౌర తుపాన్లు చోటుచేసుకున్నాయి. ఫలితంగా ఈ నెల 7, 8 తేదీల్లో రెండు సౌర జ్వాలలు భానుడి నుంచి దూసుకొచ్చాయి. వీటిలో రెండోది వేగంగా సాగుతోంది. భూమిని తాకేలోగా అది మొదటి జ్వాలతో విలీనమవుతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఇది ఆదివారం భూమిని తాకొచ్చని, ఫలితంగా జీ2 (ఒక మోస్తరు స్థాయి) భూఅయస్కాంత తుపాను రావొచ్చని అమెరికా వాతావరణ సంస్థ (నోవా) పేర్కొంది. ఎగువ అక్షాంశ ప్రాంతాల్లో ప్రభావం ఎక్కువగా కనిపించొచ్చు. అక్కడ విద్యుత్ వ్యవస్థల్లో వోల్టేజీ సంబంధ హెచ్చుతగ్గులు ఉత్పన్నం కావొచ్చు.తాజా సౌర తుపానుకు అనుగుణంగా ఉపగ్రహ సంస్థలు.. తమ శాటిలైట్లను సర్దుబాటు చేసుకోవాలి. కొన్నిచోట్ల రేడియో సంకేతాలు బలహీనపడొచ్చు. జీపీఎస్ వంటి ఉపగ్రహ ఆధారిత నేవిగేషన్ వ్యవస్థల కచ్చితత్వంలో తేడాలు రావొచ్చు. సూర్యుడి నుంచి వచ్చే ఆవేశిత రేణువులు భూఎగువ వాతావరణంలోని వాయువులతో చర్య జరిపినప్పుడు ఆకాశంలో రంగురంగుల అరోరాలు ఏర్పడుతుంటాయి. సాధారణంగా ఇవి ధ్రువ ప్రాంతాల్లోనే కనిపిస్తుంటాయి. ఇప్పుడు ఇతర ప్రదేశాలకూ విస్తరించొచ్చు. తాజా సౌర తుపాను వల్ల భారత్‌లో భారీగా విద్యుత్ సరఫరాలో అవరోధాలు, అరోరాలు తలెత్తకపోవచ్చు.

# అప్పుల ఊబిలో అమెరికన్లు..

### రుణ వాయిదాలు చెల్లించలేక సతమతం!

**వాషింగ్టన్(జనంసాక్షి):** అగ్రరాజ్యంలో సామాన్య కుటుంబాల ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారుతోంది. పెరిగిన ద్రవ్యోల్బణం, అప్పుల భారం సామాన్యుల నడ్డి విరుస్తోంది. గత మూడేళ్లలో ప్రజల రుణ వాయిదాలు చెల్లించే సామర్థ్యం దారుణంగా పడిపోయిందని ఆ దేశ కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ సంచలన నివేదిక విడుదల చేసింది. 2022-2025 మధ్య కాలంలో అమెరికన్ కుటుంబాల ఆర్థికస్థితి గతులపై సర్వే నిర్వహించగా.. రుణాలు, రుణ వాయిదాలు చెల్లించలేక డి ఫాల్ట్ అవుతున్న కుటుంబాల సంఖ్య భారీగా పెరిగింది. 2022లో లోన్ రీ పేమెంట్లు చెల్లించని కుటుంబాలు 12% ఉండగా.. 2025 నాటికి ఆ సంఖ్య ఏకంగా 20% చేరింది. 8 % పైగా కుటుంబాలు రెండు నెలలు లేదా అంతకంటే ఎక్కువ కాలంగా ఈఎంఐలు చెల్లించలేకపోయాయి. 2010 ఆర్థిక సంక్షోభం తర్వాత అమెరికన్లు ఈ స్థాయిలో అప్పుల్లో కూరుకుపోవడం ఇదే తొలిసారని ఈ సర్వే తేల్చి చెప్పింది. ఈ వార్త చదివారా: ఉక్రెయిన్‌కు కొత్త అధ్యక్షుడు అవసరం

# ఉక్రెయిన్‌కు కొత్త అధ్యక్షుడు అవసరం

### రష్యాతో యుద్ధం ముగించడం జెలెన్‌స్కీ వల్ల కాలేదు

### రెండు రోజుల్లో మరో షాకిచ్చిన ట్రంప్

**వాషింగ్టన్(జనంసాక్షి):** రష్యాతో డీజిల్ సరఫరా ఒప్పందం కుదుర్చుకుని ఉక్రెయిన్‌కు ఝలక్ ఇచ్చిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆ మరుసటి రోజే మరో షాకిచ్చారు. ఉక్రెయిన్ అధ్యక్షుడిగా జెలెన్‌స్కీ ఇక ఎంత మాత్రం పనికిరారని, కొత్త వ్యక్తిని ఆ పదవికి ఎన్నుకోవడం ఉత్తమమని శనివారం వైట్‌హౌస్‌లో మాట్లాడుతూ ట్రంప్ పేర్కొన్నారు. రష్యాతో యుద్ధాన్ని ముగించడం ప్రస్తుత ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చేయలేకపోయారని ఆక్షేపించారు. అంతటితో ట్రంప్ ఆగలేదు. అసలు రష్యా, ఉక్రెయిన్ యుద్ధానికి సరైన కారణమే లేదన్నారు. '2022లో అమెరికా అధ్యక్షుడిగా నేను ఉన్నట్లయితే ఆ యుద్ధం ప్రారంభమయ్యేదే కాదు' అని తెలిపారు. 'జెలెన్‌స్కీ వల్ల ఉక్రెయిన్ 30శాతం భూభాగాన్ని కోల్పోయింది. 20లక్షల మందికిపైగా ప్రజలు చనిపోయారు. మరో పది లక్షల మంది చెల్లాచెదురయ్యారు. కొత్త అధ్యక్షుడిని పొందటానికి ఉక్రెయిన్‌కు ఇదే సరైన తరుణం' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. అమెరికాలో డీజిల్ ధరలు పెరగడానికి జెలెన్‌స్కీ కారణమంటూ ఆక్షేపించారు.

రష్యాపై ఆంక్షలను ఎత్తేసిన అమెరికా

రష్యాతో డీల్‌పై ట్రంప్ ప్రకటన చేసిన కొద్ది నిమిషాల్లోనే ఆ దేశంపై ఆంక్షలను ఎత్తివేస్తూ అమెరికా ఆర్థిక శాఖ నిర్ణయం తీసుకుంది. దీంతో వచ్చే ఏడాది ఏప్రిల్ 7వ తేదీ వరకూ ప్రపంచానికి డీజిల్‌ను సరఫరా చేయడానికి రష్యాకు మార్గం సుగమమైంది. రష్యా తొలుత 3 లక్షల టన్నుల డీజిల్‌ను సరఫరా చేస్తుందని, నవంబరులో మరో 5 లక్షల టన్నులను అందిస్తుందని, ఆ తర్వాత వెంటనే 10 లక్షల టన్నులను సరఫరా చేస్తుందని, రిఫైనరీల సామర్థ్యాన్ని బట్టి రష్యా మొత్తంగా 30లక్షల టన్నుల డీజిల్‌ను పంపిణీ చేస్తుందని ట్రంప్ ప్రకటించారు.

# సింగరేణిని కాపాడుకునేందుకే బీఆర్ఎస్ పోరు

- ఆనాడు కేసీఆర్ గ్లోబల్ సంస్థగా మార్చాలని చూస్తే.. ఈనాడు జేబు సంస్థగా మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలకులు..!
- సంస్థ రాష్ట్ర వాటాలో 10 శాతం అమ్మాలనే ఆలోచన చేస్తుండ్లు
- కార్మికుల ప్రయోజనాల కోసం సింగరేణి కార్మిక గర్జన : బాల్క సుమన్

**మంథని, అక్టోబర్ 11, (జనంసాక్షి) :** మన ప్రాంతాన్ని, మన సంస్థను కాపాడుకోవాలన్నదే బీఆర్ఎస్ ఆలోచన అని, అందుకోసమే పోరాటం చేస్తున్నామని మాజీ ఎంపీ, మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. ఆదివారం మంథని పట్టనంలోని రాజగృహ లో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంస్తను బడేబాయ్ నరేంద్ర మోడీ చోటే బాయ్ రేవంత్‌రెడ్డి మిడిల్‌బాయ్ కిషన్‌రెడ్డి ముగ్గురు కలిసి సింగరేణిని నిర్వీర్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈనాడు తెరవెనుక చర్చలు జరుపుతూ సంస్థ 51 శాతం రాష్ట్ర వాటాలో 10 నుంచి15 శాతం అమ్ముదామా అనే ఆలోచన చేస్తున్నారని అన్నారు. రెండేళ్ల కాలంలోనే సింగరేణి సంస్థను నాశనం చేశారని ఆయన వాపోయారు. గతంలో కేసీఆర్ సింగరేణి సంస్థను మరింత విస్తరింప జేయాలనే గొప్ప ఆలోచనతో సీఎండీని అనేక దేశాలు పంపించారని, దేశంలోని ఇతర రాష్ట్రాలకు విస్తరించాలనే గొప్ప ఆలోచన చేశారన్నారు. సంస్థను గ్లోబల్ ఆర్గనైజేషన్ చేయాలని చూస్తే ఈనాడు కాంగ్రెస్ ప్రభుత్వం జేబు సంస్థగా మార్చుకున్నారని, ఇందులో అందరూ వాటాదారులేని, ముఖ్యమంత్రితో సహా మంత్రులు శ్రీధర్‌బాబు,, అడ్లూరి లక్ష్మన్, వివేక్‌లకు వాటా ఉన్నయి కనుకనే మాట్లాడటం లేదని ఆరోపించారు . ఈ ప్రాంత ఓట్లతో గెలిచిన వారు ఎందుకు మాట్లాడుతలేరో అర్థం చేసుకోవాలన్నారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడటం కోసమే బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని, ఇందులో బాగంగా ఈనెల 14న రామగుండం లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సభ పెట్టినట్లు తెలిపారు. ఈ సభ ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసకువచ్చి కార్మికులకు మేలు చేయాలన్నదే లక్ష్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు మెడికల్ బోర్డు పెట్టలేదని, ఎవరైనా వెళ్తే వెనక్కి పంపిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 76జీఓ కింద 30వేల కుటుంబాలకు జాగలు ఇచ్చామని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వంలో జీఓ ద్వారా ఒక్కరికి పట్టా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో కార్మికుల ఓట్ల కోసం అనేక హమీలు ఇచ్చారని, అందులో ఒక్కటి అమలు చేయకుండా కార్మిక లోకాన్ని మోసం చేశారన్నారు. అంతేకాకుండా సింగరేణి సంస్థ లాబాల్లో గణనీయంగా వాటాలు ఇచ్చిన చరిత్ర కేసీఆర్‌దేనని, కానీ ఈనాడు లాబాల్లో వాటా చూపిస్తూ కోత విధిస్తున్నారని అన్నారు. కార్మికుల సంక్షేమాన్ని విస్మరించారన్నారు. ఈ క్రమంలో రామగుండంలో నిర్వహించే సింగరేణి కార్మిక గర్జనకు భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



# వ్యాపార విజయంతో పాటు మానసిక ప్రశాంతత ముఖ్యం

**కరీంనగర్ కల్చరల్ (జనంసాక్షి):** కరీంనగర్‌లో 'సమతుల్యమైన వ్యాపారం సంతృప్తికరమైన జీవితం' కార్యక్రమాన్ని నిర్వహించారు. కిసాన్‌నగర్‌లోని మైత్రి కన్వెన్షన్‌లో బ్రహ్మకుమారీస్, జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్స్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజయోగిని బ్రహ్మకుమారి దీప దీదీజీ వ్యాపారాభివృద్ధితో పాటు జీవితంలో సమతుల్యత, మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక విలువల ప్రాధాన్యతను వివరించారు. ఛాంబర్ అధ్యక్షుడు చిట్టిమల్లు శ్రీనివాస్, విజయలక్ష్మి సిస్టర్, మనీషా సిస్టర్ పాల్గొన్నారు.



# నైపుణ్యంతో కొలువుల బాట..

- సింగరేణి ఆర్జీ-1 నైపుణ్య శిక్షణ కేంద్రం నుంచి 112 మంది ఉద్యోగాలకు ఎంపిక..
- ఫాక్స్కాన్లో 87 మంది మహిళలకు అవకాశం..
- తొలి విడతలో బయలుదేరిన 55 మంది మహిళలు



**గోదావరిఖని,జనంసాక్షి:** సింగరేణి ప్రభావిత ప్రాంతాల నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ప్రజా ప్రభుత్వ సంకల్పం సత్ఫలితాలనిస్తోంది. రామగుండం?1 ఏరియాలోని సింగరేణి జీవీటీసీ నైపుణ్యాభివృద్ధి కేంద్రం ద్వారా తాజాగా 154 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 127 మంది మహిళా అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా.. వీరిలో 87 మంది హైదరాబాద్లోని ఫాక్స్కాన్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపిక కాగా, మరో 27 మంది పురుష అభ్యర్థులు సోలార్ టెక్నిషియన్ ఇంటర్వ్యూలకు హాజరు కాగా.. వీరిలో 25 మంది సోలార్ టెక్నిషియన్లుగా ఉద్యోగాల్లో చేరనున్నారు. ఫాక్స్కాన్కు ఎంపికైన మహిళల్లో తొలి విడతగా 55 మంది ఆదివారం గోదావరిఖని నుంచి హైదరాబాద్కు బయలుదేరారు.శిక్షణ నుంచి ఉపాధి వరకు

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క రెండేళ్ల క్రితం ప్రారంభించిన ఈ కేంద్రం స్థానిక యువతకు నైపుణ్య శిక్షణతోపాటు ఉద్యోగ అవకాశాలను అందిస్తోంది. గత రెండేళ్లలో 500 మందికి పైగా ఉపాధి అవకాశాలు కల్పించింది. మార్కెట్ లో డిమాండ్ ఉన్న కోర్సుల్లో శిక్షణ ఇస్తూ ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటోంది. మహిళలకు తయారీ రంగంలో అవకాశాలుఫాక్స్కాన్ కంపెనీ ఆధ్వర్యంలో గత వారం జీవీటీసీ నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో మహిళా అభ్యర్థులకు ప్రత్యేక ఉద్యోగ ఇంటర్వ్యూలు నిర్వహించారు. హైదరాబాద్లోని కంపెనీ తయారీ కేంద్రంలో ఆపిల్ ఇయర్బాడ్స్, ఎలక్ట్రానిక్ విడిభాగాల అసెంబ్లింగ్ విభాగాల్లో పనిచేసేందుకు 87 మంది మహిళలను ఎంపిక చేశారు. స్థానిక మహిళలకు పారిశ్రామిక రంగంలో లభించిన ఈ అవకాశాలు వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడనున్నాయి. సోలార్ టెక్నిషియన్ కోర్సులో శిక్షణ పొందిన 25 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆర్జీ?1 జీఎం డి. లలిత్ కుమార్ తెలిపారు. వీరు పది రోజుల్లో ఎల్ అండ్ ఎన్ కంపెనీలో ఉద్యోగాల్లో చేరనున్నట్లు పేర్కొన్నారు.

### నైపుణ్యాలతో భవిష్యత్తుకు పునాది

సింగరేణి ప్రభావిత ప్రాంతాల యువతకు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు సంస్థ కృషి చేస్తోందని జీఎం శ్రీ డి. లలిత్ కుమార్ అన్నారు. శిక్షణను ఉద్యోగ అవకాశాలతో అనుసంధానించడం ద్వారా యువత మెరుగైన భవిష్యత్తును నిర్మించుకునే అవకాశం లభిస్తోందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో పనిచేస్తూ వృత్తిలో ఎదగాలని సూచించారు.కార్యక్రమంలో ఎస్వో టు జీఎం ఎస్.కె. చంద్రశేఖర్, ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, టాస్క్ మేనేజర్ డాక్టర్ కౌసల్య, ఎల్ అండ్ ఎన్ డైరెక్టర్ కౌశల్, ఫాక్స్కాన్ హెచ్ఆర్ ప్రతినిధి ఆర్. శ్రీనివాస్, జీవీటీసీ మేనేజర్ మాధవరెడ్డి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శ్రవణ్ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అక్క బ్రతికుండగానే చనిపోయిందని భూమి రిజిస్ట్రేషన్

- గాంధారి మండలంలోని తహసిల్దార్
- కార్యాలయంలో వెలుగు చేసిన సంఘటన
- న్యాయం చేయాలంటూ తాహసిల్దార్, పోలీస్
- స్టేషన్‌ల చుట్టూ ప్రదక్షిణలు
- అధికార స్పందించి న్యాయం చేయాలని జవాన్ తల్లి ఆవేదన

**గాంధారి(జనంసాక్షి):** మానవత విలువలు రోజురోజుకు దిగజారుతున్నాయి ఎందుకంటే ఈ సంఘటన ఓ యదార్థ ఉదాహరణ. తన యొక్క అక్క బ్రతికుండగానే చనిపోయిందని ధ్రువీకరిస్తూ భూమిని తన పేరు మీద చేయించుకోవడంతో బ్రతికుండగానే తను చనిపోయిందని సృష్టించడం ఎంతవరకు సబబు అని జవాన్ తల్లి సావిత్రి జవాన్ గోపి తమ ఆవేదన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే గాంధారి మండల కేంద్రానికి చెందిన అస్కెల సావిత్రి తల్లిదండ్రులు అయినా బెస్త బాలవ బెస్త బాలయ్య లకు ఇద్దరు ఆడ పిల్లలు ఒక మగ సంతానం ఉండగా ఇందులో కార్యక్రమాన్ని తల్లిదండ్రులు బాలయ్య బాలయ్య మరణించగా అనంతరం మగసంతానమైన అన్న కూడా మరణించడంతో కేవలం సావిత్రి గంగమని ఇద్దరు సంతానంగా ఉండడంతో బలవ పేరు మీద ఉన్న 10 గుంటల భూమి తిమ్మాపూర్ లో దాదాపు 20 సంవత్సరాల కిందట విక్రయించడం జరిగింది. అయితే పట్టా పాస్ బుక్ బెస్త బాలవ పేరు మీద ఉండటంతో ఇది గమనించిన గంగమని మరియు తన భర్త నరసయ్య ఇరువురు కలిసి ఒకసారి తన దగ్గరికి వచ్చి ఎరువులు తీసుకునేది ఉందని పట్టా పాస్బుక్ ఇవ్వమని సావిత్రి దగ్గర నుండి కొత్త పాస్ బుక్ చేయిస్తాము ఎరువులు రావడం లేదని చెప్పి మాయమాటలు చెప్పి పాస్ బుక్కు తీసుకొని రావడం జరి గింది. అయితే మొత్తం భూమి తన చెల్లి గంగవని పేరిట చేయిం చుకుందాం అని తెలిసి మొత్తం ఒక న్యాయం చేయాలని సావిత్రి తాసిల్దారును, పోలీస్ స్టేషన్లో వినతి పత్రాలు అందజే యడం జరిగింది.



ఒకరి పేరిట రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారు

వారసత్వంగా తమ తల్లిదండ్రులైన బాలవ బాలయ్య నుండి వచ్చిన భూమిని తన చెల్లెలు బెస్తే గంగమని తన పేరుమీద చేయించుకోవడం ఎంతవరకు సమంజసం అని కనీసం తాసిల్దార్ కార్యాలయంలో నైన ఎలాంటి ధ్రువీకరణ జరపకుండా తప్పుడు సమాచారంతో బ్రతుకున తన తల్లిని మరణించినట్లు ధృవీకరించి కేవలం భూమి కోసం ఇంత నాటక మాడడం చాలా సిగ్గుచేటని జవాన్ గోపి తన ఆవేదన వ్యక్తం చేశారు.

తప్పు చేసిన అధికారులను విధులనుండి తొలగించాలి: జవాన్ గోపి తప్పు చేసిన అధికారులు ఎవరైనా సరే దొంగ సాక్షాలు సృష్టించి ఇలా ముగ్గురు సంతానంగా ఉంటే ఒకరు చనిపోగా ఇద్దరు సంతానంలో ఇందులో కూడా భూమి కోసం బ్రతికుండగానే ఒకరిని చనిపోయిందని ధ్రువీకరించడం ఈ ధ్రువీకరించిన అధికారులకు తప్పనిసరిగా ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు.అంతే కాకుండా ఈ విషయం పై తహసిల్దార్ కు, స్థానిక పోలీసులకు వినతి పత్రాలు అందజేయడం జరిగింది అని అన్నారు.

# యువత మత్తు పదార్థాలకు చెడు వ్యసనాలను దూరం ఉండాలి

- హుజురాబాద్ ఎసిపి మాధవి
- వీణవంకలో కార్డెన్ అండ్ సెర్చ్



వీణవంక అక్టోబర్ 11(జనంసాక్షి) : వీణవంక యువత మత్తు పదార్థాలకు చెడు వ్యసనాలను దూరం ఉండాలని హుజురాబాద్ ఎసిపి మాధవి అన్నారు.కరీంనగర్ సిపి గౌస్ ఆలం ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా వీణవంక మండల కేంద్రం తోపాటు మండలములోని కొండపాక గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ హుజురాబాద్ ఏసిపి మాధవి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఏసీపి మాధవి మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ సందేశాలు అనుమానస్పద లింకులు,ఆన్లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. వీణవంక లో సరైన వాహన పత్రాలు లేని 22బైకులు,13 ట్రాలీ ఆటోలను గుర్తించారు. కొండపాక గ్రామములో40 బైకులు,రెండు ట్రాక్టర్లకు జరిమానాలు విధించడం జరిగింది. ప్రభుత్వ అనుమతుల లేకుండా అక్రమంగా ఇసుక తో నిండి ఉన్న మరో ట్రాక్టర్ ను పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా హుజురాబాద్ ఎసిపి మాధవి మాట్లాడుతూ యువకులు గ్రామాలలో సెల్ ఫోన్ లలో అశ్లీల చిత్రాలను చూస్తున్నారని,అంతే కాకుండా అమ్మాయిలను వేధించడం లాంటివి చేయడం మూలంగా జీవితాలు నాశనమవుతాయని,వారిపై తల్లితండ్రులు దృష్టి సారించాలన్నారు.వాహన దారులు తప్పకుండా నెంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకోవాలని, వాహన పత్రాలతో పాటు, డ్రైవింగ్ లైసెన్స్,ఇన్సూరెన్స్ పత్రాలుంటే ప్రమాదములు జరిగినప్పుడు ఇన్సూరెన్స్ డబ్బులు వస్తాయని,ఒక వేల లేక పోతే కుటుంబాలు రోడ్డున పడతాయని వివరించారు. సైబర్ నేరగాళ్ల మోసాలు,ఫోక్సో చట్టం పై పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాదారపు సరోజన రాజేంద్ర ప్రసాద్, సీఐ లు రామకృష్ణ, కరుణాకర్,శ్రీనివాస్,ఎస్ఐ లు ఆవుల తిరుపతి,శేఖర్ రెడ్డి,స్వాతి,ఉప సర్పంచ్ మహేష్ తోపాటు ఆయా పోలీస్ స్టేషన్ల 60 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మోకాళ్ల నొప్పులతో బాధపడేవారికి ఆధునిక వైద్యం

- మళ్లీ ఆత్మవిశ్వాసంతో అడుగులు వేసే అవకాశం
- 150కి పైగా రోబోటిక్ సర్జరీల అనుభవం - కీళ్ల సమస్యల పై ప్రజలకు అవగాహన
- హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రికి చెందిన ప్రముఖ రోబోటిక్ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ సాయి ఫణి చంద్ర




కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 11 (జనంసాక్షి) : రోజు వారీ పనులు చేసుకోవడానికి కుటుంబ సభ్యుల సహాయం తీసుకోవాల్సి వస్తోందా? కీళ్ల సమస్యలతో బాధపడుతున్నవారు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, ఆధునిక వైద్య చికిత్సలపై అవగాహన పెంచుకోవాలని హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రికి చెందిన ప్రముఖ రోబోటిక్ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ సాయి ఫణి చంద్ర తెలిపారు. వరల్డ్ ఆర్థరైటిస్ డే సందర్భంగా ఆదివారం రోజు కరీంనగర్ లోని శ్వేతా సాయి ఫణి క్లినిక్ లో విలేకరుల సమావేశంలో ప్రముఖ రోబోటిక్ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ సాయి ఫణి చంద్ర మాట్లాడుతూ... కీళ్ల ఆరోగ్యం, మోకాళ్ల నొప్పులు, ఆధునిక ఆర్థోపెడిక్ చికిత్సలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కీళ్ల సమస్యలకు గల కారణాలు, అందుబాటులో ఉన్న చికిత్సా పద్ధతులు, రోబోటిక్ సర్జరీ ప్రాధాన్యత గురించి ప్రజలకు వివరించారు. నొప్పులతో బాధపడుతున్నవారు నిర్లక్ష్యం చేయవద్దని, వయస్సు పెరగడం, కీళ్ల అరుగుదల తదితర కారణాలతో చాలా మంది మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నారని, కొందరికి నడవడం, మెట్లు ఎక్కడం, రోజువారీ పనులు చేసుకోవడం కష్టంగా మారుతుందని, ఇలాంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, సకాలంలో వైద్యులను సంప్రదించి తగిన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కీళ్ల నొప్పులు ఉన్న ప్రతి ఒక్కరికీ శస్త్రచికిత్స అవసరం ఉండదని, రోగి ఆరోగ్య పరిస్థితి, నొప్పుల తీవ్రత, కీళ్ల అరుగుదల స్థాయిని పరిశీలించిన తర్వాతే సరైన చికిత్సను నిర్ణయిస్తారని తెలిపారు. మందులు, వ్యాయామం, ఫిజియోథెరపీ వంటి చికిత్సా పద్ధతులతో పాటు, అవసరమైన సందర్భాల్లో శస్త్రచికిత్సను పరిశీలించవచ్చని వివరించారు.

### రోబోటిక్ సర్జరీతో ఆధునిక చికిత్స :

మోకాళ్ల కీళ్ల అరుగుదల తీవ్రంగా ఉన్న కొందరు రోగులకు రోబోటిక్ సహాయక మోకాలి మార్పిడి శస్త్రచికిత్స ఒక ఆధునిక చికిత్సా ఎంపికగా ఉపయోగపడుతుందని ప్రముఖ డాక్టర్ సాయి ఫణి చంద్ర వివరించారు. రోబోటిక్ సాంకేతికత శస్త్రచికిత్సకు ముందస్తు ప్రణాళిక రూపొందించడంలో, ఎముకల నిర్మాణాన్ని అంచనా వేయడంలో, శస్త్రచికిత్స సమయంలో వైద్యులకు సహాయపడుతుందని తెలిపారు. అయితే రోగి పరిస్థితిని బట్టి వైద్యులు తగిన చికిత్సా విధానాన్ని ఎంచుకోవడం ముఖ్యమని పేర్కొన్నారు.

### 150కి పైగా రోబోటిక్ సర్జరీలు :

డాక్టర్ సాయి ఫణి చంద్రకు సంబంధించి150కి పైగా రోబోటిక్ సర్జరీలు నిర్వహించిన అనుభవం ఉందని, ఆధునిక ఆర్థోపెడిక్ వైద్య సేవలపై ప్రజల్లో అవగాహన పెంచడం, కీళ్ల సమస్యలతో బాధపడుతున్నవారు సరైన సమయంలో వైద్య సలహా పొందేలా ప్రోత్సహించడం ఈ అవగాహన కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని డాక్టర్ సాయి ఫణి చంద్ర తెలిపారు.

# సుద్దులం సర్పంచ్ భర్తపై కేసు

- చిన్న రెడ్డి తలపై కుర్చీతో దాడి.. తీవ్ర రక్తస్రావం
- పని మానేస్తానన్నందుకే దాడి చేశాడని బాధితుడి ఆరోపణ
- రక్తాన్ని కుటుంబ సభ్యులు శుభ్రం చేశారంటూ వెల్లడి
- ఊరు దాటితే చంపేస్తానని బెదిరించాడని బాధితుడి ఆవేదన



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 11 (జనంసాక్షి): వ్యవసాయ పనులు మానేస్తానని చెప్పినందుకు చిన్న రెడ్డి పై సుద్దులం సర్పంచ్ భర్త తీనేటి లక్ష్మణ్‌రెడ్డి కుర్చీతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.తలపై బలంగా కొట్టడంతో తీవ్ర రక్తస్రావమైందని, మోకాళ్లపై కూడా దాడి చేయడంతో వాపు వచ్చిందని బాధితుడు చిన్నారెడ్డి డిచ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన సుద్దులం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా భైంసా మండలం కాంబోలు గ్రామానికి చెందిన చిన్నారెడ్డి నాలుగు నెలల క్రితం సుద్దులం గ్రామానికి చెందిన తీనేటి లక్ష్మణ్‌రెడ్డి వద్ద వ్యవసాయ పనులు చేసేందుకు కుదిరాడు. అయితే కొంతకాలంగా తనకు సరిగా భోజనం పెట్టడం లేదని, ఇకపై వ్యవసాయ పనులు చేయలేనని చెప్పినట్లు బాధితుడు పేర్కొ న్నాడు. దీంతో లక్ష్మణ్‌రెడ్డి తన నివాసానికి పిలిపించి చంపేస్తానని బెదిరించండని తెలిపాడు. పని ఎందుకు మానేస్తున్నావంటూ దూషిస్తూ, సుద్దులం గ్రామం దాటి వెళ్తే చంపేస్తానని బెదిరించాడని చిన్నారెడ్డి ఆరోపించాడు. ఈ క్రమంలో పక్కనే ఉన్న కుర్చీని తీసుకుని తన తల కుడివైపు బలంగా కొట్టడంతో తీవ్ర రక్తస్రావమైందని, మోకాళ్లపై కూడా కొట్టడంతో వాపు వచ్చిందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. తలకు గాయమై రక్తం కారుతున్న సమయంలో లక్ష్మణ్‌రెడ్డి తల్లి, అక్క, భార్య కలిసి రక్తాన్ని శుభ్రం చేశారని బాధితుడు ఆరోపించాడు. అక్కడే ఉన్న మాజీ సర్పంచ్ వెంకటేశ్ తనకు సహాయం చేయలేదని వాపోయాడు. డిచ్పల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన అనంతరం నిజామాబాద్ లోని గవర్నమెంట్ హాస్పిటల్లో చూయించుకున్నానని తన తలకు గాయం కలిగి రక్తస్రావం జరగడంతో అక్కడి వైద్యులు చికిత్స చేసి గాయానికి మూడు స్టిచ్చేస్ (కుట్లు) వేశారని ఆయన తెలిపారు.

# దసరా వరకు సూరమ్మ ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల నిర్మాణం ప్రారంభం

- సింగిల్ విండో సంఘాలు రైతులకు అండగా నిలవాలి
- మండల కేంద్రానికి అన్ని గ్రామాల నుండి లింక్ రోడ్లు
- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కథలాపూర్ అక్టోబర్ 11 (జనం సాక్షి) : దసరా నాటికి సూరమ్మ ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల నిర్మాణాన్ని ప్రారంభిస్తామని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కథలపూర్ మండల పరిధిలోని గంభీర్ పూర్, సిరికొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన అధ్యక్ష కార్యవర్గ సభ్యుల అభినందన సభలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గాన్ని అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ సింగిల్ విండో సంఘాలు రైతులు పండించిన పంటలను మధ్యవర్తుల ప్రమేయం లేకుండా కొనుగోలు చేసే ప్రక్రియలో సహకరించాలని సూచించారు. కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులను గత పదేళ్లలో పట్టించుకోని వారు ఇప్పుడు రైతుల పేరుతో ఆందోళనలు చేయడం విడ్డూరంగా ఉందని ఆది శ్రీనివాస్ విమర్శించారు. ప్రాజెక్టు పనులు సుమారు 90 శాతం పూర్తయ్యే దశకు చేరుకున్నాయని, కుడి, ఎడమ కాలువల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పరిహారం కోసం సుమారు రూ.80 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసే దిశగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కాలువల నిర్మాణం పూర్తయితే కథలాపూర్, మేడిపల్లి, భీమారం తదితర ప్రాంతాల్లో సుమారు 43,100 ఎకరాలకు సాగునీరు అందించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. రైతుల సమస్యలు పరిష్కరించాల్సిన సమయంలో రాజకీయ ప్రయోజనాల కోసం నిరసనలు చేపట్టడం సరైన పద్ధతి కాదని వ్యాఖ్యానించారు. గతంలో అధికారంలో ఉన్నవారు ప్రాజెక్టు పనుల విషయంలో ఏం చేశారో ప్రజలకు వివరించాలని ప్రతిపక్ష నేతలను ప్రశ్నించారు. దుర్శెడ్, కోనాపూర్-పెన్పట్టి ప్రాంతాల్లో ఉన్న సబ్‌స్టేషన్ల తర్వాత నాలుగో సబ్‌స్టేషన్ కథలాపూర్ మండలానికి రావడం ఈ ప్రాంత అభివృద్ధిలో ముఖ్యమైన ముందడుగు అని చెప్పారు. ఈ సబ్‌స్టేషన్ పూర్తయితే రైతులు ఎదుర్కొంటున్న లోవోల్టేజీ సమస్యలు తగ్గడంతో పాటు వ్యవసాయ మోటార్లకు మెరుగైన విద్యుత్ సరఫరా అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సిరికొండ గ్రామ అభివృద్ధికి అవసరమైన నిధులు, సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారు. గ్రామంలోని మహిళా సంఘాలకు భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయని, ఇప్పటికే ఒక సంఘానికి రూ.5 లక్షలు అందించినట్లు తెలిపారు. మరో మూడు మహిళా సంఘాలకు కూడా నిధులు మంజూరయ్యాయని, వాటి భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. పనులు పూర్తయిన తర్వాత ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కథలాపూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టేందుకు కట్టుబడి ఉన్నామని, నిరుపేదలకు అండగా నిలుస్తూ ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# వామపక్ష నేతల నిరసనకు అనుమతి నిరాకరించడం సరికాదు

- నిరసన హక్కును అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధం
- ఏఐఎఫ్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి జోజి రెడ్డి




కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 11 (జనంసాక్షి) : ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద వామపక్ష నేతలు చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడాన్ని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి జోజి రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, ప్రజా సమస్యల పై గళమెత్తే వారిని అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. దేశ రాజధానిలో నిరసన కార్యక్రమాలకు అనుమతులు నిరాకరించడం, పోలీసు బలగాలతో ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు విఘాతం కలిగిస్తుందని తెలిపారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసనలు ముఖ్యమైన ప్రజాస్వామ్య మార్గాలని, వాటిని అడ్డుకోవడం సరైన విధానం కాదని పేర్కొన్నారు.

### ఓటర్ల జాబితాల సవరణ పై ఆందోళనలు

భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ పై ప్రజల్లో అనేక సందేహాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఓటర్ల జాబితాల నుంచి అర్హులైన వారి పేర్లు తొలగిపోకుండా ఎన్నికల సంఘం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాదని, ప్రతి అర్హుడైన పౌరుడికి ఆ హక్కు అందేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘం పై ఉందని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ పారదర్శకంగా జరగాలని, పేర్ల తొలగింపుపై వచ్చే అభ్యంతరాలను సమగ్రంగా పరిశీలించాలని కోరారు. ప్రజాస్వామ్య శక్తులు ఐక్యంగా ముందుకు రావాలని, ఈ ప్రక్రియలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు అన్ని ప్రజాస్వామ్య శక్తులు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజల గొంతుకను వినడం, వారి సమస్యలకు పరిష్కారం చూపడం ప్రభుత్వాల బాధ్యత అని, ప్రజాస్వామ్య పరిరక్షణకు, ప్రజా సమస్యల పరిష్కారానికి అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని అంబటి జోజి రెడ్డి స్పష్టం చేశారు.

# మద్యం మత్తులో బస్సులో హల్‌చల్

- డీఎస్పీ గన్‌మెన్‌నంటూ హంగామా



కరీంనగర్ క్రైమ్, అక్టోబర్ 11 (జనంసాక్షి) : ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ మద్యం మత్తులో ఓ వ్యక్తి చేసిన హంగామా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తాను డీఎస్పీ గన్‌మెన్‌నంటూ చెప్పుకుంటూ.. మహిళా ప్రయాణికుల పట్ల అనుచితంగా వ్యవహరించడమే కాకుండా, కండక్టర్‌తోనూ ఘర్షణకు దిగాడు. దీంతో సహనం కోల్పోయిన ప్రయాణికులు బస్సును నేరుగా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి అతడిని పోలీసులకు అప్పగించారు. వేములవాడ నుంచి కరీంనగర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సులో నిన్న రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. కరీంనగర్ శివారులోని చింతకుంట వద్ద ఉన్న కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌కు బస్సును తరలించి, మద్యం మత్తులో ఉన్న షబ్బీర్‌ను పోలీసులకు అప్పగించారు. ప్రాథమిక విచారణలో అతడు వెల్గటూర్ ఎంపీడీవో కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. మరోవైపు, ఘటనను వివరిస్తూ ప్రయాణికులు పోలీస్ స్టేషన్ ఆవరణలో తీసిన సెల్ఫీ వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పోలీస్ అని చెప్పుకుంటూ ప్రయాణికులతో ఘర్షణకు దిగిన షబ్బీర్‌పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని కొత్తపల్లి సీఐ కోటేశ్వర్ తెలిపారు.

# ఓటరు సమగ్ర సవరణ ఎస్ఐఆర్ పై ప్రతిపక్షాల దుష్ప్రచారం

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు




కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 11 (జనంసాక్షి) : దేశంలో 95 కోట్ల ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియ పూర్తైందని ప్రతిపక్షాలు ఎస్ఐఆర్ పై దుష్ప్రచారం చేస్తూ, ప్రజలను గందరగోళం లోకి నెట్టేస్తున్నారని బీజేపి రాష్ట అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. కరీంనగర్ లో ఆదివారం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఎస్ఐఆర్ ప్రక్రియలో 82 కోట్ల మంది ఓటర్లు కొత్తగా వచ్చిన ఓటర్ల జాబితాలో అన్ని ప్రక్రియలు పూర్తి చేసుకొని ఎన్‌రోల్మెంట్ కావడం జరిగిందన్నారు. ఇందులో 88 శాతం వరకు పాత ఓటర్ల జాబితాలో ఉన్నవారే ఎన్‌రోల్మెంట్ పూర్తి చేసుకొని కొత్త ఓటర్ల జాబితాలోకి రావడం జరిగిందని తెలిపారు. 13 కోట్ల మంది ఓటర్లు వివిధ దశల్లో విచారణలో ఉన్నారని తెలిపారు. 2 కోట్ల 89 లక్షల మంది ఓటర్లు మరణించిన ఉన్నారని, దాదాపు 1 కోటి 1 లక్ష మంది ఫేక్ ఓటర్లు, ఒక్కొక్కరు రెండు నుండి మూడు చోట్ల ఉన్నారని తెలిపారు. ఇలాంటి ఓటర్లు ఇప్పటి వరకు వివిధ దశల్లో విచారణకు హాజరు కాకపోవడం, బిఎల్ఓ లకు సరైన ధ్రువపత్రాలు ఇవ్వక పోవడం వల్ల అలాంటి ఓటర్లను షిఫ్టెడ్, ఆబ్సెంట్, డెత్ కెటగిరీ జాబితో రావడం జరిగిందని తెలిపారు. ప్రతి రాజకీయ పార్టీ ఎస్ ఐ ఆర్ కు సంబంధించి బీఎల్ఏ లను నియమించుకొని ఎస్ఐఆర్ పరిశీలన చేసినట్లు తెలిపారు. ఫాం 6 ప్రక్రియ నిరంతరంగా కొనసాగే ప్రక్రియ అని, ప్రతి సంవత్సరం 4 సార్లు ఓటర్ దరఖాస్తు చేస్తే బిఎల్ఓలు , రెవెన్యూ అధికారులు విచారణ జరిపి ఏఆర్ ఓ సమక్షంలో ఓటర్ జాబితాలో పొందుపరచడం జరుగుతుందని, ఎవరిని ఓటర్ జాబితాలో రాకుండ, ఎవరు అడ్డుకోలేరని తెలిపారు. ఫారం 7 ద్వారా ఓటర్లను తొలగించారని ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయని, అది అవాస్తవం అన్నారు. ఫాం 7 అనేది ఓటర్ జాబితాలో ఉన్న వ్యక్తులను ఎవరైన ఆబ్జెక్షన్ చేస్తే సంబంధిత ఓటర్ ను పరిశీలన చేసి సరైందా కాదా తెలువడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు దేశం మొత్తం లో 95 కోట్ల ఓటర్లలో కేవలం 25 లక్షల ఓటర్లు మాత్రమే తొలగించబడ్డారని, కరీంనగర్ ఉమ్మడి జిల్లా మొత్తం చూస్తే కేవలం 8 వేలు మాత్రమే తొలగించబడ్డాయని తెలిపారు. ప్రతి పక్షాలు ఇన్ని అవాస్తవాలు ప్రజలకు ప్రచారం చేస్తున్నారన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వానికి వస్తున్న ప్రజాధరణను ఓర్వలేక ప్రతి పక్షాలు ఎస్ఐఆర్ సాకుతో ప్రభుత్వం పై కుట్రలు చేస్తూ, బురదజల్లే ప్రయత్నం లో భాగమేనని, దేశ వ్యాప్తంగా 9 లక్షల బూతులలో అన్ని రాష్ట్రాల్లో ప్రక్రియ జరిగితే ఓట్లు తొలగించడం ఎవరికి అవసరం అన్నారు. ప్రజాస్వామ్యం మీద విశ్వాసం లేని బొద్దింకలు, కాంగ్రెస్, ఇతర పార్టీల నాయకులని విమర్శించారు. 2014 ఎన్నికల నుండి మోడి గెలుస్తూ వస్తున్నారని, ఓట్లు చోరీ చేసి గెలావలనుకుంటే 303 వచ్చిన సీట్లు బిజేపి కి 240 సీట్ల గ్రాఫ్ ఎలా పడిపోయిందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు తోట అనిల్, మాసం గణేష్, కొంపెల్లి రామన్, సోమిడి వేణు ప్రసాద్, పొన్నం మొండయ్య గౌడ్, కర్రె అనిల్, కోఆప్షన్ సభ్యులు సర్దార్ బల్బీర్ సింగ్, నాయకులు పండుగ నాగరాజు, వెంకట్ రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# 'మహాశక్తి' ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

- తొలి రోజు బాలా త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారి దర్శనం
- పూలతో ఆలయాన్ని సుందరంగా ముస్తాబు
- ధ్వజరోహణ మహోత్సవంలో పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 11 (జనంసాక్షి) : కరీంనగర్ లోని శ్రీ మహాశక్తి ఆలయంలో విజయ దశమి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ఆరంభమయ్యాయి. ఆలయాన్ని పూలతో సుందరంగా ముస్తాబు చేశారు. నవరాత్రుల తొలిరోజున అమ్మవారిని శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి (శైలపుత్రి) రూపంలో సూర్యప్రభ అలకంరణ చేశారు. బాలా త్రిపుర సుందరీ దేవి అవతారం శక్తి, జ్ఞానం, ధైర్యం, నిర్మలత్వానికి ప్రతీక. శరన్నవరాత్రుల ఆరంభంలో ఈ బాలరూపాన్ని ఆరాధించడం ద్వారా దైవభక్తితోపాటు మంచి విలువలను జీవితంలో ఆచరించాలనేది సందేశం. బాలా త్రిపుర సుందరీ దేవి ఆరాధన మనిషిలోని నిర్మలత్వాన్ని మేల్కొలిపి, జ్ఞానమార్గంలో నడిపిస్తుందని భక్తుల విశ్వాసం. దుర్గమ్మ అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో దర్శన మివ్వడం భక్తులకు కనువిందు చేసింది. తొలిరోజు వేలాది భక్తులతో శ్రీ మహాశక్తి దేవాలయం కిటకిటలాడింది. ఉదయం 11 గంటలకు ధ్వజరోహణ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయాన్ని దర్శించుకున్న వేలాది మంది భక్తులు, ముఖ్యంగా భవానీ దీక్షాపరులకు ఆలయ నిర్వాహకులు మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారం అందించారు. నవరాత్రులు ముగిసే వరకు భోజనం, అల్పాహారం అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. మరోవైపు ఆదివారం రోజు నుండి నవరాత్రి ఉత్సవాలు ముగిసే వరకు ప్రతిరోజు సాయంత్రం బ్రహ్మశ్రీ డా. గర్రెపల్లి మహేశ్వర శర్మ 'శ్రీ భాగవత వైభవం'పై ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్నరని ఆలయ నిర్వాహకులు తెలిపారు. అలాగే ప్రతిరోజు రాత్రి 9 గంటలకు అధ్యాత్మిక భావన, భక్తి పాటలతో తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా "దాండియా" కార్యక్రమం నిర్వహించనున్నారు.



# మియాపూర్ సర్కిల్ పరిధిలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు

- అసిస్టెంట్ సహకారంతో వసూళ్ల పర్వానికి తెరలేపిన చైన్‌మెన్...?

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 11 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి జోనల్ పరిధిలోని మియాపూర్ సర్కిల్ పట్టణ విభాగం ఉన్నత అధికారుల ఉదాసీనం... క్రింది స్థాయి సిబ్బంది అన్ని తామై అందిస్తున్న సహకారం... ప్రదర్శిస్తున్న చేతివాటం... మియాపూర్ సర్కిల్ పరిధిలో ప్రస్తుత వ్యవహారం అక్రమ నిర్మాణాలతో కూడిన తేనె తుట్టెలకు ఊతమిస్తున్నాయి. అంతా సవ్యంగానే ఉన్నట్టు కనిపిస్తుంటుంది కానీ అందులోనే కొంత గోప్యంగా జరగాల్సిన తతంగం జరిగిపోతూ లక్షలాదిరూపాయల డబ్బు చేతులు మారుతుండడంతో దాన్ని వరంగా భావిస్తున్న అక్రమార్కులు మరోవైపు ఎలాంటి పద్ధతిపాడు లేకుండా బహులంతస్తుల భవనాలను ఇప్పటి ముప్పడిగా నిర్మిస్తుండడం సర్వసాధారణంగా జరిగిపోతూనే ఉంటుంది. బాహ్య ప్రపంచానికి ఏ మాత్రం అర్థం కాని ఓ వ్యవస్థీకృత అక్రమ వ్యవస్థ ప్రత్యేకమైన కోడ్ విధానంలో మహా యజ్ఞం లా ముందుకు సాగుతూనే ఉంటుంది. ఇందులో విచిత్రం... భాహ్య సమాజానికి అర్థం కాని దేవ రహస్యం ఏమిటంటే ఓవైపు అధికారి... మరోవైపు అర్జీదారు ఇద్దరూ కంటికి కనిపించని పరోక్ష పాత్రధారులే..




### మియాపూర్ సర్కిల్ పరిధిలో తుట్టెలా పుట్టుకొస్తున్న అక్రమ నిర్మాణాలు..."

మియాపూర్ సర్కిల్ పరిధి ప్రధాన భాగం అంతా ముంబై జాతీయ రహదారికి ఇరువైపులా ఉండడంతోపాటు కీలక ప్రాంతంగా మారిన చందానగర్ ఏరియాకూడా ప్రస్తుతం అత్యంత ఆవాసయోగ్యంగా పేరుగాంచింది. ఈ నేపథ్యంలో మియాపూర్, మదినగూడ, దీప్తి శ్రీనగర్, రెడ్డి కాలనీ, అర్జున్ రెడ్డి కాలనీ, హుడా కాలనీ, చందానగర్ కాలనీలలో భారీగా భవన నిర్మాణాలు చోటు చేసుకుంటూ అనేక నూతన కాలనీలు ఆవిష్కృతమవుతున్నాయి. అయితే సదరు కాలనీల నిర్మాణానికి అనుమతులను మంజూరు చేయగలిగిన అధికారాన్ని కలిగి ప్రధాన భూమిక పోషించే మియాపూర్ సర్కిల్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఎందుకో కొంత ఉదాసీన వైఖరిని కనబరుస్తుండడంతో ఎక్కడపడితే అక్కడ అక్రమ నిర్మాణాలు ఊపొందుకొని చూస్తుండగానే అవి పెద్ద పెద్ద కాలనీలుగా మారిపోతుండడం గమనార్హం. విస్తు గొలుపే అంశం. మియాపూర్ సర్కిల్ పరిధిలోని ప్రధాన కాలనీలలో ప్రత్యేకించి ముంబై జాతీయ రహదారికి వైపుల నిజాయితీగా అనుమతి తీసుకుని నిర్మాణానికి నోచుకున్న భవనాలు కొంతవరకే ఉండగా... చాలా భవనాలు లోపాయికారి ఒప్పందాలతో పురుడుపోసుకున్నవేనని సర్కిల్ మరియు ఆయా కాలనీ ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు మొదటినుండి మియాపూర్, చందానగర్ కాలనీల ప్రాంతం శేరిలింగంపల్లి నియోజకవర్గానికి సెంటర్ గా నిలుస్తుండడంతోపాటు వ్యాపారరంగం, విద్య, వైద్యం, ఉపాధి రంగాలు గణనీయంగా మెరుగుపడడంతో ఐటి కారిడార్, గచ్చిబౌలి, కొండాపూర్ తదితర ప్రాంతాలకు అత్యంత సమీపంగా ఉండడంతో బయట ప్రాంతాల నుండి వచ్చిన వారు తమ శాశ్వత మరియు తాత్కాలిక ఆవాసాల కోసం ఈ ప్రాంతం పై ఆధారపడుతుండడంతో మియాపూర్ సర్కిల్ ప్రాంతానికి భారీ డిమాండ్ ఏర్పడింది. దీంతో ఇక్కడి స్థల యజమానులు అధిక సంఖ్యలో ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టడానికి దొడ్డిదారిని ఎంచుకుంటుండడంతో జాతీయ రహదారికి ఆనుకునివున్న పరిసర ప్రాంతాలలో వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు ఊపందుకోవడం గమనార్హం.

### అధికారుల అవసరం లేకుండానే చక్రం తిప్పుతున్న చైన్‌మెన్...?

చందానగర్ సర్కిల్ నుండి మియాపూర్ సర్కిల్‌గా ఈ మధ్యకాలంలోనే పేరు మారిన మియాపూర్ సర్కిల్ పరిధిలో వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు పుట్టుకొస్తున్న తీరుతెన్నులను క్షుణ్ణంగా పరిశీలిస్తే తప్పకుండా సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారుల పాత్ర పై అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రధానంగా ఏదైనా ఒక నిర్మాణం అనుమతిని పొందాలంటే పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ముందుగా తమ సిబ్బంది(చైన్ మెన్)ని క్షేత్రస్థాయి పరిశీలనకు పంపించి అర్జీదారుని ప్రతిపాదన నిబంధనలకు అనుగుణంగా ఉన్నప్పుడే అనుమతులను మంజూరు చేయాలి. అయితే ఇక్కడే అసలు రసవత్తర ఘటనకు టౌన్ ప్లానింగ్ అధికారులు తమ క్రింది స్థాయి సిబ్బంది(చైన్ మెన్) ద్వారా తెరతీస్తున్నారని, ఏదైనా భవన నిర్మాణానికి దరఖాస్తు అందగానే తక్షణమే స్థానిక చైన్ మెన్ ను క్షేత్ర పరిశీలన నిమిత్తం పంపినట్టు బయటికి వ్యవహారం నడిపిస్తూ అంతర్గతంగా సదరు భవన నిర్మాణ యజమానితో లో(రూ)పాయికారి ఒప్పందాన్ని కుదుర్చుకొని ఓ రేటును ఫిక్స్ చేసి అటు అధికారులకు ముట్ట జెప్పాల్సిన బరువును ముట్టజెప్పి ఇటు భవన నిర్మాణదారునికి అందించాల్సిన అనుమతి పత్రాలను తానే స్వయంగా అందజేస్తూ పూర్తిస్థాయి లాబీయింగును తెరచాటున చైర్మన్ ఎంతో పకడ్బందీగా పూర్తి చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. తన ఆర్థిక లావాదేవీలను మొత్తం మియాపూర్ సర్కిల్ తో సంబంధంలేని ఓ ప్రైవేటు వ్యక్తిని తన అసిస్టెంట్గా నియమించుకొని అతని ఫోన్ ఖాతాద్వారా కొనసాగిస్తున్నట్లు విశ్వాసనీయ సమాచారం. ఈ క్రమంలో 200 గజాల స్థలంలో స్టిల్ ప్లస్ 2 అంతస్తుల నిర్మాణం జరగాల్సి ఉన్నా... అక్కడక్కడా ఏకంగా 6 నుంచి ఏడంతస్తుల భవనాలు దర్జాగా వెలుస్తుండడం వెనక చైన్ మెన్ పాత్ర కాదన లేనిదని మియాపూర్ డివిజన్ ప్రాంత వివిధ కాలనీలు, అసోసియేషన్లు స్పష్టం చేస్తున్నాయి. వందల సంఖ్యలో భారీ నిర్మాణాలు రూపుదిద్దుకొని ఒక్క చైన్ మెన్ మరియు అతని అసిస్టెంట్ లక్షలాది రూపాయలు వెనకేసుకున్నట్లు తెలుస్తోంది. అనధికార అంతస్తుల అనుమతులకు ఒక్కోదానికి 2 నుండి ఆరు లక్షల రూపాయలను భవన నిర్మాణ యజమాని చైన్ మెన్ ద్వారా అధికారులకు సమర్పించుకోవడం జరుగుతుందని ఈ మొత్తం వ్యవహారాన్ని చైన్ మెన్, అతని అనధికార అసిస్టెంట్ ఏ చిన్న పొరపాటు లేకుండా, ఎవ్వరికంటా పడకుండా సజావుగా పూర్తి చేస్తున్నాడని స్థానికులు బాహాటంగా చెవులు కొరుక్కుంటున్నారు. అధికారులకు చిత్తశుద్ధి ఉంటే దీనిపై ఒక ఉన్నత స్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేసి మియాపూర్, మదినగూడ, హుడా కాలనీ చందానగర్ ప్రాంతాల పరిధిలో ఉన్న లేఅవుట్లు, ప్రస్తుతం అర్హత కలిగిన భవనాల లెక్కలు సరిచూస్తే కోట్ల రూపాయల కుంభకోణం బయటికి వస్తుందనేది స్థానికుల భావన. తమపై వస్తున్న ఆరోపణలనుండి అధికారులు పక్కకు జరిగి తమ చిత్తశుద్ధిని చాటుకోవాలంటే తప్పకుండా మియాపూర్ సర్కిల్ పరిధిలో జరుగుతున్న అక్రమాలను నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉందని స్వచ్ఛంద సంస్థలు స్పష్టం చేస్తున్నాయి.

## గరుడ వస్త్రాలయాన్ని ప్రారంభించిన సినీనటి భాగ్యశ్రీ

- వస్త్రాలయాల ఏర్పాటుతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు
- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 11 (జనంసాక్షి) :** వనపర్తి జిల్లా కేంద్రంలోని కొత్తకోట రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన గరుడ వస్త్రాలయాన్ని ఆదివారం సినీనటి భాగ్యశ్రీ, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, ప్రారంభించారు. ఈ సందర్భంగా వస్త్రాలయ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ, వనపర్తి పట్టణంలో నూతన వ్యాపార సంస్థలు ఏర్పాటవడం అభినందనీయమని అన్నారు. వస్త్రాలయాలు, ఇతర వాణిజ్య సంస్థల ఏర్పాటుతో స్థానికంగా ఆర్థిక కార్యకలాపాలు పెరగడమే కాకుండా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. వ్యాపార రంగంలో కొత్తగా అడుగుపెట్టే ఔత్సాహికులకు ప్రోత్సాహం అందించాలని, స్థానికంగా వ్యాపారాలు అభివృద్ధి చెందడం ద్వారా పట్టణ ప్రగతికి దోహదపడుతుందని తెలిపారు. వనపర్తి పట్టణం వ్యాపార, వాణిజ్య రంగాల్లో మరింత అభివృద్ధి చెందేందుకు ఇలాంటి సంస్థల ఏర్పాటు ఉపయోగపడుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు. నూతనంగా ప్రారంభించిన గరుడ వస్త్రాలయం ప్రజలకు నాణ్యమైన వస్త్రాలను అందిస్తూ వినియోగదారుల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సినీనటి భాగ్యశ్రీ హాజరుకావడంతో అభిమానులు, స్థానిక ప్రజల్లో ఆసక్తి నెలకొంది. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ఒకే వేదికపై పాల్గొని వస్త్రాలయ నిర్వాహకులను అభినందించడం విశేషంగా నిలిచింది. వనపర్తి జిల్లా కేంద్రంలో కొత్త వ్యాపార సంస్థలు ఏర్పాటవడం స్థానిక వాణిజ్య రంగానికి ప్రోత్సాహాన్నిస్తుందని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో వ్యాపార సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు గువ్వల బాలరాజు, వనపర్తి జిల్లా బీజేపీ అధ్యక్షుడు డి. నారాయణ, రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు అనుజ్ఞారెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు

- బాలా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనం



**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 11 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల తొలిరోజు అమ్మవారిని బాలా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో కలశ స్థాపన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం మార్కెట్‌లోని శివాలయం నుంచి అమ్మవారి కలశం, ఉత్సవ విగ్రహంతో పూణే బ్యాండ్ వాయిద్యాల నడుమ శోభాయాత్ర ఘనంగా ప్రారంభమైంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ పరిసరాలు భక్తిపారవశ్యంతో మార్మోగాయి. శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించనున్న నేపథ్యంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

# బహుజన తెలంగాణ కోసం మరోసారి బతుకమ్మ ఉద్యమం కావాలి

- ఓయూకు రూ.వెయ్యి కోట్ల నిధులు సాధిస్తాం కల్వకుంట్ల కవిత..



**సికింద్రాబాద్, అక్టోబర్ 11 (జనం సాక్షి) :** బహుజన తెలంగాణ సాధన కోసం మరోసారి బతుకమ్మ ఉద్యమ స్వరూపం దాల్చాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొని వారితో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మ కీలక పాత్ర పోషించిందని, ఇప్పుడు సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కోసం మరోసారి ఉద్యమ స్ఫూర్తిగా మారాలని అన్నారు. పేదింటి బిడ్డలకు రాజకీయ అధికారంలో భాగస్వామ్యం కల్పించాలని, విద్యార్థులు అనుచరులుగా కాకుండా నాయకులుగా ఎదగాలని సూచించారు. ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రకటించిన రూ.వెయ్యి కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీల్లో కనీస సౌకర్యాలు కల్పించడంతోపాటు ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని కోరారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు యూనివర్సిటీలను నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్‌లో భాగస్వామిగా ఉన్నందుకు మరోసారి క్షమాపణలు చెబుతున్నానని పేర్కొన్నారు. ఎన్నికల ప్రధాన కమిషనర్‌ను మార్చడం మాత్రమే కాకుండా ఎన్నికల వ్యవస్థలో మార్పులు రావాలని, ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు నిర్వహించాలని కవిత డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల ఎన్నికలు పునరుద్ధరించి యువతకు నాయకత్వ అవకాశాలు కల్పించాలని అన్నారు. రోహిత్ వేముల చట్టం, జాబ్ క్యాలెండర్‌పై కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. విద్యార్థులు నిర్భయంగా ప్రశ్నిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుండాలని పిలుపునిచ్చారు.

## అమీర్‌పేట్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిపాడిన డాక్టర్ కోట నీలిమ



**అమీర్‌పేట్, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** అమీర్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో సత్యం థియేటర్ సర్కిల్ వద్ద బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పీసీసీ వైస్ ప్రెసిడెంట్, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు, కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులతో కలిసి ఆమె బతుకమ్మ ఆడిపాడారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మల నడుమ మహిళలు ఉత్సాహంగా పాల్గొనడంతో సత్యం థియేటర్ సర్కిల్‌లో పండుగ సందడి నెలకొంది. ఈ సందర్భంగా డాక్టర్ కోట నీలిమ మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచులందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మహిళల ఐక్యతకు, ప్రకృతిపై ప్రేమకు ఈ వేడుకలు నిదర్శనమన్నారు. ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మను అందంగా పేర్చి, సంప్రదాయ పాటలతో మహిళలంతా ఒకచోట చేరి వేడుకలు జరుపుకోవడం తెలంగాణ ప్రత్యేకత అని చెప్పారు. పూలనే దేవతా స్వరూపంగా భావించి పూజించే గొప్ప సంప్రదాయం మన రాష్ట్రంలో ఉందన్నారు. తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వాన్ని, సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పే బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్ల నిధులు మంజూరు చేసిందని ఆమె తెలిపారు. మహిళలు తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు అందించాలని సూచించారు. పండుగలు ప్రజల మధ్య స్నేహభావాన్ని, ఐక్యతను పెంపొందించడంతో పాటు కుటుంబాలు, సమాజం మధ్య అనుబంధాలను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాలతో, సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు, డి రవికిరణ్ ఎస్ఆర్ నగర్ డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వరిగుంతం పంచాయతీ నిధుల లెక్కలపై రగడ

- సర్పంచ్, కార్యదర్శి పై కాంగ్రెస్ నేతల ఆరోపణలు
- ఆవుల రాజిరెడ్డిని కలిసిన గ్రామ కాంగ్రెస్ నాయకులు
- నిధుల వినియోగంపై క్షేత్రస్థాయి విచారణకు హామీ
- కలెక్టర్ ప్రజావాణిలో ఫిర్యాదుకు సిద్ధం



**కౌల్వారం, అక్టోబర్ 11 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా కౌల్వారం మండలం వరిగుంతం గ్రామపంచాయతీలో నిధుల వినియోగంపై వివాదం కొనసాగుతోంది. గ్రామ సర్పంచ్ పుట్లగళ్ల మోహన్, పంచాయతీ కార్యదర్శి కుమ్మక్కై నిధులను ఇష్టానుసారంగా డ్రా చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డిని కలిసి గ్రామంలో పంచాయతీ నిధుల వినియోగంపై నెలకొన్న వివాదాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు మాజీ ఎంపీటీసీ తుడుము రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు అచ్చన్నపల్లి శ్రీరాములు తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ నిధుల ఖర్చుపై సమగ్ర విచారణ జరిపించి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఆవుల రాజిరెడ్డిని కోరినట్లు చెప్పారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. పంచాయతీ నిధుల వినియోగంపై ఉన్నతాధికారులతో క్షేత్రస్థాయిలో విచారణ జరిపిస్తామని, నిధుల దుర్వినియోగం జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా చూస్తామని రాజిరెడ్డి తెలిపినట్లు వారు వెల్లడించారు. అలాగే, ఈ వ్యవహారంపై సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదు చేయాలని సూచించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌల్వారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏల్లుగారి శ్రీనివాసరెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చిట్యాలలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా దశాబ్ది ఆవిర్భావ వేడుకలు

- కేసీఆర్, నిరంజన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం



**వనపర్తి రూరల్, అక్టోబర్ 11 (జనం సాక్షి) :** వనపర్తి జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా వనపర్తి మండలం చిట్యాల గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో దశాబ్ది ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు కే. మాణిక్యం, సింగిల్ విండో చైర్మన్లు వెంకట్రావు, భాను ప్రకాష్ రావు, సర్పంచ్ శోభ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీకి చిట్యాల గ్రామం ఎన్నో ఏళ్లుగా కంచుకోటగా నిలుస్తోందని, గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు పార్టీ పునాదులు వేసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే అతిపెద్ద వ్యవసాయ మార్కెట్ యార్డును చిట్యాలలో ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో జిల్లా కార్యాలయాలు, విద్యాసంస్థలు ప్రజలకు చేరువయ్యాయని, సాగునీటి సదుపాయాల అభివృద్ధికి కూడా ప్రాధాన్యం లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ రఘువర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ధర్మనాయక్, నాయకులు మాధవరెడ్డి, నరేష్, అచ్యుతాపురం సర్పంచ్ శాంతయ్య, మాజీ సర్పంచులు ఫుల్ సింగ్ నాయక్, లక్ష్మణ్ నాయక్, శారద, ఆశన్న నాయుడు, కర్ణాకర్, సుధాకర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కొమ్ము రాములు, శ్రీను తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు ఉపాధి,మహిళల సాధికారత,ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యం

- ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి
- ఆమనగల్‌లో ఈ నెల 13న 25వ జాబ్ డ్రైవ్ నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపు




**ఆమనగల్, అక్టోబర్ 11 (జనంసాక్షి) :** నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం,మహిళలను ఆర్థికంగా తీర్చిదిద్దడం, ప్రజారోగ్యాన్ని పరిరక్షించడమే ఐక్యత ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు,టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి అన్నారు.ఆదివారం ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో 6 మండలాల మీడియా ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 25వ జాబ్ డ్రైవ్,ఐక్యత స్వచ్ఛ జలధార కార్యక్రమాల వివరాలను వెల్లడించారు.

### 13న ఆమనగల్ లో 25వ జాబ్ డ్రైవ్

ఈ నెల 13,న మంగళవారం ఆమనగల్ లో 25వ జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.ఒక కార్యక్రమం నిర్వహించడం గొప్ప కాదని,దాని ద్వారా ప్రజలకు ఎంత లబ్ధి చేకూరిందనేదే ముఖ్యమని అన్నారు.గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగ కల్పనలో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు.పెద్ద సంఖ్యలో కంపెనీలను పిలవడం కంటే,ఒకటి లేదా రెండు కంపెనీలతో ప్రత్యేకంగా డ్రైవ్ లు నిర్వహించి,ఎంపికైన అభ్యర్థులకు నిజంగా ఉద్యోగం వచ్చిందా లేదా అనే విషయాన్ని కూడా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.ఉద్యోగం కోసం వచ్చే ప్రతి అభ్యర్థి వెనుక ఒక కుటుంబం,ఎన్నో ఆశలు ఉంటాయి.వారి ఆశలకు తగిన అవకాశాలు కల్పించడం మా బాధ్యత అని పేర్కొన్నారు.

### అర్హతలు-వేతన వివరాలు

విద్యార్హతలు,ఎస్ఎస్ సి,ఇంటర్, డిగ్రీ,డిప్లొమా,వయసు18 నుంచి 35 సంవత్సరాలు,వేతనం బేసిక్ ఓడీఏ కలిపి నెలకు రూ.15,000.మినహాయింపులు పోను చేతికి రూ.12,937 పొందుతారని తెలిపారు.అదనపు సౌకర్యాలు,నివాస భత్యం రూ.2000, హాజరు బోనస్ రూ.1500, షిఫ్ట్ అలవెన్స్, ఉచిత రవాణా,ఉచిత భోజనం.గ్రామీణ యువత,మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని,వివరాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.

### స్వచ్ఛ జలధార - 134 గ్రామాల్లో పూర్తి

ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా చేపట్టిన ఐక్యత స్వచ్ఛ జలధార కార్యక్రమం ద్వారా తలకొండపల్లి మండలంలో 31 గ్రామ పంచాయతీల పరిధిలో 65 గ్రామాలు,వెల్దండ మండలంలో 32 గ్రామ పంచాయతీల పరిధిలో 69 గ్రామాలు..మొత్తం 63 పంచాయతీలు,134 గ్రామాల్లో నీటి ట్యాంకులను ప్రత్యేక యంత్రాలతో శుభ్రం చేసి పూర్తి చేసినట్లు వెల్లడించారు.మరో రెండు రోజుల్లో కల్వకుర్తి మండలంలో మూడో విడత కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు,చంద్రశేఖర్, కొండల్,తల్లోజు రఘు యాదవ్,యాదయ్య,విజయ్ కుమార్,మహేష్,శ్రీపతి,శేఖర్,నాగిళ్ళ శివ,శ్రీను,మల్లేష్,శ్రీను నాయక్,తదితరులు పాల్గొన్నారు.

# భారత్-జపాన్ స్నేహ బంధం దీర్ఘకాలికం

- హిరోషిమా ప్రిఫెక్చర్‌తో సహకారానికి తెలంగాణలో అపార అవకాశాలు
- తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- సైబర్ గార్డెన్స్‌లో ఘనంగా జపాన్ ఫెస్టివల్




హైదరాబాద్ (జనంసాక్షి) : భారతదేశం, జపాన్ దేశాల మధ్య ఎన్నో ఏళ్ల నుంచి మంచి స్నేహ సంబంధాలు కొనసాగుతున్నాయని తెలంగాణ శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. రెండు దేశాల మధ్య పరస్పర గౌరవం, ప్రజాస్వామ్య విలువలు, ఆర్థిక సహకారం ఆధారంగా దీర్ఘకాలిక స్నేహ బంధాన్ని కొనసాగిస్తున్నాయని చెప్పారు. హైదరాబాద్ హైటెక్ సిటీలోని సైబర్ గార్డెన్స్‌లో జపాన్ ఫెస్టివల్-2026 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, తెలంగాణ రాష్ట్ర శక్తి, గనుల శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. సాంకేతికత, పరిశ్రమలు, మౌలిక సదుపా యాలు, విద్య, సాంస్కృతిక మార్పిడి వంటి రంగాల్లో భారత్, జపాన్ మధ్య సంబంధాలు మరింత అభివృద్ధి చెందాయని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ చాలా వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ, పారిశ్రామిక అభివృద్ధి రంగాల్లో ముందు వరుసలో ఉందని, ముఖ్యంగా పెట్టుబడులు, ఆధునిక తయారీ, సాంకేతికత, ఆవిష్కరణ రంగాల్లో హిరోషిమా ప్రిఫెక్చర్ తో సహకారాన్ని బలోపేతం చేసుకోవడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని వివరించారు. హిరోషిమా శాంతికి, స్థిరత్వానికి, మానవ సంకల్పానికి ప్రతీకగా గౌరవించబడుతోందన్నారు. భారత్-జపాన్ దేశాల మధ్య ఉన్న స్నేహ బంధాన్ని మనం గొప్పగా భావిస్తున్నామని పేర్కొన్నారు. మరింత సహకారం, ప్రజల మధ్య సంబంధాలతో భారత్, జపాన్ మధ్య బంధాలను ఇంకా బలోపేతం చేసుకోవాలని కోరుకుంటున్నామని తెలిపారు.

# క్యాన్సర్‌పై సమష్టి పోరాటంతోనే విజయం సాధ్యం

- క్యాన్సర్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి
- మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్
- గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియంలో క్యాన్సర్ రన్
- భారీ సంఖ్యలో పాల్గొన్న యువతీ, యువకులు




హైదరాబాద్ (జనంసాక్షి) : క్యాన్సర్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, వ్యాధి నివారణ, ముందస్తు గుర్తింపు ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన క్యాన్సర్ అవగాహన ర్యాలీ, క్యాన్సర్ రన్‌లో మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే అరికేపూడి గాంధీ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో యువతీ, యువకులు ఈ రన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ప్రజారోగ్యం కోసం గ్రేస్ ఫౌండేషన్ చేపట్టిన ఈ అవగాహన కార్యక్రమం అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాల్లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడం స్ఫూర్తిదాయకమని అన్నారు. క్యాన్సర్‌పై అవగాహనను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. క్యాన్సర్‌పై పోరాటం ఒక వ్యక్తి లేదా ఒక సంస్థ బాధ్యత మాత్రమే కాదని, సమాజమంతా కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. భారత దేశం నుంచి క్యాన్సర్ మహమ్మారిని తరిమివేసే మహా యజ్ఞంలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ క్యాన్సర్ మహమ్మారిని సమాజం నుంచి పారద్రోలేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వంతో పాటు ప్రజలు, వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెంచడం, వ్యాధి పట్ల ఉన్న అపోహలను తొలగించడం, ముందస్తు గుర్తింపు పరీక్షలను ప్రోత్సహించడం ద్వారా క్యాన్సర్ ముప్పును తగ్గించవచ్చని మంత్రి పేర్కొన్నారు. వ్యాధిని ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స మెరుగ్గా పనిచేసే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. క్యాన్సర్ రహిత సమాజం మనందరి లక్ష్యం కావాలి. ప్రజల్లో అవగాహన పెంచుతూ, ముందస్తు గుర్తింపు, నివారణ చర్యలకు ప్రాధాన్యతనిస్తూ ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన గ్రేస్ ఫౌండేషన్ నిర్వాహకులకు, పాల్గొన్న ప్రజాప్రతినిధులకు, పోలీసు అధికారులకు, యువతీ యువకులకు మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్ లు అభినందనలు తెలిపారు.

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు విస్తృత మార్కెట్
- హైదరాబాద్‌లో సారస్ మేళాను ప్రారంభించిన మంత్రి సీతక్క



హైదరాబాద్ (జనంసాక్షి) : మహిళలు ఆర్థికంగా ఎదగాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు. గ్రామీణ మహిళల ప్రతిభకు, సృజనాత్మకతకు, స్వయం ఉపాధి అవకాశాలకు వేదికగా నిలుస్తున్న సారస్ గ్రామీణ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయ మేళాను హెచ్‌ఎండీఏ గ్రౌండ్‌లో మంత్రి సీతక్క ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభించారు. డప్పు చప్పుళ్లు, కోయ నృత్యాలు, కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనల మధ్య మేళా ప్రాంగణానికి చేరుకున్న మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి మేళాను ప్రారంభించిన మంత్రి, తెలంగాణతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. మహిళలు స్వయంగా తయారు చేసిన హస్తకళా వస్తువులు, చేనేత ఉత్పత్తులు, సంప్రదాయ కళారూపాలు, గృహోపకరణాలు, ఆహార పదార్థాలు, పచ్చళ్లు, చిరుతిళ్లు, చిరుధాన్యాల ఉత్పత్తులను ఆసక్తిగా పరిశీలించారు. ఒక్కో స్టాల్ వద్దకు వెళ్లి మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తుల ప్రత్యేకతలను అడిగి తెలుసుకున్నారు. వాటి తయారీ విధానం, నాణ్యత, ధరలు, విక్రయాలు, వినియోగదారుల నుంచి వస్తున్న స్పందన గురించి మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడారు. వ్యాపార నిర్వహణలో ఎదురవుతున్న సవాళ్లు, ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడంలో ఉన్న ఇబ్బందులు, వ్యాపారాన్ని మరింత విస్తరించుకునేందుకు ఉన్న అవకాశాలపై ఆరా తీశారు. మహిళలు తమ కష్టంతో, నైపుణ్యంతో తయారు చేస్తున్న ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించడంతో పాటు, వారు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వివరించారు. మహిళలు తమ వ్యాపారాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు కేవలం పొదుపు చేయడం, రుణాలు పొందడానికే పరిమితం కాకుండా ఉత్పత్తిదారులుగా, వ్యాపారవేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళల్లో అపారమైన ప్రతిభ, నైపుణ్యం, సృజనాత్మకత ఉన్నాయని, వారికి తగిన శిక్షణ, ఆర్థిక సహకారం, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తే విజయవంతమైన వ్యాపారాలను నిర్వహించగలరని అన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు...

- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- తిరుమలాయపాలెం మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు



**తిరుమలాయపాలెం, అక్టోబర్ 11 (జనంసాక్షి) :** రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం మండలంలో మంత్రి పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. మంత్రి తెట్టెలపాడు గ్రామంలో తెట్టెలపాడు నుండి బీరోలు ఆర్ అండ్ బి రోడ్డు వరకు 6 కోట్ల 50 లక్షల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు శంఖుస్థాపన, సుబ్లేడ్ గ్రామంలో రూ. 10 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించారు. తిరుమలాయపాలెం మండలానికి చెందిన 26 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి/షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇది ప్రజలు మనస్ఫూర్తిగా ఆశీర్వదించిన ఇందిరమ్మ ప్రభుత్వమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఈ ప్రభుత్వం పేదవాళ్ళకి మంచి చేయాలని, పేదవాళ్ళకి అండదండలుగా ఉండాలని, పేదవాడి కుటుంబం కూడా చిరునవ్వులతో ఎప్పుడూ జీవించాలని అనేక సంక్షేమ కార్యక్రమాలను ఈ 33 నెలల్లో మీ గుమ్మానికి చేర్చిందన్నారు. 200 యూనిట్ల ఉచిత కరెంటు, రైతు భరోసా, రైతు రుణమాఫీ, సన్నబియ్యం, సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు బోనస్‌గా క్వింటాలుకు 500 రూపాయలు, ఆడబిడ్డలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం వంటి అనేక పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. తెల్ల రేషన్ కార్డుతో పాటు, పెద్దోళ్ళు తినే సన్నబియ్యం బువ్వ నా పేదెంటి ఆడబిడ్డ తినాలని సన్న బియ్యం అందజేస్తున్నామన్నారు. డ్వాక్రా మహిళలకి కోటి మందిని కోటీశ్వరులను చేయాలని, ఈ 33 నెలల్లోనే 72,000 కోట్ల రూపాయలు సున్నా వడ్డీకి ఇచ్చే కార్యక్రమం అమలు చేశామన్నారు. పెద్దోళ్ళ పిల్లలు చదివే స్కూళ్లకు దీటుగా ఇంటర్నేషనల్ స్థాయిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పేద పిల్లలు చదివే స్కూళ్లలో 40 శాతం డైట్ ఛార్జీలు, ఆడపిల్లలకు కాస్మొటిక్ ఛార్జీలు 200 శాతం పెంచామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మొదటి విడతగా రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇళ్లు ఇచ్చామని, రెండో విడత రెండున్నర లక్షల ఇళ్లు ఇస్తూ, హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు, రమారమి అన్నీ కలిపి 8 లక్షల ఇళ్లు, 40 వేల కోట్ల రూపాయలు రెండు విడతల్లో నిరుపేద కుటుంబాలకి ఇల్లు కట్టించాలనే తాపత్రయంతో ఈ ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. రెండుసార్లు ఇళ్లు ఇచ్చాం, మా దగ్గర డబ్బులు అయిపోయినాయి, ఇక ఇవ్వము అనేది లేదని, మూడోసారి, నాలుగోసారి ఇస్తామని, అర్హులైన ప్రతి పేదవాళ్లకి నాలుగు విడతల్లో 5 లక్షల రూపాయలు ఉచితంగా ఇచ్చేది ఈ ఇందిరమ్మ ప్రభుత్వమే నని మంత్రి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరుకు, ఏ పార్టీ అని, ఏ కులమని, ఏ మతమని అడగమని, చివరికి ఇల్లు ఇస్తే రేపు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తావా అని కూడా అడగమని అన్నారు. ఒక్క ఇళ్ల కార్యక్రమే కాదు, పేదవాళ్ళ పక్షపాతంగా ఇంకా రాబోయే కొన్ని రోజుల్లో చెప్పిన ప్రతి మాటని పేదింటి ఆడబిడ్డకి ఈ ప్రభుత్వం నెరవేర్చుతుందని మంత్రి అన్నారు. ఆసరా పెన్షన్ కానీ, పేదింటి ఆడబిడ్డలకు ఇవ్వాల్సినవి వందకు వంద శాతం అందిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ డబ్బుని పేదింటి ఆడబిడ్డలకి పంచుతామని మంత్రి అన్నారు. ఎల్నినో ప్రభావం ఒక్క తెలంగాణ రాష్ట్రానికో, భారతదేశానికో కాదని, ప్రపంచవ్యాప్తంగా రాబోయే కొద్ది నెలలు కరెంటుతో పాటు నీటి తాగునీరు సమస్య కూడా రాబోతుందన్నారు. రైతన్నలు మొదటి పంట వేసుకున్నారని, ఎంత ఖరీదైనా కరెంటును కొని వేసిన పంటను నష్టపోకుండా, ఎండిపోకుండా కాపాడే బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. రెండో పంట వేయడానికి నీళ్లు లేవని, 15 రూపాయలకు యూనిట్ చొప్పున కొందామన్న కరెంటు దొరకటం లేదని తెలిపారు. రైతన్నలు అర్థం చేసుకొని రాష్ట్రవ్యాప్తంగా రెండో పంటను వేయొద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఇప్పుడున్న పంటని ఏది ఏమైనా పండించే కార్యక్రమం చేస్తామని, రెండో పంట వేసి కరెంటు లేక, నీళ్లు లేక రైతన్నలు ఇబ్బంది పడొద్దని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, డీఆర్డీవో శ్రీరామ్, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, ఎంపీడీవో సిలార్ సాహెబ్, సీతారాం రెడ్డి సర్పంచ్ లు నర్సమ్మ, స్వాతి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గ్రామ సహాయం నరేష్ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్ మండల పార్టీ ఉపాధ్యక్షులు సామ శ్రీనివాస్ రెడ్డి మాజీ ఎంపీపీ బోడ మంగిలాల్ మద్దులపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ నంద్యాల శ్యాం సుందర్ రెడ్డి మాజీ జెడ్పిటిసి బెల్లం శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు శ్రీనివాస్ రెడ్డి మోర పాక నాగయ్య నంది పాటి మల్లికార్జున్ వనవాసం నరేందర్ రెడ్డి వోరా వెంకటేశ్వర్లు గండు చంద్రయ్య పూసులూరి సురేష్ వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ భాషామాధుర్యాన్ని భావితరాలకు అందించాలి

- టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ భాష జీవభాష అని.. తెలంగాణ భాషలో సృజించిన సాహిత్యం పండిత పామరులను ఒకే విధంగా ఆనందింపజేస్తుందని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సరస్వతీరాజ్-హరిదా అంతర్జాతీయ ఉత్తమ తెలంగాణ కథా పురస్కారం-2026 పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆ మాధుర్యాన్ని తరతరాలకు అందించే విధంగా హరిదా రచయితల సంఘం చేస్తున్న కృషి అభినందనీయమని చెప్పారు. తెలంగాణ భాషలోని సోయగాన్ని, పదబంధాలను, నుడికారాలను, సామెతలను కథల ద్వారా ముందు తరాలకు అందించడం మంచి ప్రయత్నమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ భాషలో కథల పోటీ నిర్వహించడం ఆదర్శనీయమని, తెలంగాణ భాషలో కథను రాయగలిగిన రచయితలందరికీ ఇదొక గొప్ప అవకాశమన్నారు. ఏ భాష గొప్పతనమైన కథల ద్వారానే తెలుస్తుందని ప్రముఖ నటి అనన్య నాగళ్ల అన్నారు. తెలంగాణ భాష, సంస్కృతుల వైభవాన్ని భవిష్యత్ తరాలకు అందించే ఉద్దేశంతోనే ఈ అంతర్జాతీయ స్థాయి కథల పోటీలను నిర్వహిస్తున్నామని హరిదా రచయితల సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్ తెలిపారు. కథలో తెలంగాణతనం తప్పనిసరిగా ప్రతిబింబించాలని, ఎక్కడా ప్రచురితం కాని, సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయని, ఇతర పోటీలకు పంపని సరికొత్త కథలను మాత్రమే పంపాలని స్పష్టం చేశారు. గరిష్ఠంగా ఎనిమిది పేజీలకు మించకుండా పంపాలని సూచించారు. కథ రాసిన పేజీలపై రచయిత పేరు రాయకూడదని, నిబంధనలను అంగీకరిస్తూ విడిగా జతచేసే హామీపత్రంపై మాత్రమే రచయిత పేరు, చిరునామా, ఫోన్ నంబరు, ఈ-మెయిల్ ఐడీ వివరాలను పొందుపరచాలని కోరారు. పోటీల్లో మొదటి ఉత్తమ కథకు రూ.10,000 నగదు పురస్కారం, తర్వాతి తొమ్మిది ఉత్తమ కథలకు ఒక్కొక్కరికి రూ.1,000 నగదు పురస్కారంతోపాటు సముచిత సత్కారం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. డిసెంబర్ 4న నిజామాబాద్‌లోని నవ్యభారతి గ్లోబల్ స్కూల్‌లో జరిగే హరిదా రచయితల సంఘం మహాసభలో ప్రదానం చేస్తామన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న కథా రచయితలు తమ కథను, హామీ పత్రాన్ని ఈనెల 30వ తేదీలోపు haridaasaraswathiraj@gmail.com ఈ-మెయిల్‌కు పంపాలని కోరారు.

# నైపుణ్యంతో కొలువుల బాట!

- సింగరేణి ఆర్జీ-1 నైపుణ్య శిక్షణ కేంద్రం నుంచి 112 మంది ఉద్యోగాలకు ఎంపిక
- ఫాక్స్‌కాన్‌లో 87 మంది మహిళలకు అవకాశం
- తొలి విడతలో బయలుదేరిన 55 మంది మహిళలు



హైదరాబాద్ (జనంసాక్షి) : సింగరేణి ప్రభావిత ప్రాంతాల నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ప్రజా ప్రభుత్వ సంకల్పం సత్ఫలితాలనిస్తోంది. రామగుండం-1 ఏరియాలోని సింగరేణి జీవీటీసీ నైపుణ్యాభివృద్ధి కేంద్రం ద్వారా తాజాగా 154 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 127 మంది మహిళా అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా.. వీరిలో 87 మంది హైదరాబాద్లోని ఫాక్స్‌కాన్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపిక కాగా, మరో 27 మంది పురుష అభ్యర్థులు సోలార్ టెక్నీషియన్ ఇంటర్వ్యూలకు హాజరు కాగా.. వీరిలో 25 మంది సోలార్ టెక్నీషియన్లుగా ఉద్యోగాల్లో చేరనున్నారు. ఫాక్స్‌కాన్కు ఎంపికైన మహిళల్లో తొలి విడతగా 55 మంది ఆదివారం గోదావరిఖని నుంచి హైదరాబాద్కు బయలుదేరారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క రెండేళ్ల క్రితం ప్రారంభించిన ఈ కేంద్రం స్థానిక యువతకు నైపుణ్య శిక్షణతోపాటు ఉద్యోగ అవకాశాలను అందిస్తోంది. గత రెండేళ్లలో 500 మందికి పైగా ఉపాధి అవకాశాలు కల్పించింది. మార్కెట్ లో డిమాండ్ ఉన్న కోర్సుల్లో శిక్షణ ఇస్తూ ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటోంది.

## మహిళలకు తయారీ రంగంలో అవకాశాలు

ఫాక్స్‌కాన్ కంపెనీ ఆధ్వర్యంలో గత వారం జీవీటీసీ నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో మహిళా అభ్యర్థులకు ప్రత్యేక ఉద్యోగ ఇంటర్వ్యూలు నిర్వహించారు. హైదరాబాద్లోని కంపెనీ తయారీ కేంద్రంలో ఆపిల్ ఇయర్పాడ్స్, ఎలక్ట్రానిక్ విడిభాగాల అసెంబ్లింగ్ విభాగాల్లో పనిచేసేందుకు 87 మంది మహిళలను ఎంపిక చేశారు. స్థానిక మహిళలకు పారిశ్రామిక రంగంలో లభించిన ఈ అవకాశాలు వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడనున్నాయి. సోలార్ టెక్నీషియన్ కోర్సులో శిక్షణ పొందిన 25 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆర్జీ-1 జీఎం డి. లలిత్ కుమార్ తెలిపారు. వీరు పది రోజుల్లో ఎల్ అండ్ ఎన్ కంపెనీలో ఉద్యోగాల్లో చేరనున్నట్లు పేర్కొన్నారు.

## నైపుణ్యాలతో భవిష్యత్తుకు పునాది

సింగరేణి ప్రభావిత ప్రాంతాల యువతకు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు సంస్థ కృషి చేస్తోందని జీఎం డి. లలిత్ కుమార్ అన్నారు. శిక్షణను ఉద్యోగ అవకాశాలతో అనుసంధానించడం ద్వారా యువత మెరుగైన భవిష్యత్తును నిర్మించుకునే అవకాశం లభిస్తోందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో పనిచేస్తూ వృత్తిలో ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్వో టు జీఎం ఎస్.కె. చంద్రశేఖర్, ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ శ్రీ మద్ది ఎల్లయ్య, టాస్క్ మేనేజర్ డాక్టర్ కౌసల్య, ఎల్ అండ్ ఎన్ డైరెక్టర్ కౌశల్, ఫాక్స్‌కాన్ హెచ్‌ఆర్ ప్రతినిధి ఆర్. శ్రీనివాస్, జీవీటీసీ మేనేజర్ మాధవరెడ్డి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శ్రవణ్ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఇండియన్ బాక్సింగ్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా కె.ఎస్. రవికుమార్

మహబూబ్‌నగర్ (జనంసాక్షి) : ఇండియన్ బాక్సింగ్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా జేపీఎన్‌సీఈ అండ్ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కె.ఎస్. రవికుమార్‌ను నియమిస్తూ 'ఇండియన్ అమెచ్యూర్ బాక్సింగ్ అసోసియేషన్' జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రాకేష్ మిశ్రా ప్రకటించారు. ఆదివారం రాత్రి స్థానిక జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న జాతీయ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల చివరి రోజైన ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్న సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రవికుమార్ నియామకంతో రాష్ట్రంలో బాక్సింగ్ జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగి దేశానికి గొప్ప పేరు ప్రతిష్ఠలు తీసుకువస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రవికుమార్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, రాష్ట్రంలో బాక్సింగ్ క్రీడను గ్రాస్‌రూట్ స్థాయి నుంచి వేగంగా అభివృద్ధి చేసి, జాతీయ, అంతర్జాతీయ స్థాయి వరకు మన బాక్సర్ల సత్తా చాటేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రముఖులు కె.ఎస్. రవికుమార్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370